(సీసీఎంలకు మాత్రమే)

# భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువావర్గంపై మన పార్టీ వైఖరి–రాజకీయ కార్యక్రమం

**ముసాయిదా**

**డిసెంబర్ 2024**

కేంద్రకమిటీ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం | 5 |
| 2. | పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ–సామ్రాజ్యవాదం–కార్మికవర్గ విప్లవాల యుగం | 9 |
| 3. | భారతదేశంలో బూర్జువావర్గ ఆవిర్భావం–పరిణామ క్రమం–కులం పాత్ర | 11 |
| 4. | మొదటి దశ వలసవాద కాలం నుంచి 1947 అగస్టు 15 వరకు | 21 |
| 5. | రెండవ దశ 1947 అగస్టు 15 నుంచి 1991 వరకు | 31 |
| 6. | మూడవ దశ 1991 నుంచి నేటివరకు (2024) | 40 |
| 7. | జాతీయ బూర్జువా వర్గం అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న సామ్రాజ్యవాదమూ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గమూ | 56 |
| 8. | భారతజాతి, దేశ సమైక్యత, సమగ్రత పేరుతో దేశాన్ని జాతుల బందిఖానాగా మార్చడం, అఖండ భారత లక్ష్యం వెనక వున్నది సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాలే | 59 |
| 9. | భారతదేశ పాలకవర్గాల విస్తరణవాద కాంక్ష వెనక వున్నది సామ్రాజ్యవాదుల, బ్రాహ్మణీయ హిందుత్వ, పీడక కులాధిపత్య సీబీబీ ప్రయోజనాలే | 62 |
| 10. | సీబీబీ పట్ల రివిజనిస్టుల, వివిధ ఎం–ఎల్ పార్టీల వైఖరులు | 67 |
| 11. | మన రాజకీయ కార్యక్రమం | 78 |

# భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువావర్గంపై

# మన పార్టీ వైఖరి–రాజకీయ కార్యక్రమం

## ముసాయిదా

### డిసెంబర్ 2024

### 1. ఉపోద్ఘాతం

2007 నాటి ఐక్యతా కాంగ్రెస్ సమయంలోనే భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం (కాంప్రడార్ బ్యూరాక్రటిక్ బూర్జువాజీ–సీబీబీ) గురించిన అధ్యయనాంశాన్ని చేపట్టాలని మన కేంద్రకమిటీ (సీసీ) నిర్ణయించింది. కాంగ్రెస్ నాటి నుండి భారత విప్లవోద్యమ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెరపి లేకుండా చేస్తున్న దాడుల ఫలితంగా మన కేంద్రకమిటీ సభ్యులు గణనీయమైన సంఖ్యలో అమరులయ్యారు, అరెస్టయ్యారు. ఫలితంగా భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గంపై మన సీసీ ఈ డాక్యుమెంట్‌ను రూపొందించలేకపోయింది. కాంగ్రెస్ అనంతరం 17 సంవత్సరాల తర్వాత 'భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గంపై మన పార్టీ వైఖరి–రాజకీయ కార్యక్రమం' పేరుతో ఈ ముసాయిదా డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా భారతదేశ విప్లవోద్యమ చరిత్రలో, మన పార్టీ చరిత్రలో సీబీబీపై చర్చను సంక్షిప్తంగా చూద్దాం.

భారతదేశ బూర్జువాజీని జాతీయ బూర్జువాగా, స్వతంత్రమైందిగా గుర్తించిన సీపీఐ, సీపీఎమ్‌ల రివిజనిస్టు, నయా రివిజనిస్టు వాదనల్ని తిరస్కరించి 1970లో జరిగిన మునుపటి సీపీఐ (ఎం–ఎల్) 8వ కాంగ్రెస్‌లో భారతదేశ విప్లవ వ్యూహం/మౌలిక పంథాను రూపొందించింది. సీపీఐ (ఎం–ఎల్) స్రవంతికి చెందిన సీపీఐ (ఎం–ఎల్) [పీపుల్స్‌వార్] 2001 వరకు నాలుగు ప్రముఖ వైరుధ్యాలుగా – సామ్రాజ్యవాదానికీ (అమెరికా, రష్యాలు అగ్రరాజ్యాలుగా ఉన్నపుడు ఆ రెండింటిని కలిపి చెప్పింది) భారతదేశ ప్రజానీకానికీ మధ్య, భూస్వామ్యానికీ అశేష ప్రజానీకానికి మధ్య, పెట్టుబడికి శ్రమకు మధ్య, పాలకవర్గాల మధ్య వైరుధ్యాలను పేర్కొంటూ వచ్చింది. ఈ కాలమంతటా అది దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గానికీ విశాల ప్రజానీకానికి మధ్య గల వైరుధ్యాన్ని ఒక మౌలిక వైరుధ్యంగా గానీ, లేక ఒక ప్రముఖ వైరుధ్యంగా గానీ పేర్కొనలేదు. ఈ వైరుధ్యం సామ్రాజ్యవాదానికీ భారతదేశ ప్రజలకు మధ్యగల వైరుధ్యంలోనూ, పెట్టుబడికి శ్రమకు మధ్యగల వైరుధ్యంలోనూ అంతర్లీనమయ్యే వున్నది కాబట్టి దానిని వేరుగా పేర్కొనవసరం లేదని తన అవగాహనగా చెపుతూ వచ్చింది. మునుపటి సీపీఐ (ఎం–ఎల్) పార్టీ యూనిటీ 1987లో కేంద్ర మహాసభను నిర్వహించింది. ఆ మహాసభ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి ప్రత్యేక ప్రతిపత్తి ఉందనీ, అది సామ్రాజ్యవాదానికి కేవలం ఒక యాంత్రిక కీలుబొమ్మ కాదు అనీ, దేశంలో సామ్రాజ్యవాద దోపిడీకి అది ప్రధాన వాహకం, అది విప్లవ లక్ష్యాలలో (టార్గెట్స్) ఒకటి అని చెపుతూ దళారీ నిరంకుశ బూర్జువా

వర్గానికీ విశాల ప్రజారాశులకు మధ్య వైరుధ్యాన్ని భారతదేశ సమాజంలోని ప్రధాన, మౌలిక వైరుధ్యాల్లో ఒకటిగా చేర్చింది. ఈ విధంగా అది (పార్టీ యూనిటీ–పీయూ) సీబీబీకున్న మెనోవరెబిలిటీ (బేరసారాలాడే శక్తి) గురించి, దానికున్న సాపేక్షిక స్వాతంత్ర్యం గురించి అతిగా నొక్కి చెప్పడంతో భారతదేశ రాజ్యం గురించి పీయూ అవగాహన కమ్యూనిస్టు విప్లవకారులలో అనుమానాలు సృష్టించింది. ఇది మునుపటి పీయూ, పీడబ్ల్యూ, ఎంసీసీఐల మధ్య ఒక ప్రధాన విభేదం అయింది. అయితే విప్లవకారుల ఐక్యతకు ప్రాధాన్యతనివ్వాలనే అవగాహనతో ఈ విషయంలో పట్టు విడుపులు కలిగి వుంటానని పీయూ నిర్ణయించుకుంది. 1998 అగస్టులో పీయూ, పీడబ్ల్యూ మధ్య జరిగిన ఐక్యతా చర్చలలో ఈ వైరుధ్యాన్ని వదులుకోవాలని పీడబ్ల్యూ చేసిన ప్రతిపాదనను పీయూ అంగీకరించింది.

2001లో మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్‌లో సీబీబీ గురించి లోతైన చర్చలు జరిగాయి. ఆ చర్చల తదుపరి దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గానికీ విశాల ప్రజానీకానికీ మధ్య గల వైరుధ్యాన్ని భారతదేశ సమాజపు స్వభావాన్ని నిర్ణయించేటటువంటి మౌలిక వైరుధ్యాల్లో చేర్చాలని ఆ కాంగ్రెస్ తీర్మానించింది. భూస్వామ్యం, సామ్రాజ్యవాదంతో మైత్రిని (అలయెన్స్) కలిగి వున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం మన భారతదేశ సమాజపు, భారతదేశ రాజ్యపు అంతస్సారాన్ని లేదా స్వభావాన్ని నిర్ణయిస్తుంది. దానిని మన విప్లవపు ప్రస్తుత దశలోనే కూలదోయవలసి వుంది. అందువలన, కామ్రేడ్ మావో మౌలిక వైరుధ్యానికి ఇచ్చిన నిర్వచనం ప్రకారమే దానిని మౌలిక వైరుధ్యాలలో ఒకటిగా చేర్చడం సరిగా వుంటుందని పేర్కొంటూ కాంగ్రెస్ ఇలా తీర్మానించింది: "....దళారీ బురాక్రటిక్ బూర్జువా వర్గానికీ విశాల ప్రజానీకానికి మధ్య వైరుధ్యం సామ్రాజ్యవాదానికీ భారతదేశ ప్రజలకూ మధ్య, పెట్టుబడికీ శ్రమకూ మధ్య గల రెండు వైరుధ్యాలలోనే అంతర్భాగంగా వుందని చెప్పుకోవడం భారతదేశ పాలకవర్గాల కూటమికి నాయకత్వం వహిస్తున్న దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గానికీ వున్న ప్రాముఖ్యతనూ, ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదానికీ అమ్మేస్తూ దేశ పురోగతికి అవరోధంగా ఉంటూ అది నిర్వహిస్తున్న అత్యంత ప్రతిఘాతక పాత్రనూ వివరించడానికి సరిపోదు. భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువావర్గం విస్తరణవాద స్వభావాన్ని కలిగి వుంది. సామ్రాజ్యవాదంతో షరీకై భారతదేశంలోని జాతులనే కాక మొత్తం దక్షిణాసియా ప్రాంతంలోని ప్రజానీకాన్ని ప్రత్యక్షంగా పీడించే దోపిడీదారుగా ఉంది. సామ్రాజ్యవాదానికి లోబడి వుంటున్నప్పటికీ, భారతదేశ దళారీ బూర్జువాజీ ఒక విడి వర్గంగా అస్తిత్వంలో వుంది. అది కేవలం కీలుబొమ్మ కాదు. సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తూనే అది స్వంత ప్రయోజనాలను కూడా ఈడేర్చుకుంటోంది." ...."సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానంతో పాటు దళారీ బూర్జువా వర్గాన్ని కూడా ఏకాకిని చేసి దెబ్బ కొట్టాల్సిన అవసరం ఉంది. ...."

సీపీఐ (ఎం–ఎల్) [పీపుల్స్‌వార్]కు ఎంసీసీఐకి మధ్య 2003లో జరిగిన ఐక్యతా చర్చల్లో (యూనిటీ టాక్స్)లో భాగంగా ద్వైపాక్షిక ఒప్పందం (బైలాటరల్ అగ్రిమెంట్స్) కుదుర్చుకునే సందర్భంగా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ, భారతదేశ విశాల ప్రజారాసులకు మధ్య వైరుధ్యాన్ని మౌలిక వైరుధ్యంగా చేర్చితే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పాలకవర్గాల్లోని ఒక

సెక్షన్‌తో ఐక్యసంఘటన కట్టే ప్రమాదం ఉంటుందని, ఆ సెక్షన్ సీబీబీకి ప్రాతినిధ్యం వహించేదిగా ఉంటుందనీ, అలాగే ఈ వైరుధ్యాన్ని పేర్కొనడం ద్వారా భారతదేశ విప్లవ వ్యూహం–ఎత్తుగడలను రూపొందించడంలో పొరపాట్లకు దారితీస్తుందని ఎంసీసీఐ అభిప్రాయపడింది. కాబట్టి దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ, భారతదేశ విశాల ప్రజారాసులకు మధ్య వైరుధ్యాన్ని మౌలిక వైరుధ్యాల్లో చేర్చకూడదని ఇది తమ మౌలిక భిన్నాభిప్రాయమని (బేసిక్ డిఫరెన్స్) అని పేర్కొంది. దీంతో, ఇతర అనేక విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరిన స్థితిలో, ఐక్యత(యూనిటి)కున్న ప్రాధాన్యత రీత్యా పీపుల్స్‌వార్ పార్టీ ప్రతినిధివర్గం (డెలిగేషన్) ఈ వైరుధ్యాన్ని ఉపసంహరించుకోవడానికి అంగీకరించింది.

సెప్టెంబర్ 2004లో జరిగిన ఎంసీసీఐ, సీపీఐ (ఎం–ఎల్) [పీపుల్స్‌వార్] సంయుక్త (జాయింట్) సీసీ సమావేశంలో, తర్వాత జరగనున్న ఐక్యతా కాంగ్రెస్‌లో ఇతర కొన్ని విభేదాలతో పాటు సీబీబీపై ఉన్న విభేదాలను పరిష్కరించుకోవడానికి ఇరు పార్టీల కేంద్రకమిటీలు నోట్‌లు రాసి కింది పార్టీ కాన్ఫరెన్స్‌లలో కాడర్లకు అందించి చర్చ నిర్వహించాయి. వీటిపై 2007లో నిర్వహించిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్‌లో లోతుగా చర్చలు జరిగాయి. చర్చల అనంతరం సీబీబీ సంబంధంలో కాంగ్రెస్ వివరమైన తీర్మానం చేసింది. భారతదేశంలో సామ్రాజ్యవాద దోపిడీకి దళారీ నిరంకుశ బూర్జువావర్గం, బడా భూస్వామ్య వర్గాలు రెండూ ప్రధానమైన సాధనాలనీ, భారత రాజ్యం సామ్రాజ్యవాదానికి విధేయంగా ఉండే ఈ బడాబూర్జువా బడా భూస్వామ్య వర్గాల ఉమ్మడి నియంతృత్వమని తీర్మానంలో పేర్కొంది. భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం (సీబీబీ) గురించి లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

అయితే కాంగ్రెస్ అనంతర కాలంలో దేశంలో జరిగిన రాజకీయార్థిక పరిణామాల రీత్యా దేశంలో సామ్రాజ్యవాద దోపిడీకి దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాన్ని ప్రధాన వాహకంగా (ప్రిన్సిపుల్ వెహికిల్), భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా, బడాభూస్వామ్య వర్గాల రాజ్యంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికున్న నాయకత్వ పాత్రను (లీడింగ్ రోల్‌ను) గుర్తించాల్సిన అవసరం ముందుకొచ్చింది. అలాగే కాంగ్రెస్ తర్వాత గత 17 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న రాజకీయార్థిక పరిణామాల రీత్యా, భారతదేశ ప్రజలపై సీబీబీ చేస్తున్న దోపిడీ, పీడనల తీవ్రత రీత్యా, దాని దోపిడీ, పీడనలకు గురవుతున్న ప్రజానీకాన్ని దానికి వ్యతిరేకంగా వర్గపోరాటంలో విస్తృతంగా సమీకరించాల్సిన తక్షణ అవసరం రీత్యా, దానికి వ్యతిరేకంగా జాతీయ బూర్జువా సహా కార్మికులను, రైతులను, పెటీబూర్జువాలను ఎత్తుగడలపర, వ్యూహాత్మక సంఘటనల్లో విస్తృతంగా సమీకరించాల్సిన పరిస్థితి రీత్యా, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని విస్తృతం–తీవ్రతరం చేయాల్సిన అవసరం రీత్యా సీబీబీని టార్గెట్ చేయడంతో పాటు సీబీబీకి విశాల ప్రజారాశులకు మధ్యనున్న వైరుధ్యాన్ని ప్రముఖ, మౌలిక వైరుధ్యాల్లో ఒకటిగా చేర్చాల్సిన స్థితి ముందుకు వచ్చింది.

దీనిని దృష్టిలో ఉంచుకుని 2018 అక్టోబర్‌లో జరిగిన సీసీ 6వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది: “2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్‌లో భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం (సీబీబీ) పాత్ర గురించి చర్చించుకుని మెజార్టీ అభిప్రాయం ప్రకారంగా ఒక

నిర్ణయం తీసుకున్నాం. గత 12 సంవత్సరాలుగా ఆ నిర్ణయాన్ని అమలు చేస్తూ వస్తున్నాం. అయితే దేశంలో జరుగుతున్న మార్పులను గమనంలో ఉంచుకొని వివిధ స్థాయిల్లోని కొంతమంది కామ్రేడ్స్ సీబీబీ విషయంలో పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీసీని కోరారు. ప్రస్తుతం 12 సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకుంటున్న (సీసీ పీఓఆర్ రూపొందించుకుంటున్న) సందర్భంగా సీసీ ఈ విషయం గురించి చర్చించి, భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువావర్గం పాత్ర గురించి ఒక నోట్ (డ్రాఫ్ట్)ను తయారు చేయాలని నిర్ణయించింది".

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలకు అనుగుణంగా, దేశంలో సీబీబీ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్.పీ.జీ.) విధానాలను అమలు చేయడంలో భాగంగా వివిధ సంస్కరణలను అమలు చేయడం, ప్రపంచంలో అనేక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలు జరగడం, వాటి ప్రభావం మన దేశంపై గణనీయంగానే పడుతుండడం, భూస్వామ్య సంబంధాలు కొంత మేరకు బలహీనపడటం, పెట్టుబడిదారీ సంబంధాలు క్రమంగా పెరగడం-విస్తరించడం, తదితర కారణాల ఫలితంగా సామాజిక సంక్షోభం తీవ్రతరమవుతూ భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో గణనీయమైన మార్పులు వేగంగా సంభవించాయి. నగరీకరణ (అర్బనైజేషన్) పెరుగుతున్నది. జనాభా వర్గీకరణలో-వర్గాల పొందికలో మార్పులు వస్తున్నాయి. నిరుద్యోగ రిజర్వు సైన్యం పెరిగిపోతోంది. గ్రామాల్లో వ్యవసాయ కూలీల వలస పెరుగుతున్నది. పర్మనెంట్ ఉపాధి క్షీణిస్తోంది. అనుత్పాదక, తాత్కాలిక, సీజనల్ శ్రామికుల సంఖ్య పెరుగుతోంది. దీంతో రైతుల గ్రామీణ లక్షణాలు తగ్గుతూ అర్ధ-కార్మిక లక్షణాలు పెరుగుతున్నాయి. సహజ వనరుల వేటలో వ్యూహాత్మక అటవీ, పర్వత ప్రాంతాల స్వభావంలో మార్పులు జరుగుతున్నాయి. దేశంలో అన్ని వర్గాల ప్రజలు తరతమ తేడాలతో మార్కెట్‌పై, పాలనా యంత్రాంగం, రాజ్య యంత్రాంగం, న్యాయవ్యవస్థపై ఆధారపడడం పెరిగిపోయింది. ఎగువ మధ్యతరగతి వర్గంపై సామ్రాజ్యవాద నయా ఉదారవాద భావజాల ప్రభావం పడింది. దేశ ప్రజలపై ప్రపంచ ద్రవ్య పెట్టుబడి, దానికి అంటకాగుతున్న భారతదేశ సీబీబీ, పాత-కొత్త భూస్వామ్య శక్తుల కూటమి దోపిడీ పీడనలు పెరిగిపోయాయి. దీంతో దోపిడీ ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజల అసంతృప్తి పెరిగి స్పాంటేనియస్‌గా, సంఘటితంగా ప్రజా ఉద్యమాలు పెల్లుబుకుతున్నాయి. ఈ మార్పులను లోతుగా అర్థం చేసుకోవడం, ఇందుకు అనుగుణంగా ఎత్తుగడలలో మార్పులు చేసుకోవడం, వాటిని అమలు చేయడం కోసం యావత్తు శక్తిని కేంద్రీకరించడం ఇవాళ భారతదేశ సమాజ పరివర్తనను కోరుకునే వాళ్లందరి కర్తవ్యం.

ఈ సందర్భంగా సామ్రాజ్యవాదంపై మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ బోధనల్ని, దళారీ నిరంకుశ బూర్జువావర్గంపై కామ్రేడ్ మావో బోధనల్ని, సోదర పార్టీలైన ఫిలిప్పీన్స్, పెరూ, నేపాల్ దేశాల విప్లవ పార్టీల డాక్యుమెంట్లను అధ్యయనం చేయడంతో పాటు మన పార్టీ - సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసీసీఐ, సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ, సీపీఐ (మావోయిస్టు) - డాక్యుమెంట్లు అధ్యయనం చేసి సీబీబీపై ఈ ముసాయిదా డాక్యుమెంట్‌ను మన పొలిట్ బ్యూరో రూపొందించి మన కేంద్రకమిటీ సభ్యుల కోసం 2024 డిసెంబర్‌లో విడుదల చేస్తున్నది. ఈ

డాక్యుమెంట్‌ను చర్చించి తుదిరూపం (ఫైనలైజ్ చేసుకోవాల్సి) ఇవ్వాల్సి వుంది.

## 2. పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ-సామ్రాజ్యవాదం-కార్మికవర్గ విప్లవాల యుగం:

చారిత్రకంగా చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానం ప్రారంభ దశలో 'స్వేచ్ఛాయుత పోటీ' దశలో అభివృద్ధికరమైన పాత్రను నిర్వహించింది. శిథిలావస్థలో ఉన్న భూస్వామ్య సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయడానికి బూర్జువావర్గం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలతో రైతాంగ, శ్రామిక ప్రజలను, చేతివృత్తుల వారిని సమీకరించి బూర్జువా ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించింది. జాతి రాజ్యాలను, స్వేచ్ఛా మార్కెట్‌ను ఏర్పరచింది. సాంప్రదాయక పెట్టుబడిదారీ దేశాలలో భూస్వామ్యం పూర్తిగా తుడిచివేయబడింది. బ్రిటన్ లాంటి దేశాల్లో రాచరికం లాంచనప్రాయంగా మారిపోయింది. యూరప్, ఉత్తర అమెరికా ఖండాల్లో పెట్టుబడిదారీ విధానం ఆధిపత్యంలోకి వచ్చింది.

పెట్టుబడిదారీ విధాన చారిత్రక పరిణామం స్వేచ్ఛాయుత పోటీ దశ నుంచి 20వ శతాబ్ద ఆరంభంలో పెట్టుబడిదారీ విధాన గుత్తాధిపత్య దశకు చేరుకున్నది. దీనినే లెనిన్ సామ్రాజ్యవాద దశగా నిర్వచించారు. దీన్ని మరింతగా వివరిస్తూ "సామ్రాజ్యవాదం అంటే పెట్టుబడిదారీ విధాన విశిష్ట చారిత్రక దశ. దాని విశిష్ట లక్షణాన్ని బట్టి అది మూడు విధాలుగా ఉంటుంది: గుత్త పెట్టుబడిదారీ విధానం, పరాన్నభుక్కు లేదా శిథిలావస్థలోని పెట్టుబడిదారీ విధానం, మరణావస్థలోని పెట్టుబడిదారీ విధానం", "సామ్రాజ్యవాద యుగం-కార్మికవర్గ విప్లవాల యుగం" అని సిద్ధాంతీకరించారు. ఇది నేటికీ సరైనదే. కార్మికవర్గ నాయకత్వంలో ప్రపంచ సోషలిస్టు విప్లవం ద్వారా ఈ భూమండలం నుండి సామ్రాజ్యవాదాన్ని సంపూర్ణంగా తుదముట్టించే వరకూ ఈ యుగం మారదు. "సామ్రాజ్యవాద యుగం, కార్మికవర్గ విప్లవాల యుగంలో ఏ కొత్త బూర్జువా రాజ్యమూ అవతరించజాలదు" అనీ, "సామ్రాజ్యవాద యుగంలో ఏ దేశంలోనైనా (కార్మికవర్గం తప్ప) మరే ఇతర వర్గము నిజమైన విప్లవాన్ని విజయం వైపు కొనిపోలేదు. చైనాలో పెట్టీ బూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గాలు నాయకత్వం వహించిన చాలా విప్లవాలు విఫలమవటం ద్వారా అది స్పష్టంగా రుజువయింది" అని మావో (సంకలిత రచనలు-4, ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం గురించి, జూన్ 30, 1949, పేజీలు 531, 532, తెలుగు ప్రతి) పేర్కొన్నారు.

సామ్రాజ్యవాద దశ తనతో పాటు అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సూత్రాన్ని తీసుకొచ్చింది. ప్రపంచమంతటా విస్తరించడానికి, ప్రపంచ భూభాగాన్ని పునర్విభజన చేసుకోవడానికి, సామ్రాజ్యవాద శక్తులు వివిధ కూటములను ఏర్పరచాయి, తీవ్రంగా ఘర్షించుకున్నాయి. ఇవి రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసాయి. యుద్ధాల పరంపరతో 20వ శతాబ్ద మొదటి అర్ధభాగమంతా తల్లడిల్లిపోయింది. ఒకటి తర్వాత మరొకటిగా సోషలిస్టు విప్లవాలు, నూతన ప్రజాస్వామిక విప్లవాలు కొనసాగాయి. 2వ ప్రపంచ యుద్ధం తర్వాత సోషలిస్టు శిబిరం ఏర్పడింది. దీంతో పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద విధానానికీ, సోషలిజానికీ మధ్య బాహాబాహీ పోటీ తీవ్రతరమైంది. పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థ ప్రాణాంతకమైన సమస్యలతోనే కొనసాగింది. 2వ ప్రపంచ

యుద్ధం సృష్టించిన సంక్షోభాలతో, నూతన ప్రజాస్వామిక విప్లవాలు విజయవంతం కావడంతో సామ్రాజ్యవాదం బాగా బలహీనపడింది, అమెరికా అగ్రరాజ్యంగా ఆవిర్భవించింది. వలసవాదానికి వ్యతిరేకంగా చెలరేగిన జాతుల స్వతంత్ర, విముక్తి ఉద్యమాలకు, విప్లవాలకు వెరచి సామ్రాజ్యవాదం వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో పాత వలసవాదాన్ని మార్చుకుని దాని స్థానంలో నయావలసవాదాన్ని చేపట్టి పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీ కొనసాగిస్తున్నది. సోవియట్ యూనియన్‌లో కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం అది రాజ్య పెట్టుబడిదారీ దేశంగా మారి దశాబ్ద కాలంలోనే సోషల్-సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా అవతరించింది. ప్రపంచ రాజకీయాలు 1970, 1980 దశకాల కాలం అంతటా ప్రపంచాధిపత్యం కోసం, ప్రపంచ మార్కెట్ పునర్విభజన కోసం రెండు అగ్రరాజ్యాల మధ్య తీవ్ర పోటీ, కుమ్మక్కు, ప్రచ్ఛన్న యుద్ధాలతో తలమునకలైనాయి. 1990లో 'సోవియట్' అగ్రరాజ్యం కూలిపోవడంతో అమెరికా సామ్రాజ్యవాద ఏకైక అగ్రరాజ్యంగా మిగిలి ప్రపంచ ప్రజలకు అతిపెద్ద ప్రమాదంగా కొనసాగింది.

పెట్టుబడిదారీ విధానపు సార్వత్రిక సంక్షోభం మూడు దశల గుండా - మొదటి దశ మొదటి ప్రపంచయుద్ధంతో మొదలై 1923 వరకు, రెండవ దశ రెండవ ప్రపంచ యుద్ధంతో మొదలై 1950 దశాబ్ది మధ్య వరకు కొనసాగింది. మూడవ దశ 1973 నుండి నేటికీ కొనసాగుతున్న సుదీర్ఘమైన ఆర్థిక మాంద్యం, సంక్షోభం. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో 1923 నుండి 1929 వరకు తాత్కాలిక స్థిరత్వం ఏర్పడింది. అలాగే రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1950 దశాబ్ది మధ్య నుండి 1973 వరకు దాదాపు 2 దశాబ్దాల పాటు ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో పాక్షిక స్థిరత్వం ఏర్పడింది. 1973 నుండి సుదీర్ఘ సంక్షోభంలోకి ప్రవేశించడంతో పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ నిరంతరాయంగా అభివృద్ధి చెందుతుందనే భ్రమ పటాపంచలయింది. పెట్టుబడిదారీ విధానంలో నిహితంగా ఉండే వైరుధ్యాల్నీ, సంక్షోభాల్నీ పరిష్కారం చేసే పేరుతో ఆర్థిక శాస్త్రవేత్త కీన్స్ ముందుకు తెచ్చిన సంక్షేమ రాజ్య భావన ఘోరంగా విఫలమైంది. మొత్తంగా చూసినప్పుడు, ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం శాశ్వతమైనది పరమమైనది. కోలుకోవడం అన్నది తాత్కాలికమైనది, సాపేక్షికమైనది.

1973 నుండి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పన్నమైన తీవ్ర సంక్షోభ పరిష్కారంగా నయా ఉదారవాద ఆర్థిక విధానాలు లేదా మానిటరిస్టు సిద్ధాంతాలు ముందుకు వచ్చాయి. ఆచరణలో 1980ల నుంచి 1990ల ప్రారంభం నాటికి సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమాలకు పూనుకుంది. నయా ఉదారవాద విధానాలను చేపట్టి ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్.పీ.జీ.)ల అమలు ద్వారా ప్రపంచ కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత ప్రజలపై, పీడిత దేశాలపై/వలస, అర్ధవలస దేశాలపై సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి నూతన దాడిని ఎక్కుపెట్టింది. సమాచార ఉపగ్రహ వ్యవస్థ అభివృద్ధిలో, సమాచారాన్ని ప్రసారం చేసే సాంకేతిక పరిజ్ఞానంలో బ్రహ్మాండమైన పురోగతి వల్ల ఇది సాధ్యమైంది. ఈ దాడి గత మూడు దశాబ్దాలకు పైబడి ఇప్పటికీ కొనసాగుతున్నది.

2008లో అమెరికాలో మొదలైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభం యూరప్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, ప్రపంచవ్యాప్త సంక్షోభంగా మారి ఇప్పటికీ కొనసాగుతోంది. 1976లో మావో మరణానంతరం చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగిన సుమారు 4 దశాబ్దాలలో అంటే 2014 నాటికి చైనా ఒక సోషల్-సామ్రాజ్యవాద శక్తిగా, ప్రపంచ పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థలో అంతర్భాగంగా మారిపోయింది. ఒక వైపు సామ్రాజ్యవాదుల మధ్య పోటీ వలన, మరో వైపు ప్రపంచ కార్మిక, కర్షక తదితర పీడిత ప్రజల, పీడిత జాతుల ప్రతిఘటన ఫలితంగా జరిగిన పరిణామాలతో 21వ శతాబ్దం 2వ దశాబ్దపు ప్రారంభానికి అమెరికా ఏకధ్రువ అగ్రరాజ్య స్థితిని కోల్పోయింది. బహుధ్రువ ప్రపంచం ఉనికిలోకి వచ్చింది. అయినప్పటికీ అమెరికా సామ్రాజ్యవాదం ఇప్పటికీ ప్రపంచ పీడిత ప్రజల, పీడిత జాతుల నంబర్ వన్ శత్రువుగానే కొనసాగుతున్నది.

ప్రస్తుతం ప్రపంచ సోషలిస్టు విప్లవ శిబిరం తాత్కాలిక ఓటమికి గురై, వ్యూహాత్మకంగా తిరోగమించినప్పటికీ, లెనిన్ బోధించిన విధంగా, ఇప్పటికీ సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగం కొనసాగుతున్నది. సామ్రాజ్యవాద సుదీర్ఘ సంక్షోభం, విధ్వంసకతత్వం, యుద్ధాల విస్తరణ తీవ్రతరమవుతూ సామ్రాజ్యవాదం శిథిలమవుతుండగా, ప్రపంచం సోషలిస్టు విప్లవ వెల్లువ ముంగిట్లోకి చేరుకుంది. భౌతిక పరిస్థితులు సామ్రాజ్యవాదానికి ప్రతికూలంగా, ప్రజాస్వామిక, సోషలిస్టు ఉద్యమాల పురోగమనానికి అనుకూలంగా ఉన్నాయి. సామ్రాజ్యవాద సంక్షోభాన్ని ఉపయోగించుకుని, ఒకవైపు ప్రజల నిరాశానిస్పృహలను సొమ్ము చేసుకుని ఫాసిస్టు పార్టీల, సంస్థల నాయకత్వంలో అభివృద్ధి నిరోధక మితవాద ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా బలం పుంజుకుని విస్తరిస్తున్నాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రజాస్వామిక సంఘాలు, సంస్థల నాయకత్వంలో అణ్వాయుధాలకు, యుద్ధాలకు వ్యతిరేకంగానూ, పర్యావరణం పరిరక్షణ కోసం, పౌరహక్కుల కోసం సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు; వివిధ దేశాల్లో కార్మికవర్గ/మావోయిస్టు పార్టీల నాయకత్వంలో విప్లవోద్యమాలు, దీర్ఘకాల ప్రజాయుద్ధాలు; వివిధ జాతి విముక్తి పోరాట సంస్థల నాయకత్వంలో పీడిత జాతుల విముక్తి పోరాటాలు బలం పుంజుకుంటున్నాయి లేదా అందుకోసం సన్నాహాలు చేస్తున్నాయి. వీటిని పురోగమింపజేసేందుకు ప్రపంచ కార్మికవర్గం చేస్తున్న కృషి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి హామీనిస్తుంది.

## 3. భారతదేశంలో బూర్జువా వర్గ ఆవిర్భావం-పరిణామ క్రమం-కులం పాత్ర:

భారతదేశంలో వలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ గర్భం నుండే పుట్టుకొచ్చిన బూర్జువా వర్గానికి చాలా సుదీర్ఘ చరిత్ర ఉంది. దీనిపై భారతదేశ సమాజంలో ఆర్థిక పునాదిలోనూ, ఉపరితలంలోనూ కొనసాగుతున్న కులవ్యవస్థ ప్రభావం విడదీయలేని విధంగా ఉంది. అందువల్ల మన దేశంలో చేతివృత్తుల వారి నుండి వర్తకులుగా మారే క్రమం దాదాపుగా జరగలేదు. దీనికి భిన్నంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదపు అండదండలు, కులాధారిత భూస్వామ్య విధానంతో సజీవ సంబంధాలు కలిగి వున్న, పీడక కులాలకు చెందిన దళారీ వర్తకుల, భూస్వామ్య ప్రభువుల, బడా వడ్డీ వ్యాపారుల నుండి 'బూర్జువా' వర్గం ఆవిర్భవించింది. ఫలితంగా పుట్టిన నాటి నుండే అది పెట్టుబడిదారీ

లక్షణాల కంటే అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ లక్షణాలను ఎక్కువగా కలిగి ఉండడంతో పాటు సామ్రాజ్యవాద దళారీ స్వభావాన్ని కూడా కలిగి వుంది.

భారతదేశంలో వ్యాపార పెట్టుబడి సంచయనాలలోనూ, శ్రమ నియంత్రణలోనూ, దోపిడీ, నిర్వహణ రూపాలలోనూ, ఆర్థిక వ్యవస్థలోని ఆధునిక రంగాలలో సైతం కనిపించే భూస్వామ్య అంశాలు పీడక కుల–భూస్వామ్య ఆధిపత్యానికి నిదర్శనంగా ఉంటాయి. అవి సామాజిక సాంస్కృతిక జీవనంలో ఎల్లప్పుడూ ప్రతిబింబిస్తూ ఉంటాయి. అయితే ఇవి పాత కుల–భూస్వామ్యం లేదా పాత బ్రాహ్మణిజంలోని అంశాలు కావు. అవి సామ్రాజ్యవాదం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానం చేత మలచబడ్డాయి, మెరుగులు దిద్దబడి మెలివేయబడ్డాయి. వలసవాద కాలం నుంచే పీడక కుల–ఫ్యూడల్ భూస్వాములకు పారిశ్రామిక, వ్యాపార ప్రయోజనాలు ఉంటున్నాయి. అలాగే దళారీ బడా పెట్టుబడిదారీ వర్గానికి కూడా భూమి సంబంధిత ప్రయోజనాలు ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో ఇవి ఒకదానికి మరొకటి కలగలిసిపోవడం పెరిగింది. ఈ విధంగా మాత్రమే అవి వర్తమాన పాలకవర్గాల–దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, పీడక కుల–పాత, కొత్త భూస్వాముల అవసరాలను వ్యక్తీకరించగలుగుతున్నాయి. ఈ మెరుగులు దిద్దబడిన బ్రాహ్మణిజం భారతదేశ దళారీ పాలకవర్గాల–పీడక కులాల భూస్వాములు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు ఇద్దరికీ సంబంధించిన ప్రాపంచిక దృక్పథం, విలువల వ్యవస్థ యావత్తు సెక్షన్ల ప్రజల నరనరాన జీర్ణించుకుని ఉంది. పాలకవర్గ భావాలే ప్రజల భావాలుగా ఉంటాయని మహోపాధ్యాయులు మార్క్స్ చెప్పారు. ఇలా భారతదేశంలో ప్రాథమికంగా సామ్రాజ్యవాద, భూస్వామ్య భావాలే ప్రాబల్యంలో ఉన్నాయి.

మధ్యయుగాల చివరిలో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, బంగాల్‌లలో గుజరాతీ బనియాలు/జైనులు, రాజస్థానీ మార్వాడీలు, సింధీలు (లోహానాలు), భాటియాలు, పార్సీలు స్థానిక వ్యాపారం, వడ్డీ వ్యాపారం చేస్తూనే వివిధ రాజపుట్ రాజ్యాల కోసం, తదనంతరం బ్రిటిష్ వారి కోసం మోదీలుగా (సైనిక అవసరాలు తీర్చే సరఫరాదారులుగా), బ్యాంకర్లుగా వ్యవహరించేవారు. ఉత్పత్తి నుంచి కాక వ్యాపార వర్గం నుంచి వీరు అభివృద్ధి చెందడం వలన, ఫ్యూడల్ రాజుల మాదిరిగానే వీరు డబ్బు కోసం ఎంతటి విశ్వాసఘాతుకానికైనా పాల్పడేవారు. ఇందులో కుఖ్యాతి గాంచినవారు జగత్ సేఠ్‌లు. వీరు బంగాల్ నవాబుకు బ్యాంకర్లుగా, ఖజానా ఇన్‌చార్జులుగా పనిచేసారు. జగత్ సేఠ్‌లు విద్రోహమే 1757 ప్లాసీ యుద్ధంలో బంగాల్ నవాబు సిరాజుద్దౌలా ఓటమికి, భారతదేశాన్ని బ్రిటిష్ వారు దురాక్రమించుకోవడానికి ప్రధాన కారణం. బ్రిటిష్ పాలనలోనే బనియా, మార్వాడీ, ఖత్రీల వంటి సాంప్రదాయక వర్తక సముదాయాల నుంచి అభివృద్ధి చెందిన దళారీ బూర్జువావర్గ దేశవ్యాప్త విస్తరణకు ఊపు లభించింది. ఒక క్రమంలో ప్రత్యేకించి బనియాలు, మార్వాడీలు బంగాల్, అసాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు విస్తరించారు. తూర్పు భారతదేశంలో ప్రధానంగా బ్రిటిష్ వారికి దళారీలుగా సేవలు అందించారు. అలాగే దక్షిణ గుజరాత్‌లో వ్యాపార వర్గంగా అభివృద్ధి చెందిన పార్సీలు బ్రిటిష్ వలస పాలనలో ముంబయికీ, ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించారు. పార్సీల వ్యాపార అభివృద్ధితో ముంబయి అభివృద్ధి ముడిపడి వుంది. ఖత్రీలు పంజాబ్ నుంచి ఢిల్లీ, ఆగ్రా, లక్నో, పట్నా పట్టణాలలో స్థిరపడిన తర్వాతనే వారి

వ్యాపారాలు మార్వాడీ వ్యాపారాలకు అనుబంధంగా అభివృద్ధి చెందాయి. ఉత్తర భారతదేశంలోని పరిశ్రమల, వ్యాపారాలతో సహా ఆర్థిక వ్యవహారాలన్నీ ప్రధానంగా బనియాలు, మార్వాడీలు లేదా ఖత్రీల చేతులలోనే ఉన్నాయి.

మార్వాడీలు దేశీయ వ్యాపారం చేసేవారు. బనియాలు పర్షియన్ గల్ఫ్, ఎర్ర సముద్రం రేవులలో వ్యాపారం చేయగా, పార్సీలు చైనాతో విదేశీ వ్యాపారం చేసేవారు. పార్సీలు బ్రిటిష్‌వారితో కలిసి ఉమ్మడి భాగస్వామ్య (జాయింట్ స్టాక్) బ్యాంకులు కూడా నిర్వహించేవారు. పార్సీలు అయిన టాటాలు, పిత్తిలు, వాడియాలు ఈ కాలంలోనే అభివృద్ధి చెందారు. పార్సీలను అనుసరించి లోహానాలు, భాటియాలు ముంబయిలో బలపడ్డారు. కచ్ (గుజరాత్) భాటియాలు మధ్య ఆసియా దేశాలతో విదేశీ వ్యాపారం చేసేవారు. దక్షిణ భారతదేశానికి, బర్మా (మ్యాన్మార్)కు విస్తరించారు. లోహానాలు మధ్య ఆసియాకు, సింధీలు ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్, తూర్పు–ఆగ్నేయాసియాల వరకూ తమ వ్యాపారం విస్తరించారు. తమిళనాడులో నట్టుకొట్టై చెట్టియార్ల ప్రధాన మదుపులు మన దేశంలో ప్రధానంగా బ్యాంకింగ్ రంగంలో పెట్టినప్పటికీ, ఆగ్నేయాసియా ప్రాంతంలోని శ్రీలంక, బర్మా వంటి వివిధ దేశాల్లో వివిధ రంగాలలో చాలా అధికంగా పెట్టారు. ఇలా సాంప్రదాయక వ్యాపార కులాల నుంచి వచ్చిన వీళ్లందరూ బ్రిటిష్ తదితర సామ్రాజ్యవాద కంపెనీలకు స్థానిక దళారులుగా, గుమాస్తాలుగా, కమిషన్ ఏజెంట్లుగా, బ్యాంకర్లుగా, డీలర్లుగా పని చేస్తూ క్రమంగా వ్యాపార రంగం నుండి ఉత్పత్తి రంగంలోకి ('సాంప్రదాయక మార్కెట్ నుంచి ఫ్యాక్టరీ'కి) పరివర్తన చెందారు.

వ్యాపారం నుంచి ఉత్పత్తి రంగంలోకి మళ్లినవారిలో మొట్టమొదటివారు పార్సీలు (టాటాలు, పిత్తిలు, వాడియాలు), తర్వాత భాటియాలు, ఆ తర్వాత గుజరాతీ బనియాలు, జైనులు (సారాభాయిలు, లాల్‌భాయిలు, మంగల్‌దాస్ గిరిధర్‌దాస్‌లు), నట్టుకొట్టై చెట్టియార్లు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాతనే మార్వాడీలు ఉత్పత్తి రంగంలోకి మళ్లారు. అధికార మార్పిడి తర్వాత ప్రవాస భారతదేశ దళారీ కార్పొరేట్లుగా స్వరాజ్‌పాల్, లక్ష్మీ మిత్తల్, అనిల్ అగర్వాల్‌లు ముందుకు వచ్చారు. ఒక క్రమంలో ఒక తరం తర్వాత మరొక తరంగా బిర్లాలు, మిత్తల్‌లు, అగర్వాల్‌లు, గోయెంకాలు, సింఘానియాలు, లాల్‌భాయిలు, సారాభాయిలు, బజోరియాలు, సూరజ్‌ముల్ నాగర్‌ముల్, డీసీఎంలు (లాలా శ్రీరాం గ్రూపు కంపెనీలు), బంగుర్‌లు, దాల్మియాలు, బజాజ్‌లు, మోదీలు, శ్రీరాంలు, థాపర్‌ల నుంచి మొదలుకుని జిందల్‌లు, మహింద్రాలు, మంజల్‌లు, గోద్రెజ్‌లు, ఇంకా నరేష్ గోయల్, కిశోర్ బియానీ, గోవన్ బ్రదర్స్ వరకు దళారీ పారిశ్రామికవేత్తలు వివిధ పీడక కులాల నుంచి ఉద్భవించారు.

బ్రిటిష్ పాలనలో మెకాలే వలసవాద ఆధునిక విద్య వారికి అవసరమైన నిర్వహణ, పాలనా సిబ్బందిని తయారు చేస్తూ ఉండేది. అది సాంప్రదాయకంగా విభిన్న స్థాయిలతో కూడిన సామాజిక వ్యవస్థను పునర్నిర్వచించడం, మెలి వేయడం ద్వారా ఖత్రీలు, బ్రాహ్మణులు (తమిళ బ్రాహ్మణులు, గౌడ సారస్వత్ బ్రాహ్మణుల (జీఎస్‌బీ)తో సహా), కాయస్త, బంగాలీ భద్రలోక్ సముదాయం (పీడక

కులాలకు చెందిన బ్రాహ్మణులు, కాయస్థ, వైద్య సముదాయాలు) తదితర పీడక కులాలను తమ అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ రంగాలను అన్వేషించేలా చేసింది. వారు వ్యాపారాలలోకి, పరిశ్రమల్లోకి, ప్రభుత్వ విభాగాల్లోకి ప్రవేశించారు. అధికార మార్పిడికి ముందు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, ఆ తర్వాత సమస్త సామ్రాజ్యవాదులు బ్రాహ్మణీయ కులాధారిత భూస్వామ్యాన్ని తమ సామాజిక పునాదిగా చేసుకున్న ఫలితంగా జరిగిన పరిణామాలలో, వలస, అర్ధవలస భారతదేశంలో ఈ వ్యాపారేతర పీడక కుల సముదాయాల నుంచి విశ్వసనీయమైన దళారీలను తయారు చేసుకోవడం సులువైంది. అలాగే ఈ పీడక కుల సముదాయాలలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అవకాశాల్ని చేజిక్కించుకున్నవారు సామ్రాజ్యవాదులతో తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలు ముడిపడి వున్నాయని గ్రహించి వారిపై ఆధారపడ నారంభించారు. ఆధునిక విద్య ప్రభావంతో దళారీ మనస్తత్వాన్ని సంతరించుకుని, ప్రాంతీయంగానూ, దేశవ్యాప్తంగానూ సామాజికంగా, రాజకీయంగా తమకు వున్న ఆధిపత్యంపై ఆధారపడి బేరసారాలాడడంలో నైపుణ్యం సంపాదించుకుంటూ ఈ కులాల నుండి ఉన్నతాధికారులుగా (బ్యూరాక్రట్స్‌గా) ఎదిగిన వారిలో నుండి ఒక సెక్షన్ పారిశ్రామిక వర్గంలో చేరిపోతూ వచ్చారు. ప్రధానంగా ప్రాంతీయ పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందారు. వీరు చెప్పుకోదగిన సంఖ్యలోనే బడా దళారీ వ్యాపార/పారిశ్రామిక వర్గంగా పరివర్తన చెందారు. ఈ క్రమంలో థాపర్ బ్రదర్స్, నారంగ్‌లు తొలి ఖత్రీ దళారీ పెట్టుబడిదారులు కాగా, ఇందులో రెండు ఖత్రీ (థాపర్ బ్రదర్స్, మహింద్రాలు) దళారీ పెట్టుబడిదారీ గ్రూపులు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. కొందరు ఖత్రీ సిక్కులు వివిధ రంగాలలో ముందుకు వచ్చారు. బ్రాహ్మణుల నుండి మొదట టీ.వీ. సుందరం అయ్యంగార్, కిర్లోస్కర్లు, ఆ తర్వాత క్రమంలో నంబర్ 2 సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, తదితరులు అభివృద్ధి చెందారు. ఉత్తర భారతదేశం బ్రాహ్మణులలో జయప్రకాష్ గౌడ (జేపీ గ్రూపు), నరేంద్రనాథ్ మోహన్ (బ్రెవరీస్) మినహా చెప్పుకోదగినవారు లేరు. పశ్చిమ, దక్షిణాది బ్రాహ్మణులతో పోల్చుకుంటే ఉత్తరాది బ్రాహ్మణులు పారిశ్రామిక రంగంలో రాణించలేకపోవడానికి కారణం వీరు ఆధునిక విద్యతో, సెక్యులర్ భావాలతో ప్రభావితం కాకపోవడమూ, అర్చక వృత్తిని అధిగమించలేకపోవడమూ, ఫ్యూడల్ కట్టుబాట్లు వారికి సౌకర్యవంతంగా వుండడమే. కేరళలోని నంబూద్రీ బ్రాహ్మణులకు కూడా ఇది వర్తిస్తుంది.

బ్రిటిష్ ఆక్రమణ తర్వాత విద్య అభ్యసించి, కార్ల్ మార్క్స్, ఠాగోర్, సత్యజిత్ రే విప్లవ, ప్రగతిశీల భావాలతో ప్రభావితమైన బంగాలీ భద్రలోక్ సముదాయం రాజకీయంగా, సాంస్కృతికంగా పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యశక్తిగా అభివృద్ధి అయింది. ఇలాంటి వారు స్థానిక బంగాలీ పారిశ్రామికవేత్తలలో భాగంగా, అధికార మార్పిడికి ముందు వివిధ రంగాలలో బీరేంద్ర ముఖర్జీ వంటివారు ప్రముఖ దళారీ పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చారు. అయితే 20వ శతాబ్ద ఆరంభంలో యూనిలివర్, జనరల్ ఎలక్ట్రిల్స్, ఫిలిప్స్ వంటి బ్రిటన్, అమెరికా బహుళజాతి కంపెనీలు, ఇతర విదేశీ కంపెనీలు భారతదేశంలో తమ అనుబంధ కంపెనీల స్థాపనతో వీటి పోటీకి నిలబడలేక స్థానిక బంగాలీ పరిశ్రమలు చాలా వరకూ దెబ్బతినిపోయాయి లేదా వాటిని ఎంఎన్‌సీలు కొనివేసాయి లేదా

బ్రిటిష్ వారు హస్తగతం చేసుకున్నారు. మార్వాడీల ఆధిపత్యం కారణంగా బంగాలీ భద్రలోక్ సముదాయాలలో శక్తివంతమైన దళారీ పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి కాలేకపోయింది. అధికార మార్పిడి తర్వాత కొల్‌కతా తన ప్రాభవం కోల్పోవడం, కోల్‌కతా స్టాక్ ఎక్స్‌చేంజి, బుర్రాబజార్‌లలో మార్వాడీల ఆధిపత్యం కొనసాగడంతో పరిస్థితి మరింత దిగజారింది. ప్రవాస భారతదేశీయులుగా వున్న ప్రణయ్ రాయ్, అమర్ గోపాల్ బోస్, బికీ చక్రవర్తి, పూర్ణేందు చటర్జీల వంటి బంగాలీయుల కార్యకలాపాలతో 1980ల నుంచి మాత్రమే పశ్చిమ బంగాల్‌లో బలమైన దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భవించడం మొదలైంది. ప్రస్తుతం బంగాలీయులలో సుబ్రతో రాయ్ (సహారా), బర్మన్స్ (డాబర్)లు తదితరులు ప్రముఖ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులుగా వున్నారు.

1947 అగస్టు 15 అధికార మార్పిడికి ముందూ, తర్వాత కూడా ఇదే విధంగా సాంప్రదాయ వ్యాపార కులాల ఆధిపత్య వ్యవస్థను బద్దలు చేస్తూ పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలో ఆధిపత్యంలో వున్న వ్యవసాయ కులాల నుంచి దళారీ పెట్టుబడిదారులు కొంతమంది అభివృద్ధి అయ్యారు. దక్షిణ భారతదేశంలో తెగ సమాజం భూస్వామ్య సమాజంగా మారే క్రమంలో వేర్వేరు పేర్లతో వడ్డీ వ్యాపారం, వర్తక వ్యాపారం చేసే వైశ్యులు ఉన్నప్పటికీ మార్వాడీలు, పశ్చిమ, ఉత్తర భారతదేశానికి చెందిన బనియాలు లేనిచోట, కమ్మ, రాజు, రెడ్డి, వెలమ, గౌడ, నాడార్ వంటి వ్యవసాయ కులాల నుంచి, సిరియన్ క్రిస్టియన్, ముస్లిముల నుంచి సాపేక్షికంగా ప్రైవేటు పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి అయ్యాయి. ముఖ్యంగా వీరు అధికార మార్పిడి తర్వాత వరుసగా అమలైన పంచవర్ష ప్రణాళికల కింద నీటిపారుదల, పవర్, ట్రాన్స్‌పోర్ట్, గనులు, ఇతర ముఖ్యమైన సెక్టార్లలో ప్రభుత్వ మదుపులు పెరగడంతో వివిధ కులాల నేపథ్యాల నుంచి వచ్చినవారు చెప్పుకోదగిన సంఖ్యలోనే కాంట్రాక్టర్లుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి అయ్యారు. ఇందుకు భిన్నంగా పశ్చిమ భారతదేశంలో గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ఉపయోగించుకుని మరాఠా, పాటిదార్ కులాలు విజయవంతంగా చక్కెర, డెయిరీ సహకార సంఘాలను స్థాపించగలిగాయి. ఇది వారు రాజకీయాలలోకి రావడానికి తోడ్పడింది. దేశవ్యాప్తంగా చూస్తే కమ్మ, రెడ్డి, రాజు, గౌడ, నాడార్, జాట్, పాటిదార్, మరాఠా వంటి భూమి కలిగిన రైతు కులాల వారు ఈ విధంగా 'వ్యవసాయం నుంచి ఫ్యాక్టరీకి' పరివర్తన చెందారు.

1940లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు వచ్చిన మెజారిటీ తొలి కమ్మ దళారీ పారిశ్రామికవేత్తలు భూస్వామ్య వర్గానికి చెందినవారే. మొదటి దశలో డెల్టా ప్రాంతంలో, ఆ తర్వాత దశలో నెల్లూరు, ఖమ్మం, రాయలసీమ జిల్లాల్లో సైతం కమ్మ దళారీ పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందారు. చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ మొట్టమొదటి దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్త. కమ్మ దళారీ పారిశ్రామికవేత్తలలో ముఖ్యమైనవారు రాయపాటి సాంబశివరావు (పొగాకు, టెక్స్‌టైల్స్), దేవినేని సుబ్బారావు (మిశ్రమ లోహాలు, చక్కెర, ఆబ్కారీ-సారా), రామోజీరావు (చిట్ ఫండ్స్, హోటల్స్, ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియా, సినిమా పరిశ్రమ) మొదలైనవారు. సినిమా రంగంలో కమ్మ, కాపు కులాల మధ్య వైరుధ్యాలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. 1980ల నుంచి నూతన

తరం కమ్మ పారిశ్రామికవేత్తలు నిమ్మలగడ్డ ప్రసాద్, ముళ్లపూడి హరిచంద్ర ప్రసాద్ మొదలైనవారు ఫార్మాస్యుటికల్స్ రంగంతో పాటు ఇతర రంగాలలో కూడా ముందుకు వచ్చారు. రెడ్లలో బొమ్మిరెడ్డి నాగిరెడ్డి (సినిమా, చందమామ పత్రిక, హాస్పిటల్స్), ఎల్. జైపాల్ రెడ్డి వంటివారు దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలు ముఖ్యమైనవారుగా ఉన్నారు. రాజులలో పూసపాటి రామస్వామి (సిమెంటు, ఆస్బెస్టాస్, సాఫ్ట్‌వేర్, టెక్స్‌టైల్స్), మరి కొందరు దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలుగా మారారు. అయితే కమ్మలు, రెడ్లు, రాజుల మాదిరిగా వెలమలు, కాపులు, ఇతర ఆధిపత్య రైతు కులాలవారు పారిశ్రామికరంగంలో రాణించలేకపోయారు. వెలమలలో సినిమా రంగంలో వెంకటరామయ్య, అప్పారావు, మరి కొందరు మాత్రమే దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలుగా మారారు. కాపులలో ముఖ్యమైన దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలుగా బి. వాసుదేవరావు (కోళ్లఫారాలు) లాంటి అతి కొద్ది మంది మాత్రమే ఎదిగారు.

ఆంధ్రప్రదేశ్‌లో కమ్మ, రెడ్డి, ఇతర వ్యవసాయ కులాలకు సంబంధించి రెండు విషయాలు స్పష్టమవుతాయి. మొదటి అంశం, ఈ రైతాంగ కులాలు పారిశ్రామిక రంగానికి చెందిన వివిధ వైవిధ్యపూరిత సెక్టార్‌లలో ప్రవేశించే క్రమంలో సాంప్రదాయ వ్యాపార కులాలైన కోమట్లను, వలస వచ్చిన మార్వాడీలను పక్కకు సైతం నెట్టివేసాయి. అందుకు రాజకీయాధికారం ఎంతగానో తోడ్పడింది. కోమటి దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలలో గ్రంధి మల్లికార్జునరావు (జనపనార నూలు, మిశ్రమ లోహాలు, చక్కెర, పవర్ ప్లాంట్లు, కన్‌స్ట్రక్షన్స్), పొగాకు ఎగుమతిదార్లలో బొమ్మిడాల, పొలిసెట్టి, మద్ది లక్ష్మయ్య మాత్రమే మిగిలారు. రెండవ అంశం, ముఖ్యమైన కమ్మ, రాజు పారిశ్రామిక గ్రూపులన్నీ కోస్తా ఆంధ్రకు చెందినవే. వీరి అభివృద్ధి వెనుక గోదావరి ఆనకట్ట ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. వ్యవసాయానికి నీటి వనరులు కరువైన తెలంగాణ, ఇతర ప్రాంతాలు వెనకబడ్డాయి. అందువల్ల ఒక్క నామా నాగేశ్వరరావు మాత్రమే తెలంగాణకు చెందినవాడు. కోస్తా ఆంధ్ర పెట్టుబడే పెద్ద మొత్తంలో హైదరాబాద్‌కు వెళ్లింది. తెలంగాణలో అపారంగా వున్న ప్రకృతి వనరుల దోపిడీకి, రాజధానిపై ఆధిపత్యాన్ని తమ చేతుల్లో సుస్థిరం చేసుకోవడానికి తరలివెళ్లిన ఈ పెట్టుబడి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య తీవ్రమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంతరాలను సృష్టించింది. ఇది కోస్తా దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా అసంతృప్తిని పెంపొందించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తిరిగి రగుల్కొనేలా చేసింది. ఆ తరువాత కోస్తా ఆంధ్ర దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వాముల విచ్చలవిడి దోపిడీకి వ్యతిరేకంగా, నీళ్లు, నిధులు, ఉద్యోగాలు కేంద్రంగా మలివిడత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆరంభమైంది.

భారతదేశ ముఖ్యమైన మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా, దక్షిణ భారతదేశ మాంచెస్టర్‌గా, భారతదేశ తేలికపాటి ఇంజినీరింగ్ పవర్ హౌజ్‌గా ప్రసిద్ధి చెందిన పశ్చిమ తమిళనాడులోని కోయంబత్తూరు ప్రాంతాన్ని నట్టుకొట్టై చెట్టియార్లు, ఇతర సాంప్రదాయ వ్యాపారులు అభివృద్ధి చేయలేదు. ప్రాథమికంగా వ్యవసాయమే వృత్తిగా కలిగి, ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లిన కమ్మవాళ్లు (కమ్మ నాయుళ్లు), కొంగు వెల్లాలలు (గౌడ్లు) అందుకు దోహదం చేసారు. నాయుళ్లు 1905 నుంచే అభివృద్ధి చెందారు. నాయుళ్ల లో పీఎస్‌జీ, కుప్పుస్వామి నాయుడు, వి. రంగస్వామి నాయుడు తదితర గ్రూపులు

ముఖ్యమైనవి. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎల్.ఆర్. గోవిందరాజులు ఆధ్వర్యంలో ఎల్‌జీ గ్రూపు బడా లైట్ ఇంజినీరింగ్ కంగ్లామరేట్‌గా అభివృద్ధి అయింది. గౌడలు 1906 నుంచి భూస్వామ్య వర్గం నుంచి దళారీ పారిశ్రామికవేత్తలుగా పరివర్తన చెందారు. వీరిలో ముఖ్యమైనవారు వీ.సీ. వెల్లింగిరి గౌడ, ఏ.వీ. రమణ గౌడ, మొదలైనవారు. వీరు నాయుళ్లతో పోటీపడే స్థాయికి ఎదిగారు. గౌడల పెట్టుబడి దుస్తుల తయారీ (కాటన్ నిట్‌వేర్) పరిశ్రమతో బాగా అభివృద్ధి చెందింది. ఆ ప్రాంతంలోని తిరుపూర్ పట్టణం భారతదేశ 'బనియన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. ఇది సాంప్రదాయ నిట్‌వేర్ ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన ముంబయి, లూధియానా, ఢిల్లీలను మించిపోయి ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. ఇందులో గౌడల దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలు ఎస్. రామస్వామి (బెస్ట్ ఇంటర్నేషనల్) మొదలైనవారు ముఖ్యమైనవారుగా అభివృద్ధి అయ్యారు. ప్రపంచీకరణ కాలంలో మొదట బేసిక్ టీ షర్టుల తయారీ, తర్వాత మరింత అధిక ఫాషన్‌తో కూడుకున్న స్పోర్ట్స్‌వేర్, జాకెట్లు, స్వెట్‌షర్ట్స్, బెర్ముడాలు, పిల్లల దుస్తులు, స్కర్ట్స్, మహిళల లోదుస్తుల తయారీ వృద్ధి చెందాయి. ఇవి పెద్ద మొత్తంలో సీ అండ్ ఏ, వాల్-మార్ట్, జేసీ పెన్నీ, సారా లీ, మార్క్స్ అండ్ స్పెన్సర్, టామ్మీ హిల్‌ఫిగర్, జీఏపీ వంటి ప్రపంచ విక్రేత(గ్లోబల్ బయర్)లకు సరఫరా అవుతున్నాయి.

దక్షిణ తమిళనాడుకు చెందిన నాడార్లు, కేరళకు చెందిన మళయాలీ ఎఝువలు 'అంటరాని కులాలు' కాకపోయినప్పటికీ, తీవ్రమైన అంటరానితనాన్ని ఎదుర్కొంటూ కల్లుగీత వృత్తితో జీవనం సాగించేవారు. 20వ శతాబ్దం ప్రారంభానికి క్రిస్టియన్ మతం చేపట్టడం, చదువుకునే అవకాశాలు రావడం, ఐరోపా పెట్టుబడులు కాఫీ, తేయాకు ప్లాంటేషన్లతో పాటుగా రావడం వలన ఉపాధి లభించడం, కల్లుగీత వృత్తిని వదిలి మిరప, ఉల్లి, వక్క వంటి వ్యాపార పంటలు వేయడం, బ్రిటిష్ పాలకుల, క్రిస్టియన్ మిషనరీల తోడ్పాటుతో ప్లాంటేషన్లలో మదుపు పెట్టడంతో వీరు మొదట వ్యాపార రంగంలోకి, ఆ తర్వాత పరిశ్రమల్లోకి ప్రవేశించి దళారీ పెట్టుబడిదారులుగా పరిణామం చెందారు. ఇందులో ప్రముఖ నాడార్ దళారీ పెట్టుబడిదారులు ప్లాంటేషన్ల యజమానులయిన పీ.డీ. దేవసహాయం, ఆల్ఫ్రెడ్ వేదం థామస్. పలు నాడార్ దళారీ కుటుంబాలు శివకాసి ప్రాంతానికి వలస వెళ్లిన తర్వాత తాటి బెల్లం వ్యాపారం ద్వారా, పత్తి, వేరుశనగ, పొగాకు వ్యాపార పంటల ద్వారా అభివృద్ధి అయ్యాయి. రైతులకూ, ఐరోపా ఎగుమతి సంస్థలు హార్వేస్, వోల్‌కార్ట్స్, రాల్లీస్‌లకు మధ్య దళారులుగా పనిచేస్తూ పత్తి సరఫరా చేయడంలో గుత్తాధిపత్యం సంపాదించాయి. ఇదే విధంగా రాంనాడ్ నాడార్లు కూడా బలమైన దళారీ వ్యాపార వర్గంగా అభివృద్ధి అయ్యారు. ఇక్కడ సాంప్రదాయక వ్యాపార కులమైన చెట్టియార్లు లేకపోవడంతో అది నాడర్లకు లాభించింది. వారు నాడార్ మహాజన సంగం ఆధ్వర్యంలో నాడార్ బ్యాంకు స్థాపించారు. పీ. అయ్య నాడార్, ఏ. షన్ముగ నాడార్‌లు శివకాసి ప్రాంతంలో అగ్గిపెట్టెల పరిశ్రమ స్థాపించడం ఒక మలుపు. అక్కడి పరిస్థితులు, వనరులు, చౌక మానవ శ్రమ అనుకూలించడం, కేంద్ర ప్రభుత్వం 1973లో ఆ పరిశ్రమను చిన్న తరహా పరిశ్రమగా గుర్తించి 'రిజర్వు' చేయడంతో అది క్రమంగా దేశంలో అతిపెద్ద అగ్గిపెట్టెల తయారీ హబ్‌గా అభివృద్ధి అయింది. శివకాసి-సత్తూర్-కోవిల్‌పట్టి ప్రాంతంలో

ఆధిపత్యం కలిగిన దాదాపు 20 నాడార్ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కుటుంబాలకు, ఇతరులకు ఇది లాభించింది. ఇందులో పాయినీర్ ఆసియా గ్రూపువంటివి ముఖ్యమైనవి. అగ్గిపెట్టెల పరిశ్రమ తిరిగి భారీ టపాకాయల (ఫైర్‌వర్క్స్) పరిశ్రమ, పైరోటెక్నిక్ రసాయనాల పరిశ్రమల అభివృద్ధికి దారితీసింది. దేశంలో 90 శాతం ఫైర్‌వర్క్స్ వ్యాపారం చేసేవారంతా నాడార్ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులే. తర్వాత ఆఫ్‌సెట్ ప్రింటింగ్ పరిశ్రమలో ఎస్ఎఫ్ఏ గ్రూపు దేశంలో అతిపెద్ద దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ స్టేషనరీ ఉత్పత్తుల కంపెనీగా, అతిపెద్ద కాగితం వ్యాపార కంపెనీగా, అతిపెద్ద ఇంకుల, పిగ్‌మెంట్ల డీలర్‌గా అభివృద్ధి అయింది. నువ్వుల నూనె పరిశ్రమ నాడర్ల ఆధ్వర్యంలో దేశంలో అతిపెద్ద సీబీబీ పరిశ్రమగా అభివృద్ధి అయింది. తర్వాత నూతనంగా అనేక మంది దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ మీడియా కంపెనీలుగా ముందుకు వచ్చారు. అనేక మంది ముఖ్యమైన నాడార్ దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలు పార్లమెంటరీ రాజకీయ నాయకులయ్యారు.

కేరళలో ఎఝువలు, సిరియన్ క్రిస్టియన్లు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ భూసంస్కరణలలో భాగంగా భూములు సంపాదించుకున్నారు. అందులో వారు వ్యాపార పంటలు ప్రత్యేకించి కొబ్బరి తోటలు వేయడం, అలెప్పీ పట్టణంలో ఐరోపా వ్యాపారి స్థాపించిన పీచు పరిశ్రమకు కొబ్బరి పీచు సరఫరా చేయడం, అందుకు అనుకూలించిన వాతావరణ, భౌగోళిక పరిస్థితులతో కే.సీ. కరుణాకరన్ వంటి కొందరు ఎఝువ రైతులు కొబ్బరి పీచు దళారీ వ్యాపారులుగా, పీచు తయారీ చేసే దళారీ పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందారు. దళారీ పెట్టుబడిదారీ కరన్ గ్రూపు ఆసియాలో అతిపెద్ద పీచు ఎగుమతిదారుగా అభివృద్ధి చెందింది. ఈ రంగంలో ఇతర ముఖ్యమైన ఎఝువ దళారీ పెట్టుబడిదారులుగా వీ.ఆర్. ప్రసాద్, సీ.ఆర్. దేవరాజ్ ముందుకు వచ్చారు. అధికార మార్పిడి తర్వాత కేరళలో సారా వ్యాపారంలో, కొబ్బరి కల్లు వ్యాపారంలో బలమైన పట్టు వెల్లపల్లి నటేశన్ వంటి ఎఝువ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులదే. ఇంకా వివిధ రంగాల్లో పలువురు ఎఝువలు దళారీ నిరంకుశ పెట్టుబడిదారులయ్యారు.

కర్నాటకలో తెలుగు మాట్లాడే ఇడిగ కులస్థులు కూడా సాంప్రదాయక తాటికల్లు గీత వృత్తి నుంచి నారాయణ స్వామి, దాసప్ప, బసవరాజ్, రాములు వంటి వారు సీబీబీ అభివృద్ధి అయ్యారు. బంగారప్ప, జనార్ధన్ పూజారి, జాలప్ప వంటి ముఖ్యమైన పార్లమెంటరీ రాజకీయ నాయకులు కూడా ఇడిగ కులస్థుల నుంచి వచ్చారు. ఏదిఏమైనా ఇడిగలు ఎఝువలు మాదిరిగా అభివృద్ధి కాలేకపోయారు.

వ్యవసాయ కులాలకు చెందిన మరాఠాలకు, పాటీదార్లకు 19వ శతాబ్దంలో పశ్చిమ భారతదేశంలో తమ ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధిగమిస్తూ, బనియా, మార్వాడీ, పార్సీ వంటి సాంప్రదాయ కులాల ఆధిపత్యాన్ని బద్దలు చేసి, పరిశ్రమలలోకి, వ్యాపారంలోకి మళ్లడానికి చక్కెర కోఆపరేటివ్‌లను స్థాపించుకోవడమే ప్రత్యామ్నాయమైంది. ఆనాటి పరిస్థితులు ఇందుకు తోడ్పడ్డాయి. కోఆపరేటివ్‌లను మహారాష్ట్రలో మొదట యశ్వంతరావు బల్వంతరావు చవాన్, తర్వాత వసంతదాదా పాటిల్, ఆ తర్వాత శరత్ పవార్ అధిపతులుగా వుండి నడపారు. వీరు ముగ్గురూ ముఖ్యమంత్రులుగా పని

చేసినవారే, సీబీబీలో భాగమే. మహారాష్ట్రలో ఈ వ్యాపారాలు విజయవంతం కావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వాలు కోఆపరేటివ్‌లకు సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడిని పెద్దమొత్తంలో రుణాలుగా సమకూర్చుతూ నయావలసవాద దోపిడీకి కట్టివేస్తూ పూర్తి మద్దతునివ్వడం. ఇలా సహాయాన్ని అందించే పేరుతో సామ్రాజ్యవాద పెట్టుబడి అధిక లాభాలు ఆర్జించింది. మహారాష్ట్ర ప్రభుత్వం 1961లో భూసంస్కరణలలో భాగంగా చెరకు తోటల్ని స్వాధీనం చేసుకోవడం భూస్వాములకు, వారి ఆధ్వర్యంలో స్థాపించిన ప్రైవేటు చక్కెర మిల్లులకు పెద్ద దెబ్బ. 1990లకు ముందు ప్రభుత్వ విధానంగా దిగుమతులపై నియంత్రణ విధించడం, లైసెన్స్‌లను కోఆపరేటివ్ రంగంలోని చక్కెర మిల్లులకు, డైరీలకు రిజర్వు చేయడం, చెరకు పండించే ప్రాంతాలను, పాల షెడ్లను కోరిన విధంగా కేటాయించడం బడా భూస్వాములకు నష్టాన్ని కలిగించగా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికి తోడ్పడింది.

అధికార మార్పిడికి ముందు గుజరాత్‌లో చక్కెర కోఆపరేటివ్ మిల్లులను సాంప్రదాయ కచ్ భాటియా వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ పాటిదార్లు వెనకడుగు వేయలేదు. అధికార మార్పిడి తర్వాత గుజరాత్‌లో 25 లక్షల మంది రైతులకు చెందిన అతిపెద్ద డైరీ కంగ్లామరేట్ గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జీసీఎంఎంఎఫ్) ఆవిర్భవించింది. పాల కోఆపరేటివ్‌లు పాటీదార్ల రైతులకు లాభదాయకంగా ఉండడంతో అవి నిరంతరాయంగా విస్తరించాయి. ఐదుగురు ముఖ్యమైన పాల కోఆపరేటివ్‌ల స్థాపకులంతా పాటీదార్లే. వీరు కోఆపరేటివ్‌లను ఉపయోగించుకుని ఆర్థికంగా బలపడడమే కాకుండా సీబీబీలో భాగమయ్యారు. కోఆపరేటివ్‌లు భాగస్వాములందరి భాగస్వామ్యంతో నడిచినట్లు కనపడినా వాస్తవానికి అవి ప్రైవేటు కుటుంబాలు నడిపే వ్యాపార సంస్థలు తప్ప మరొకటి కాదు.

అలాగే వ్యాపారేతర పీడక కులాలకు చెందిన నాయర్లు, ఉత్తరాది కాయస్తలు, రాజపుట్‌లు వంటి వారి నుంచి కూడా దళారీ పెట్టుబడిదారులు అభివృద్ధి అయ్యారు. నాయర్లలో, టీపీజీ నంబియార్ (బీపీఎల్), సీపీ కృష్ణన్ నాయర్ (లీలా హోటల్స్), రాజన్ పళని (బిస్కట్స్, జీడిపప్పు), కె. రవీంద్రనాథన్ నాయర్ (జీడిపప్పు నంబర్ 1 ఎగుమతిదారుడు), శుభాష్ మీనన్ (టెలికాం సాఫ్ట్‌వేర్), పీఎన్‌సీ మీనన్ (రియల్ ఎస్టేట్), రాం మీనన్ (ఆటో పరికరాలు) ముందుకు వచ్చారు. కాయస్తలలో, జేపీ శ్రీవాస్తవా (బట్టల మిల్లు), ఎస్‌పీ సిన్హా (జాన్సన్ అండ్ నికోల్సన్), జగదీష్ సక్సేనా (ఫార్మాస్యుటికల్స్) వంటివారు మినహా దళారీ పెట్టుబడిదారులుగా అభివృద్ధి అయింది చాలా తక్కువ. రాజపుట్‌లలో, కేవలం చౌహాన్ బ్రదర్స్ (బిస్‌లెరీ, ఫ్రూటీ, బిస్కెట్స్) మాత్రమే కనపడతారు.

సాంప్రదాయ దళారీ బూర్జువా వర్గ ఆధిపత్యం కారణంగా ఉత్తర భారతదేశంలో ఇతర మధ్యస్థ కులాలకు చెందిన జాట్లు, యాదవులు, గుజ్జర్లు మొదలైనవారి నుంచి వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు అంతగా అభివృద్ధి కాలేదు. వీరు చెరకు, వరి, గోధుమ, పత్తి, నూనె గింజలు, పాలు పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేస్తుంటారు. కానీ చక్కెర మిల్లుల, బ్రాండెడ్ రైస్ మిల్లుల

యజమానులుగా, ధాన్యం ఎగుమతిదారులుగా, సంపన్న టెక్స్‌టైల్ పారిశ్రామికవేత్తలు/వ్యాపారులు, ధనిక గనుల యజమానులు, డెయిరీ ప్రాసెసర్లుగా ఈ కులాల నుంచి చాలా అరుదుగా కనపడతారు. ఆ ప్రాంతంలో 2008 నాటికి పది అతిపెద్ద చెక్కర ఫ్యాక్టరీలలో జాట్ సిక్కు యాజమాన్యంలోని కంపెనీ (సింభావోలీ సుగర్ మిల్స్) ఒకటి మాత్రమే ఉన్నది. గుజ్జర్లకు చెందిన డెయిరీ కంపెనీ ఒకే ఒక వీఆర్ఎస్ ఫుడ్స్ (పారాస్) మాత్రమే ఉన్నది. శక్తివంతమైన మీడియాను స్థాపించగలిగే శక్తి ఈ (ఉత్తర భారతదేశంలో వెనుకబడిన) కులాలకు లేదు. ఈ విధంగా ఈ విషయంలో ఉత్తర భారతదేశంలో కులం, వర్గం దాదాపు కలిసిపోయాయి.

దేశంలో సాంప్రదాయ ముస్లిం వ్యాపార వర్గాల్లో హిందూ వ్యాపార కులాలైన లోహానాలు, తదితర కులాల నుంచి ముస్లిం మతం స్వీకరించిన మెమన్లు, ఖోజాలు, దావూదీ బోహ్రాలు, వీరితో పాటు చినోటి షేక్స్, కొంకణ్ ముస్లింలు ఉన్నారు. పాత గుజరాత్-సింధీ వ్యాపార సముదాయాల పునాది నుంచి అన్సారీ, ఖురేషీ సముదాయాలకు చెందిన ముస్లిం వ్యాపారులు ముందుకు వచ్చారు. కొంకణ్ ముస్లింల నుంచి 18వ శతాబ్ద ఆరంభంలోనే ప్రసిద్ధ ముల్లా అబ్దుల్ గఫార్ బడా దళారీ వ్యాపారిగా అభివృద్ధి అయ్యాడు. 19వ శతాబ్ద ఆరంభంలో ఈ ముస్లిం గ్రూపులు పార్సీ, హిందూ వైశ్య వంశపారంపర్య వ్యాపార సముదాయాలు చాలా విషయాల్లో ఒకే విధంగా వుండేవి. ముస్లిం గ్రూపులు 19వ శతాబ్ద మొదటి అర్ధభాగంలో భారతదేశ ఉపఖండమంతటా సుదూర వ్యాపార సంబంధాలు ఏర్పరచుకున్నారు. వీరికి బొంబాయి (ముంబయి), కోల్‌కతా, ఇతర లోతట్టు ప్రదేశాలలో దుకాణాలు ఉండేవి. ముంబయి ప్రెసిడెన్సీ, మధ్య, తూర్పు భారతదేశం, బర్మాలలో వ్యాపారం చేసేవారు. ఒడిశా నుంచి బంగాల్-బర్మా అరకా సముద్ర తీరం వరకు యావత్తు తూర్పు భారతదేశంలోని బియ్యం వర్తకంపై ఆధిపత్యం సంపాదించారు. 19వ శతాబ్దం చివరి నాటికి మెమన్లు, ఖొజాలు భారతదేశం నుంచి విదేశాలకు - ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్ ఓడరేవులకు, తూర్పు, దక్షిణ ఆఫ్రికా, శ్రీలంక, చైనా, సుదూర తూర్పు ప్రాంతాల్లోని ఓడరేవులకు తమ వ్యాపారాలను విస్తరించారు. 1930లలో హైదారాబాద్ నిజాం జాయింట్ వెంచర్ల ద్వారా ఆధునిక ముస్లిం పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందారు. ఇలా అధికార మార్పిడికి ముందు ముస్లిం పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందినప్పటికీ, వారిలో చాలా మంది మార్వాడీ, గుజరాతీ హిందూ/జైన బనియా పెట్టుబడి తమను మింగివేస్తుందనే భయంతో తమ వ్యాపారాల భద్రత రీత్యా దేశ విభజన జరిగినపుడు పాకిస్తాన్ వైపు మొగ్గు చూపారు. అధికార మార్పిడి తర్వాత ముస్లిం ఖోజా సముదాయానికి చెందిన ఆజీమ్ హషమ్ ప్రేమ్‌జీ, దావూదీ బొహ్రా సముదాయానికి చెందిన హబిల్ ఫకృద్దీన్ ఖోరాకివాలా, బొహ్రా వ్యాపారి సిరాజ్ లొఖండ్‌వాలా, మెమన్ సముదాయానికి చెందిన అబ్దుల్ రజాక్ అల్లనా మొదలైనవారు సీబీబీలుగా అభివృద్ధి చెందారు. అన్సారీ, ఖురేషీ సముదాయాలకు చెందిన వ్యాపారాలు మాంసం, తోలు పరిశ్రమల్లో ఆధిపత్యం వహిస్తూ సీబీబీ పరిశ్రమలుగా మారాయి. సాంప్రదాయకంగా నేత పనిచేసే అన్సారీలు 1960ల నుంచి మహారాష్ట్రలోని భివాండీ, మాలేగాం తదితర పట్టణాల్లో వికేంద్రీకృత పవర్‌లూం పరిశ్రమను అభివృద్ధి చేసి, ముస్లిం సీబీబీగా మెజారిటీ వ్యాపారాన్ని నడుపుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని

వారణాసి–మావు చేనేత బెల్ట్‌లో 1970ల చివరి నుంచి దళారులుగా, గుత్త వ్యాపారులుగా అభివృద్ధి అయ్యారు.

ఉత్తర కన్నడ జిల్లాలోని భక్త్‌కాల్‌కు చెందిన నవయత్‌లు దక్షిణాది రాష్ట్రాలలో, ముంబయిలో చిన్న వ్యాపారాలపై ఆధిపత్యం సంపాదించడంతో పాటు అనేక స్కూళ్లు, కాలేజీలు నడుపుతూ సీబీబీగా ఎదిగారు. కేరళలోని మలబారు ముస్లిములు లేదా మోప్లా ముస్లిం సముదాయానికి చెందినవారు 1970లలో చమురు ధరలు పెరిగినప్పుడు గల్ఫ్ ప్రాంతానికి వలస వెళ్లడంతో బాగా సంపాదించి ఒక నూతన తరం ముస్లిం ఎన్.ఆర్.ఐ. సీబీబీగా ముందుకు వచ్చింది. ప్రభుత్వ మద్దతు కూడా వీరికి తోడ్పడింది. ఈ కాలంలో జరిగిన పరిణామాల్లో మోప్లాలకు భిన్నంగా హైదరాబాద్ వంటి పాత కేంద్రాల్లో ముస్లిం సీబీబీ బాగా క్షీణించింది. అయితే ముస్లిములలో పార్లమెంటరీ పార్టీల నుంచి, ప్రభుత్వంలో కొద్ది మంది నిరంకుశ ఉన్నతాధికారుల నుంచి సీబీబీలో చేరినవారున్నారు.

పంజాబ్‌లో గ్రామ స్థాయి నుంచి వడ్డీ వ్యాపారంపై, ప్రాథమిక స్థాయి ఉత్పత్తులపై, టోకు వ్యాపారంపై, బిల్లు డిస్కౌంటింగ్, అంతిమ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌లపై – ఇలా పూర్తి వ్యాపార శృంఖలంపై ఆధిపత్యం ఉన్న బనియాలతో పోటీపడుతూ సాంప్రదాయేతర కులమైన రామ్‌గఢియాలు ఆధునిక కాలంలో వ్యాపార తెలివితేటలను అభివృద్ధి చేసుకున్నారు. సైకిల్, ఆటో విడిభాగాలు, మెషీన్ టూల్స్, టెక్స్‌టైల్ ఎక్విప్‌మెంటు, వ్యవసాయ యంత్రాలు తయారీ రంగాలలో అభివృద్ధి చెందారు. అయితే బనియాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టెక్స్‌టైల్ మిల్స్, బ్రాండెడ్ సైకిళ్లు, ట్రాక్టర్ల మాన్యుఫాక్చరింగ్‌ను నియంత్రించే తర్వాత దశకు వారు పురోగమించలేకపోయారు.

దళితుల నుంచి అతి చిన్న సెక్షన్ మాత్రమే బడా దళారీ నిరంకుశ బూర్జువా వర్గంగా ఎదిగింది. ఆ కులాల నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ పథకాలను, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను ఉపయోగించుకుని, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర ఉన్నత చదువులు చదివిన సెక్షన్ నుంచి అతి చిన్న సెక్షన్ ఈ విధంగా పరివర్తన చెందింది. ఇందులో చాలా మంది చిన్న, మధ్యతరహా వ్యాపారులు, పెట్టుబడిదారులే వున్నప్పటికీ వీరు తమ ఉనికి కోసం దళారీ నిరంకుశ బూర్జువా వర్గంతో సంబంధాలు ఏర్పరచుకుని, ఆర్థికంగా, భావజాలపరంగా సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వత్తాసుగా నిలుస్తున్నారు. వీరిలో అతి కొద్దిమంది దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గంలో చేరిపోతున్నారు.

ఇదే విధంగా ఆదివాసీ సముదాయాల నుంచి ఒక అతి చిన్న సెక్షన్ దళారీ నిరంకుశ బూర్జువా వర్గంలో చేరిపోతున్నది.

భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపు పుట్టుక, పెరుగుదల, అభివృద్ధిని అర్థం చేసుకునేందుకు ఈ క్రమాన్ని మూడు విస్పష్టమైన దశలుగా విభజించవచ్చు: 1. వలసవాద కాలం నుంచి 1947 అగస్టు 15 వరకు, 2. 1947 అగస్టు 15 నుంచి 1991 వరకు, 3. 1991 నుంచి 2024 వరకూ.

## 4. మొదటి దశ వలసవాద కాలం నుంచి 1947 అగస్టు 15 వరకు:

భారతదేశంలో ప్రాచీన కాలం నాటి వర్ణవ్యవస్థ, తదనంతర భూస్వామ్య సమాజ కాలం నాటి నిచ్చెనమెట్ల కులవ్యవస్థపై ఆధారపడిన శ్రమ విభజన శాశ్వతమైంది. తొలుత వ్యవసాయం చేసిన వైశ్యుల నుంచి ఆవిర్భవించిన 4వ వర్ణం–శూద్ర వర్ణం నుంచి వ్యవసాయం, చేతివృత్తులు చేసేవారు అనేక 'శూద్ర' కులాలుగా ఏర్పడ్డారు. అతితక్కువ సంఖ్యలో వైశ్యులు వర్తకానికి పరిమితమయ్యారు. సంపదలు, భూములు కలిగి వుండడం నిరాకరించబడినవారిని అంటరానివారిగా, అట్టడుగువారిగా పేర్కొనబడినవారిని పంచమ వర్ణంగా వర్గీకరించారు. శూద్రులలో కొన్ని చేతివృత్తుల సముదాయాలను కూడా పంచమ వర్ణంలోకి తోసివేసారు. అసంఖ్యాకమైన శూద్ర, పంచమ వర్ణాలలోని చేతివృత్తి కులాలవారు వర్తకులుగా మారే అవకాశమూ, వర్తకులు చేతివృత్తులలో ప్రవేశించి ఉత్పత్తిలో భాగమయ్యే అవకాశమూ కుల కట్టుబాట్ల వలన లేకుండా పోయాయి. కర్మ సిద్ధాంతంతో శూద్రులను, అంటరాని కులాలను అణచిపెట్టి ఉంచగలిగారు. వైశ్యులు మాత్రమే వర్తకం చేయాలనే కుల కట్టుబాటు వలన వర్తక వర్గం, వడ్డీ వ్యాపారులు దాదాపు అందరూ (కొంతమంది ముస్లిములు, పార్సీలు తప్ప) ఆ కులానికి చెందినవారే అయ్యారు. ఉత్పత్తిలో పాల్గొనకుండా అప్పులిచ్చే బ్యాంకర్లుగానూ, డబ్బు మార్పిడిదార్లుగానూ, ఫ్యూడల్ ప్రభువులకు సేవ చేసే శిస్తు వసూలుదార్లుగానూ, విదేశీ వ్యాపారులకు కమిషన్‌దార్లుగానూ ఉండి డబ్బు గడించారు. నవాబులకు, రాజులకు యుద్ధాల కోసం అప్పులిచ్చారు. ఇలా వర్తక పెట్టుబడి ఫ్యూడల్ వ్యవస్థను, కులవ్యవస్థను సంరక్షిస్తూనే పోగుపడింది. ఇలా భారతదేశంలో 16వ శతాబ్ది నాటికే అంటే బ్రిటిష్ వారు రాకపూర్వమే భూస్వామ్య వ్యవస్థపై ఆధారపడిన వర్తకులు ఆవిర్భవించారు. వర్తక, వడ్డీ వ్యాపార పెట్టుబడి, నవాబుల, రాజుల, జమీందార్ల పెట్టుబడి, కొంతవరకు చేతి వృత్తుల నుంచి వచ్చిన పెట్టుబడితో తొలి పరిశ్రమలు వృద్ధి చెంది ఉండినాయి. మొగల్ భారతదేశంలోని అధిక సంఖ్యాక ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమే అయినప్పటికీ, భారతదేశం సంపన్నమైన వస్తూత్పత్తి దేశంగా వుండేది. అంతర్జాతీయ, దేశీయ అవసరాలను తీరుస్తూ వుండేది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి విస్తృతంగా వుండేది. పాత, క్షీణిస్తున్న భూస్వామ్య సమాజ గర్భంలో బలహీనంగానే అయినప్పటికీ పెట్టుబడిదారీ శక్తులు మొలకెత్తటం ప్రారంభమైంది.

ఈ స్థితిలో మొదట పోర్చుగీసు వారు, ఆ తర్వాత డచ్, ఇంగ్లండు వారు భారతదేశంలో వ్యాపారం చేసేందుకు వచ్చారు. సముద్ర ప్రాంతాలపై ఆధిపత్యం సాధించేందుకు వారి మధ్య తీవ్ర పోటీ వుండేది. అప్పటి వరకూ నవాబులకూ, జమీందార్లకు వర్తకులుగా, పెద్ద పెద్ద భారతదేశ వర్తకులు, బ్యాంకర్లుగా వున్న పార్సీ వ్యాపారులు, గుజరాతీ బనియాలు, రాజస్థానీ మార్వాడీలు తదితరులు అనేక మంది యూరోపియన్లకు ఏజెంట్లుగా మారారు. ఒక చిన్న సెక్షన్ మాత్రమే స్వతంత్రంగా వుండింది. ఏజెంట్లుగా మారిన వ్యాపారులు ఉత్పత్తితో సంబంధం లేకుండా కమిషన్లపై ఆధారపడి అభివృద్ధి చెందినందువలన, ఈ వ్యాపార వర్గానికి జాతీయవాద స్వభావం ఏర్పడలేదు. విదేశీ వ్యాపారులు దేశాన్ని దోచుకుంటున్నా వీరికి పట్టలేదు.

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశ వర్తకంలో మొదటి ఉద్దేశ్యం భారతదేశపు వస్తువుల, పంటల వ్యాపారంలో గుత్తాధిపత్యం సంపాదించుకుని పెద్దమొత్తంలో లాభాలు సంపాదించుకోవాలనేదే. మసాలాలు, నూలు, పట్టు బట్టలు వగైరా వస్తువులకు ఇంగ్లండ్, యూరప్ మార్కెట్‌లోనూ గిరాకీ ఉండేది. భారతదేశంలో లభించే సరుకులను అతి తక్కువ ధరకు కొని అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్మి గుత్త లాభాలు గడించాలనేది వీరి ఆశయం. భారతదేశ ఫ్యూడల్ ప్రభువులలోని ఒక సెక్షన్‌కు యూరోపియన్ వ్యాపార గుత్తాధిపతులు ఆర్జించిన అపార లాభాలలో వాటా లభించేది. చాలా మంది దళారులు విదేశీ వ్యాపార సంస్థల్లో పని చేస్తూనే, తమ స్వంత వ్యాపారాలను కూడా నిర్వహిస్తూ అధిక మొత్తంలో డబ్బులు సంపాదించారు. ఫ్యూడల్ ప్రభువుల సైన్యాలలో పనిచేసే అనేక మంది నిరంకుశ అధికార్లు సైతం విదేశీ వ్యాపారాలలో అధిక లాభాలను గడించారు. బ్రిటిష్ వారికి దళారీలుగా పనిచేస్తూ అనేక మంది మార్వాడీలు 17, 18వ శతాబ్దాల్లో బంగాల్, బిహార్, ఒడిశా ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రధాన వ్యాపారులుగా స్థిరపడ్డారు.

17వ శతాబ్దంలో డచ్ వారు, ఇంగ్లిషు వారు కలిసి పోర్చుగీసులను ఓడించారు. ఆ తర్వాత బ్రిటిష్ వారు డచ్‌వారిని ఓడించడంతో ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారంలో ఆధిపత్యం సాధించింది. బ్రిటిష్ వలసవాదులు 1757 ప్లాసీ యుద్ధంలో విజయం సాధించి ప్రత్యక్షంగా దురాక్రమించే నాటికి భారతదేశంలో వర్తక పెట్టుబడి, వడ్డీ వ్యాపార పెట్టుబడి గుజరాత్, రాజస్థాన్, బంగాల్, మైసూరు, తమిళనాడు ప్రాంతాల్లో బాగా అభివృద్ధి అయింది. బ్రిటిష్ వాళ్లు బంగాల్‌ను జయించటానికి జరిపిన కుట్రలో జగత్‌సేఠ్‌లు, ఓమిచంద్ వంటి భారతదేశ బ్యాంకర్లు దేశద్రోహకర పాత్ర నిర్వహించారు. వీరిలాగే దేశంలోని ఇతర భాగాలలో మార్వాడీ, గుజరాతీ, పార్సీ వర్తకులు, బ్యాంకర్లు సైతం ఫ్యూడల్ రాజులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వలసవాదులు సాగించిన యుద్ధాలకు ఆర్థిక సహాయంతో సహా అన్ని విధాల పరోక్ష సహాయాన్ని అందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు బ్రిటిష్ పాలన విస్తరించటానికి అనేక విధాలుగా సహాయపడ్డారు. బ్రిటిష్ వలసవాదులు భారతదేశంలో తమకు లొంగిన ఫ్యూడల్ రాజులతో, జమీందార్లతో, దళారులుగా మారిన వడ్డీ వ్యాపారులతో, వర్తకులతో మిలాఖతై అధికారాన్ని సుస్థిరపరచుకోవడం ద్వారా తమకు తొత్తులుగా పనిచేసే దళారీ వ్యాపారుల పెరుగుదలకు, తద్వారా మాంచెస్టర్, లాంక్ షైర్‌లలో పారిశ్రామిక వెల్లువకు తోడ్పడ్డారు. తమకు దళారీలుగా మారని స్వతంత్ర, జాతీయ బూర్జువా వర్గాన్ని నాశనం చేసారు. బ్రిటిష్ ఆధిపత్యాన్ని దురాక్రమణను ఎదిరించి నిలిచిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, తాంతియా తోపే, టిప్పు సుల్తాన్ లాంటి దేశభక్త శక్తులను, గదర్ వీరులు, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, సూర్యసేన్ వంటి జాతీయ విప్లవకారులను, ఆదివాసీల తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన సిదో–కానో, సడ్మెక్ బాబూరావు, గుండాధుర్, అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా, కొమురం భీం వంటి సాహసిక ఆదివాసీ నాయకులను, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన నిజమైన కమ్యూనిస్టు విప్లవకారులను నిర్మూలించారు. దాదాపు రెండు శతాబ్దాల పాటు మన దేశాన్ని వలసగా మార్చుకొని బ్రిటిష్ పారిశ్రామికోత్పత్తులకు ముడి సరుకుల వనరుగా, తమ పారిశ్రామిక తయారీ సరుకులకు మార్కెట్‌గా మార్చివేయడం ద్వారా భారతదేశ పెట్టుబడిదారీ విధాన స్వతంత్ర

అభివృద్ధిని ఆటంకపరిచారు. దీనితో భారతదేశ ఫ్యూడల్ సమాజం వలస, అర్ధభూస్వామ్య సమాజంగా మారింది. ఈ కాలాన్ని మూడు ఫేజులుగా విభజించవచ్చు: వర్తక పెట్టుబడి దశ, పారిశ్రామిక పెట్టుబడి దశ, ద్రవ్య పెట్టుబడి దశ.

**వర్తక పెట్టుబడి దశ:** ఇది 1757 నుంచి 1813 వరకూ కొనసాగింది. ఈ దశలో బ్రిటిష్ వలసవాదులు అవలంబించిన దోపిడీ పద్ధతులన్నీ ప్రధానంగా అసమాన వర్తకానికీ, ప్రాథమిక పెట్టుబడి సంచయనానికి సంబంధించినవే. ఈనాడు భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గంలో ఆధిపత్య సెక్షనుగా వున్న పార్సీలు, బనియాలు, మార్వాడీలు బ్రిటిష్ పాలనా కాలంలోనే పశ్చిమాన మహారాష్ట్ర నుండి తూర్పున అసోం వరకు విస్తరించారు. మార్వాడీలలో ఎక్కువ మంది మొదటి నుండి విదేశీ ఉత్పత్తిదారులకు, భారతదేశ వినియోగదారులకు మధ్య విదేశీ ఎగుమతిదారులకు, మన దేశ దిగుమతిదారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ బలమైన కలుపు మొక్కల్లాగా అడ్డు లేకుండా పెరిగారు. ఈ దశలో ఈస్ట్ ఇండియా కంపెనీ అవలంబించిన దోపిడీ పద్ధతులు - అసమాన వర్తకం ద్వారా దోపిడీ, బలప్రయోగం ద్వారా చేతి వృత్తులవాళ్లనూ, చిన్న వర్తకులనూ దెబ్బతీయడం, భారీ అదనపు శిస్తులను రుద్దడం, ప్రత్యక్షంగా సైన్యంతో దాడులు చేయడం ద్వారా దేశ ప్రజలను, సంపదను లూటీ చేయడం, నీలిమందు ప్లాంటర్ల పీడన. అయితే 1813 కల్లా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్యం రద్దయ్యింది.

బ్రిటిష్ వలస పాలన భారతదేశంలో బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థను కొన్ని మార్పులతో పరిరక్షిస్తూ, సాంఘిక, మతపరమైన అజ్ఞానాన్ని, అమానుషమైన అంటరానితనాన్ని పెంచి పోషిస్తూ, ఫ్యూడల్ సంబంధాలను పునరుద్ధరించి, కులాధారిత భూస్వామ్యాన్ని తన సామాజిక పునాదిగా చేసుకుంది. దేశంలో వలసవాద ఉత్పత్తి సంబంధాలను (కలోనియల్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్) ప్రవేశపెట్టింది. విభజించు-పాలించు అనే దుష్టనీతిని పాటించి వలస పాలన శృంఖలాలను బలోపేతం చేసింది. భూమి సరుకుగా మారింది. సరుకు-డబ్బు సంబంధాలు చొచ్చుకువచ్చాయి. దేశంలోని స్వతంత్ర పరిశ్రమలు, వాణిజ్యాలు నాశనమయ్యాయి. స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైంది. రైతాంగం, చేతివృత్తుల వారు దివాలాతీసారు. చాలా మంది పాత స్వతంత్ర బడా వ్యాపారులు, బ్యాంకర్లు పన్నుల భారం తదితర ప్రజా వ్యతిరేక బ్రిటిష్ వారి ప్రభుత్వ విధానాలతో దివాలాతీసారు. బ్రిటిష్ వారికి దళారులుగా పనిచేసిన వర్తక, వడ్డీ వ్యాపారులు దళారీ వ్యాపారవర్గంగా పరివర్తన చెంది బలపడ్డారు. దేశీయ మార్కెట్ దెబ్బతిన్నది.

**పారిశ్రామిక పెట్టుబడి దశ:** ఈ దశ 1813 నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు సాగింది. ఈ దశలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక వలసగా పరాధీన స్థాయిలో విడదీయరాని భాగం కావడం అతి ముఖ్యమైన మార్పు. అది పారిశ్రామిక సరుకులను ఎగుమతి చేసే స్థితి నుండి దిగుమతి చేసుకునే స్థితికి దిగజారింది. భూస్వామ్య సంబంధాలు అర్ధభూస్వామ్య సంబంధాలుగా మార్పు చెందాయి. భారతదేశ దళారీ వర్తకులు, దళారీ బూర్జువా వర్గంగా పరిణామం చెందనారంభించారు. ఆధునిక కార్మికవర్గం ఆవిర్భవించింది.

భారతదేశం నుంచి నిరంతరాయంగా దోపిడీ చేసి తరలించిన సంపదతో తమ దేశంలో పారిశ్రామిక విప్లవాన్ని పెంపొందించడం బ్రిటిష్ పారిశ్రామిక విధానంగా ఉండింది. దీనికి అనుబంధ విభాగంగా భారత వలస వ్యవస్థను మార్చివేసింది. భారతదేశంలో వివిధ ఉత్పత్తి రంగాల మధ్య వున్న సమతుల్యాన్ని నాశనం చేసింది. దాని సహజ వనరులను దోచుకొని, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అడ్డుకుంది. అందుచేతనే "వలస పాలన పెట్టుబడిదారీ వ్యవస్థకు భౌతిక ఆధారాంశాలను ఏర్పరచటం అటుంచి ఉనికిలో వున్న ఉత్పత్తి శక్తులను నాశనం చేసి, కొత్త ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని కుంటుపరచి భారతదేశాన్ని వెనుకబాటుతనంలోకి నెట్టివేసింది" అని మార్క్స్ అభిప్రాయపడ్డారు (ఆర్టికల్స్ ఆన్ ఇండియా, 1వ పేజీ).

1850లకు ముందు భారతదేశంలో పార్సీ, బనియా, మార్వాడీ బ్రోకర్ల చేతుల్లో అపారమైన సంపద పోగుపడింది. కాని దాని నుండి ఆధునిక పరిశ్రమలలో పెట్టుబడి పెట్టింది చాలా తక్కువ. ఈ కాలంలో బ్రిటన్ పెట్టుబడి కూడా ఇక్కడ ఫ్యాక్టరీ పరిశ్రమను నిర్మించటంలో ఏమాత్రం శ్రద్ధ కనపరచలేదు. పత్తి గింజలు తీసే కార్ఖానాలు (కాటన్ జిన్నింగ్ మిల్లులు), ప్రెస్‌లు, పిండి మిల్లులు, బంగాల్‌లో బ్రిటిష్ పెట్టుబడితో రెండు జౌళి మిల్లులు, ఫ్రెంచివారి పెట్టుబడితో పాండిచ్చేరిలో ఒక జౌళి మిల్లు ఇలా బహు కొద్ది పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. జౌళి మిల్లులు పెద్దగా విజయవంతం కాలేదు. పత్తి గింజలు తీసే కాటన్ జిన్నింగ్ మిల్లులు, కాటన్ ప్రెసింగ్ మిల్లులు సీజను వారిగా పనిచేసాయి. వీటి స్థాపన వెనుకనున్న ఉద్దేశ్యం ముడి పత్తి నుండి గింజలు తీసి సులభంగా ఎగుమతి చేయటానికి దోహదపడడం.

1850ల నుంచి మొదటి ప్రపంచ యుద్ధానికి మధ్య భారతదేశ పారిశ్రామికవేత్తల యాజమాన్యంలో వున్న పరిశ్రమలు ముఖ్యంగా రెండు - జౌళి పరిశ్రమ, ఉక్కు పరిశ్రమ. బొంబాయి, అహ్మదాబాద్‌లలో జవుళి మిల్లులు నెలకొల్పిన వారంతా దీర్ఘకాలం పాటు బ్రిటిష్ పెట్టుబడికి బ్రోకర్లుగా, దానికి స్థానిక మధ్యవర్తులుగా పని చేసారు. వీరు నగదు పెట్టుబడి కోసం, ఇతర సహాయం కోసం రాజులపై ఆధారపడ్డారు.

1890ల చివరిలో బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో ఇనుము-ఉక్కు కర్మాగారాలు నెలకొల్పటానికి పూనుకున్నది. టాటా నెలకొల్పిన ఇనుము-ఉక్కు పరిశ్రమకు పెట్టుబడి చాలా భాగం భారతదేశంలోని భూస్వామ్య ప్రభువుల నుండే వచ్చింది. ఉదాహరణకు గ్వాలియర్ మహారాజు (సింధియా) వర్కింగు పెట్టుబడి మొత్తాన్ని సమకూర్చాడు. దీన్ని బట్టి ఒక వైపు సామ్రాజ్యవాదానికీ దళారీ బూర్జువా వర్గానికీ మరో వైపు సామ్రాజ్యవాదానికీ భూస్వామ్య వర్గానికి ఎంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయో తెలుస్తుంది. టాటాలకు చెందిన జల విద్యుత్ ప్రాజెక్టు కూడా ఈ విధమైన పెట్టుబడితోనే నిర్మాణమైంది.

సాసన్‌లు, కరీంభాయిలు, పిత్తిలు, వాడియాలు, టాటాలు వంటి ప్రముఖ జవుళి పారిశ్రామిక అధిపతుల ప్రయోజనాలు బ్రిటిష్ వారి ప్రయోజనాలతో దగ్గరగా ముడిపడి వున్నాయి. వీరు దళారీలుగా లాంక్‌షైర్‌కు ఎగుమతి కోసం ముడి పత్తిని సేకరించేవారు. లాంక్‌షైర్ మిల్లు వస్త్రాలను

స్వదేశీ మార్కెట్‌లో, అలాగే చైనా, ఆఫ్రికాలలో లాంక్‌షైర్ నూలును, తయారైన వస్తువులను అమ్మేవారు. యంత్రాల విభాగాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ కోసం భారత జౌళి పరిశ్రమ పూర్తిగా బ్రిటిష్ తయారీదారులపైన ఆధారపడింది. దీనితో భారతదేశంలోని కారు చౌక శ్రమ సృష్టించిన అదనపు విలువలో పెద్ద భాగాన్ని బ్రిటిష్ వారికే చెల్లించవలసి వచ్చేది.

బ్రిటిష్, భారతదేశ బడా పెట్టుబడిదారులు పంచుకునే అపారమైన లాభాలు, భారతదేశ కార్మికులను, పత్తి రైతులను హేయమైన రీతిలో దోపిడీ చేయడం ద్వారా లభించాయి. బ్రిటిష్-భారతదేశ మిల్లు యజమానులు, కింది నుండి పై స్థాయి వరకు ఉన్న బ్రోకర్లు, వడ్డీ వ్యాపారులు, భూస్వాములు అందరూ కుమ్మక్కై భారతదేశ ప్రజల్ని మోసగించి, దోపిడీ చేసారు.

టాటా బ్రిటిష్ వలసవాదుల కనుసన్నలలో అభివృద్ధి చెందిన బడా వ్యాపారి, పారిశ్రామికవేత్త బొంబాయిలో కెల్లా అతిపెద్ద భూస్వామి, వడ్డీ వ్యాపారి. భూమి క్రయ-విక్రయాలలో అపారమైన పెట్టుబడులు పెట్టి వడ్డీ వ్యాపారాన్ని పెద్దయెత్తున సాగించాడు. టాటా లాగానే గోయెంకా, బిర్లా వంటి భారతదేశ దళారీలు సామ్రాజ్యవాద పెట్టుబడితో మిలాఖతవటంతో కొద్దికాలంలోనే అపారమైన సంపదను కూడగట్టారు.

భారతదేశంలో బ్రిటిష్ మెకాలే విద్యా విధానంతో ప్రభావితమైన దళారీ, భూస్వామ్య శక్తులు ప్రారంభించిన పశ్చిమీకరణ ఉద్యమం కూడా వలసపాలన శృంఖలాలను బలోపేతం చేసింది. మెకాలే విద్యా విధాన ప్రధాన ఉద్దేశ్యం - సామ్రాజ్యవాద దేశానికీ వలస దేశానికి మధ్య బానిస సంస్కృతితో మేధస్సు కలిగిన మధ్యవర్తుల వర్గాన్ని సృష్టించడమే. ఇలా సృష్టించబడిన విద్యాధికులు, బడా దళారులు, భూస్వాములు తమ ఉనికి, పెరుగుదల కొరకు వలస పాలనపై ఆధారపడ్డారు. దీంతో కులాధారిత భూస్వామ్యాన్ని, అర్ధభూస్వామ్యాన్ని నిలిపి ఉంచడం బ్రిటిష్‌వారికి సులువైంది.

భారతదేశంలో బ్రిటిష్ వలసవాదులు నిర్మించిన రైల్వేలు, రోడ్లు ఆధునిక పరిశ్రమకు దారితీసేవిగా కాకుండా దేశాన్ని బ్రిటన్‌కు ఒక వ్యవసాయ అనుబంధంగానూ, దాని పారిశ్రామిక సరుకులకు మార్కెట్‌గాను మార్చే సాధనాలుగా రుజువయ్యాయి. పశ్చిమ యూరప్, అమెరికాలలో రైల్వేలు పారిశ్రామిక విప్లవానికి ఉత్ప్రేరకాలుగా పనిచేసాయి. దీనికి భిన్నంగా భారతదేశంలో అవి పూర్తి వలసీకరణకు ఉత్ప్రేరకాలుగా పనిచేసాయి. తేయాకు, రబ్బరు, కాఫీ ప్లాంటేషన్లు, గనులు, జనపనార పరిశ్రమ దాదాపు పూర్తిగా బ్రిటిష్ పెట్టుబడి అధీనంలో ఉండేవి. అలాగే మొదటి ప్రపంచయుద్ధానికి ముందు భారతదేశంలో సంఘటిత పరిశ్రమపై దాదాపుగా బ్రిటిష్ పెట్టుబడి ఆధిపత్యం ఉండేది. అయితే బ్రిటన్‌లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం తన ప్రయోజనాల కోసం ఈ ఉపఖండంలోని విశాల అర్ధభూస్వామ్య ఆర్థిక వ్యవస్థ లోపలనే తనపై ఆధారపడే కొన్ని పారిశ్రామిక ప్రాంతాల పెరుగుదలను ప్రోత్సహించింది.

ఆనాడు భారతదేశంలో బూర్జువా వర్గం రెండుగా చీలి వుండేది. ఒకటి, సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చడానికి వారిచే ఎంపిక చేసుకోబడ్డ దళారీ బడా బూర్జువా వర్గం. రెండవది, స్వతంత్ర అభివృద్ధికై పాటుపడే జాతీయ బూర్జువావర్గం. దళారీ బడా బూర్జువా

వర్గం పీడక కులాల, ప్రత్యేకించి వ్యాపార కుల సముదాయ మూలాలను కలిగి వుండడం వలన, బ్రిటిష్ వలసపాలనలో సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడికి అంటకాగడం వలన, అది పెట్టుబడిని, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను, మార్కెట్‌ను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకోవడం, పెంపొందించుకోవడంలో, పోటీ పడడంలో అనేక అనుకూలతలను పొందగలిగింది. ఇందుకు భిన్నంగా జాతీయ బూర్జువా వర్గం విదేశీ పెట్టుబడితో మిలాఖతవడాన్ని వ్యతిరేకించింది. విదేశీ పెట్టుబడి దేశ ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యానికి, ప్రగతికి అవరోధంగా పేర్కొంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దళారీ బూర్జువావర్గాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూ, తమ ప్రయోజనాలకు ప్రమాదకరమైన జాతీయ బూర్జువావర్గాన్ని దెబ్బతీసేందుకు తాము చేయగలిగిందంతా చేసారు.

**ద్రవ్య పెట్టుబడి దశ:** 20వ శతాబ్దారంభంలో సామ్రాజ్యవాదం ఆవిర్భావంతో ఈ దశ మొదలైంది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదం బలహీనపడింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి పోటీగా నూతనంగా అమెరికా, మొదటి ప్రపంచ యుద్ధ ఓటమి నుండి కోలుకొని తిరిగి జర్మనీ సామ్రాజ్యవాద శక్తులు ముందుకు వచ్చాయి. పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద ప్రపంచంలో బ్రిటన్ అగ్రస్థానాన్ని అమెరికా ఆక్రమించింది. రష్యాలో లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ పార్టీ అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేయడంతో ప్రపంచంలో మొదటి సోషలిస్టు రాజ్యం ఆవిర్భవించి ప్రపంచ పీడిత ప్రజలకు ఒక విముక్తి మార్గాన్ని చూపించింది. అది సామ్రాజ్యవాద వ్యవస్థకే ప్రమాదంగా పరిణమించింది. దీంతో బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం ఆర్థిక, సైనిక, రాజకీయపరమైన కారణాల రీత్యా పారిశ్రామిక విధానంలో మార్పులు చేసింది. ఇదే సమయంలో భారతదేశ ప్రజలలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పట్ల తీవ్రతరమవుతున్న ఆగ్రహాన్ని చల్లార్చేందుకూ, భారతదేశ ప్రయోజనాల కంటే సామ్రాజ్యవాద ప్రయోజనాలను మిన్నగా ఎంచి, భారతదేశ బడా బూర్జువా వర్గం అందిస్తూ ఉండిన విశ్వసనీయమైన సేవలకు గుర్తింపుగానూ, భారతదేశంలో తమ సామాజిక పునాదిని బలోపేతం చేసుకొనేందుకూ వారికి కొన్ని రాయితీలు కల్పించింది.

ఇందులో భాగంగానే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాలను, బ్రిటిష్–ఇండియా ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికీ, బలోపేతం చేయడానికే వలస భారతదేశంలో కొన్ని పరిశ్రమలను అభివృద్ధి చేసారు. భారత పారిశ్రామిక కమిషన్ (1916–1918)ను నెలకొల్పి, ఇనుము–ఉక్కు, నూలు, కాగితం, అగ్గిపెట్టెలు, సిమెంటు, జనపనార, పంచదార, భార రసాయనాలు వంటి పరిశ్రమలకు సబ్సిడీలు, రక్షణలు మంజూరు చేసారు. ఇవి బిర్లాలు, సింగానియాలు, శ్రీరామ్‌లు, గొయెంకాలు, దాల్మియా జైన్లు, సూరజ్‌మల్ నాగర్‌మల్‌లు, రూయాలు, పొద్దార్‌లు, థాపర్లు, వాల్‌చంద్‌లు, చెట్టియార్లు, నాయుళ్ల వంటి కొత్త భారత బడా బూర్జువా గ్రూపులు తలెత్తటానికి దారితీసాయి. భారతదేశ దళారీ బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ 1920 దశకం ప్రారంభంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా పోరాటాన్ని నీరుగార్చివేసింది.

1935 బ్రిటిష్–ఇండియా ప్రభుత్వ చట్టం కింద దేశంలో 2 శాతం ఓటర్లతో పార్లమెంటరీ

వ్యవస్థ వునికిలో వచ్చింది. ఇందులో బ్రిటిష్ వారితో కలిసి భారత దళారీ బడా బూర్జువా, భూస్వామ్య వర్గం అధికారంలో భాగమైంది. ఫలితంగా సామ్రాజ్యవాద పెట్టుబడి, భారతదేశ దళారీ బడా బూర్జువా వర్గ పెట్టుబడి రెండూ లాభపడ్డాయి. వివిధ సామ్రాజ్యవాద దేశాలకు చెందిన భారీ గుత్త సంస్థలైన ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్, యూనిలివర్, డన్‌లప్, బ్రిటిష్ ఆక్సిజ్, గెస్ట్ కీన్ విలియమ్స్, బాటా, అల్యూమినియం లిమిటెడ్, యూనియన్ కార్బైడ్, స్వీడిష్ మాచ్ కంపెనీలు కూడా రంగంలోకి దిగి భారతదేశ పరిశ్రమపై ఆధిపత్యం వహించేందుకు సరుకుల ఉత్పత్తి యూనిట్లను నెలకొల్పాయి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో బ్రిటన్ నుండి భారతదేశంలోకి వచ్చే దిగుమతుల స్థానాన్ని బ్రిటిషేతర సామ్రాజ్యవాద దేశాల దిగుమతులు ఆక్రమించాయి. టాటాలు ఈ కాలంలో బ్రిటిష్ పెట్టుబడితోనూ, అమెరికన్ పెట్టుబడితోనూ సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నారు. బొంబాయి, కలకత్తాలకు చెందిన మార్వాడీలు పోద్దార్, బజాజ్, బిర్లా, రుయాలు జపాన్‌లోని మిట్సుయి సంస్థతోనూ పలు జపాన్ వాణిజ్య సంస్థలతోనూ సంబంధాలు ఏర్పరచుకున్నారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ లాభాలతో విలసిల్లిన అనేక మార్వాడీ సంస్థలు పరిశ్రమలో పెట్టుబడి పెట్టడం ప్రారంభించాయి. నౌకా నిర్మాణ యార్డుల్ని, ఆటోమొబైల్స్, విమాన కర్మాగారాల్ని నెలకొల్పే విషయంలోనే కాక అనేక పరిశ్రమల ఏర్పాటులో కూడా సామ్రాజ్యవాద పెట్టుబడిపై అంతులేకుండా ఆధారపడటమనేది భారతదేశ బడా బూర్జువా వర్గ దళారీ లక్షణమే.

భారతదేశ బడా పెట్టుబడి భారతదేశం లోపల విదేశీ పెట్టుబడికి సేవక పాత్ర వహించటమే కాక బ్రిటిష్ ఆక్రమణ కింద వున్న ఇతర వలసలను దాని సహకారంతో దోపిడీ చేయటానికి కూడా పూనుకుంది. వడ్డీ వ్యాపారులు, వర్తకులైన తమిళనాడుకు చెందిన నట్టుకొట్టై చెట్టియార్లు 1930 వరకు శ్రీలంక, మలయా, సింగపూర్, బర్మా వంటి అనేక ఆగ్నేయాసియా దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరించారు. చెట్టియార్ ప్రైవేటు బ్యాంకింగ్ సంస్థలకు, బ్రిటిష్ మారక బ్యాంకులకు స్థానికులకు మధ్యవర్తులుగా ఉన్నారు. చెట్టియార్ వడ్డీ వ్యాపార వృద్ధికి వలస వ్యవస్థ ఎంతో తోడ్పడింది. చెట్టియార్లు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక శక్తిగా వుండేవారు. పరిశ్రమలలో లాగే బ్యాంకింగ్‌లో కూడా బ్రిటిష్, భారతదేశ పెట్టుబడులు కలగలిసిపోయాయి. వీటిలో బ్రిటిష్ పెట్టుబడిదే ప్రధాన పాత్ర. ఉదాహరణకు, బంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీ బ్యాంకుల విలీనంతో 1921లో ఏర్పడిన ఇంపీరియల్ బ్యాంకు ఆఫ్ ఇండియా భారతదేశంలో కెల్లా అతి పెద్ద బ్యాంకు. దీనిని బ్రిటిష్ వారే అదుపు చేసారు. ఈ బ్యాంకులో యావత్తు ప్రభుత్వ ఖజానాల నిధులూ డిపాజిట్ చేయడం, ప్రభుత్వ రుణం కూడా దాని నిర్వహణలోనే ఉండడం, అది ప్రభుత్వ బ్యాంకర్‌గా కూడా పని చేయడం ద్వారా విదేశీ పెట్టుబడి, భారతదేశ బడా పెట్టుబడి మరింతగా పెనవేసుకుపోయాయి. భారతదేశ, బ్రిటిష్ యాజమాన్యంలోని సిమెంటు కంపెనీలు రెండు గుత్త సంస్థలుగా ఏర్పడ్డాయి.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో భారతదేశ బడా పెట్టుబడికి బ్రిటిష్ పెట్టుబడి వలసవాద రాజ్య యంత్రాంగానికి మధ్య మిలాఖతు గతం కంటే సన్నిహితమైంది. 1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచ యుద్ధం రావడంతో బడా దళారీ బూర్జువా వర్గానికి ప్రోత్సాహకరమైన అవకాశాలు

వచ్చాయి. వారు తమ స్వభావ రీత్యా యుద్ధాన్ని సామ్రాజ్యవాదాన్ని కూలదోసే అవకాశంగా కాక బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, అవసరమైతే జపాన్ సామ్రాజ్యవాదులకు సహాయం చేయడం, దేశ ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టి తమ ప్రయోజనాలను నెరవేర్చుకునే మార్గంగా చూసారు. ఈ యుద్ధం వారికి అపార లాభాలు కురిపించితే, కోట్లాది ప్రజలకు చెప్పనలవికాని కష్టాలు కడగండ్లు కొనితెచ్చింది. లక్షలాది ప్రజల మరణానికి కారణమైంది.

అధికార మార్పిడి సమయానికి భారతదేశ పారిశ్రామిక రంగంలో అతి ముఖ్యమైన లక్షణం ఏమంటే యంత్రాల ఉత్పత్తి (కాపిటల్ గూడ్స్ లేదా ప్రొడ్యూసర్ గూడ్స్) అనేది దాదాపుగా లేకపోవడమే. యంత్రాల కోసం దాదాపు పూర్తిగా విదేశీ దిగుమతులపై ఆధారపడవలసి వచ్చేది. వ్యవసాయాన్ని వెనుకబాటుతనంలోనే ఉంచి, సంక్షోభంలోకి నెట్టి, పరిశ్రమల పెరుగుదల గొంతు నులిమి, విశాల ప్రజానీకాన్ని ఆకలి, వ్యాధులు, అజ్ఞానంలోకి నెట్టివేసిన సామ్రాజ్యవాద వ్యవస్థ దోపిడీ, అణచివేతలను భారతదేశ దళారీ బడా బూర్జువావర్గం ఎన్నడూ ప్రశ్నించలేదు. ఇందుకు భిన్నంగా 1857-58 నాటి భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ కాలంలోనూ, ఆ తర్వాత వలస పాలనను కూలదోయటానికి ప్రజలు సాగించిన పోరాటాల కాలంలోనూ భారతదేశ దళారీ బడా బూర్జువావర్గం ప్రతిఘాతక పాత్రను పోషించింది. వలసవాద పరిపాలనా యంత్రాంగంలో కొంత మెరుగుదలను కోరుతూ దానిని కొనసాగించాలని కోరుకుంది. సామ్రాజ్యవాద పాలనా చట్రంలో ప్రత్యేక హక్కులను విస్తరించుకోవటానికి మాత్రమే ప్రయత్నించింది.

1885లో బ్రిటిష్ వలసవాద ప్రయోజనాలను, భారతదేశ దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను ఈడేర్చడానికీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను నిలువరించటానికి, బ్రిటిష్ వారి కనుసన్నల్లో ఏ.ఓ. హ్యూమ్ ఆధ్వర్యంలో భారతదేశ జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. అందువల్లనే కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారి నుంచి రాయితీలను సంపాదించటానికే ప్రయత్నించింది తప్ప సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని కూలదోయడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు.

మొత్తంగా చూసినప్పుడు భారతదేశ దళారీ బడా బూర్జువా వర్గం తన స్వభావ రీత్యానే బ్రిటిష్ సామ్రాజ్యవాద పెట్టుబడితో మిలాఖతు కావడం తప్ప ఎన్నడూ పోరాటాలకు దిగలేదు. దోపిడీలో వాటాలు పంచుకోవడానికి సుంకాలు, రక్షణ, స్టెర్లింగ్-రూపాయి మారకం విలువ, ప్రభుత్వ కొనుగోళ్లు మొదలైనవాటిని రెండవస్థాయి సమస్యలుగానే చూసింది. అందుచేతనే ఈ వర్గం నిరంతరం సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని, దోపిడీని కాపాడడం కోసం సామ్రాజ్యవాద పక్షం వహిస్తూ పోరాడే ప్రజలను వ్యతిరేకించింది. సామ్రాజ్యవాదంతో దాని మిలాఖతు ప్రాథమికమైంది. ఈ వర్గం జాతీయ ప్రజాస్వామిక విప్లవానికి ద్రోహం చేయడంతో అది విస్పష్టంగా అర్థమైంది.

1925లోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటికీ, దానికి అసంఖ్యాక అవకాశాలు లభించినప్పటికీ, పార్టీ నాయకత్వం తప్పుడు పంథాను అనుసరించిన కారణంగా జాతీయ విముక్తి-ప్రజాస్వామిక ఉద్యమంలో నాయకత్వ పాత్ర నిర్వహించలేకపోయింది. సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనంగా వుండడం, విప్లవకర నాయకత్వం లేకపోవడం, జాతీయ బూర్జువా

వర్గానికి నాయకత్వం వహించే శక్తి లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ గాంధీవాద, దళారీ బూర్జువా, భూస్వామ్య నాయకత్వపు అసలు వర్గ స్వభావాన్ని గుర్తించడంలో, అది అంతిమంగా బ్రిటిషు సామ్రాజ్యవాదులకు లొంగిపోయి స్వాతంత్ర్య పోరాటానికి ద్రోహం చేస్తుందనే అంచనాకు రావడంలో విఫలమయింది. సామ్రాజ్యవాదుల, భారతదేశ బడా పెట్టుబడిదారుల కుట్రలను ఓడించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ తోక పట్టుకు నడుస్తూ విశ్వజనీన సత్యమైన మార్క్సిజం–లెనినిజాన్ని భారత విప్లవ నిర్దిష్ట పరిస్థితులతో జోడించటానికి సరైన వ్యూహం–ఎత్తుగడలను చేపట్టటానికి విముఖత చూపింది. కామ్రేడ్ మావో సేటుంగ్, చైనా కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో విజయవంతంగా పురోగమిస్తున్న చైనా విప్లవం నుండి నేర్చుకోవడానికి, అది అవలంబించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను, దాని గొప్ప అనుభవాలను స్వీకరించడానికి అది నిరాకరించింది. వాస్తవానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక మిలిటెంట్ ఉద్యమాన్ని పట్టాలు తప్పించడానికి బూర్జువా వర్గానికి దోహదపడింది. అది కాంగ్రెస్‌తో అవకాశవాద పొత్తు పెట్టుకుని, ఐక్యసంఘటనలో స్వతంత్రతను నిలబెట్టుకోకుండా, అంతా ఐక్యత ద్వారానే సాధ్యం అని భావిస్తూ విప్లవకర ప్రజానీకాన్ని గాంధీవాద నాయకత్వం వెనుక ఈడ్చుకుపోయింది. అంతిమంగా భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామానికీ, భారత ప్రజలకు ద్రోహం చేసింది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలోనూ, ఆ తరువాతా జరిగిన పరిణామాలు ప్రపంచంలో బలాబలాల సమతౌల్యంలో కొత్త మార్పును తెచ్చాయి. ముఖ్యంగా మహా నాయకుడు స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ ఎర్రసైన్యమూ, ప్రపంచ ప్రజలూ ఫాసిస్టు శక్తుల్ని చిత్తుగా ఓడించారు. యుద్ధ ఫలితంగా సామ్రాజ్యవాదం గణనీయంగా బలహీనపడింది. తూర్పు యూరప్ దేశాల్లో ప్రజల ప్రజాస్వామిక అధికారం ఆవిర్భవించింది. కామ్రేడ్ మావో నాయకత్వాన చైనాలో విప్లవం విజయపథాన పురోగమిస్తూ ప్రపంచవ్యాప్తంగా పీడిత జాతుల, ప్రజల విముక్తికి మార్గాన్ని చూపుతూ, ప్రపంచాన్ని కుదిపివేసింది. ప్రపంచంలో మూడో వంతు భూభాగంలో ప్రపంచ సోషలిస్టు శిబిరం ఆవిర్భవించింది. ముందెన్నడూ లేనివిధంగా జాతీయ విముక్తి పోరాటాలు వెల్లువెత్తాయి. అటువంటి గడ్డుస్థితిలో సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాల్లో పాత ప్రత్యక్ష వలసవాదాన్ని విడనాడి, పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీలను కొనసాగించేందుకు తాము ఎంపిక చేసి, శిక్షణనిచ్చిన ఏజెంట్లపై ఆధారపడి కొత్త శైలిలో నయా వలసవాదాన్ని చేపట్టింది.

భారతదేశంలో తెభాగా, బకాస్త్ ఉద్యమాలు, పోస్టల్–టెలిగ్రాఫ్ సమ్మె; బొంబాయిలో రాయల్ ఇండియన్ నేవీ మహత్తర తిరుగుబాటు, సైన్యం, వైమానిక బలగాలలో తిరుగుబాటు ధోరణులు; బిహార్‌లో పోలీసుల తిరుగుబాటు; కార్మికవర్గ సంఘీభావ పోరాటాలు; చారిత్రక తెలంగాణరైతాంగ సాయుధ పోరాట ప్రారంభం – ఇవన్నీ దేశంలో సామ్రాజ్యవాద పాలనను దాదాపుగా ముగింపుకు తీసుకువచ్చాయి. ఇలాంటి స్థితిలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతదేశ ప్రజల విప్లవ వెల్లువను అణచివేయడం, తమ దోపిడీ, అజమాయిషీ, పరోక్ష పాలననూ కొనసాగించడం కోసం తమకు

విశ్వాసపాత్రులైన దళారీ ఏజెంట్లయిన కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకత్వ శక్తులను ఉపయోగించుకుంది. దళారీ బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలతో కుమ్మక్కయ్యి అధికార మార్పిడి నాటకాన్ని రచించింది.

1944లో రూపొందిన బొంబాయి ప్లాన్ ఇందులో భాగమే. ఈ ప్లాన్‌ను టాటా, బిర్లా వంటి ఫ్యూడల్, దళారీ బూర్జువా వర్గ ప్రతినిధులే రూపొందించారు. ఈ ప్లాన్‌లో భూస్వామ్యాన్ని తుడిచిపెట్టివేసే పథకం లేదు. వ్యవసాయ సమస్యను, భూసమస్యలనూ పరిష్కరించి, నూతన పరిశ్రమలకు మార్కెట్ కల్పించడం కోసం ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం గురించి ఏమీ పేర్కొనలేదు. కనీసం భూములు, పరిశ్రమలు, బ్యాంకులు తదితర బ్రిటిష్ ఆస్తుల జాతీయాకరణ గురించి పేర్కొనలేదు. ఇందుకు బదులుగా ఈ ప్లాన్ మరింత విదేశీ పెట్టుబడిని ఆహ్వానించింది. ఇది బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహానికి, భారతదేశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు అనుగుణమైంది. ఈ ఒప్పందాల ప్రకారం భారతదేశంలో కీలకమైన భారీ పరిశ్రమలను నెలకొల్పరాదు. అందుకు బదులుగా బ్రిటన్, అమెరికాలలో తయారయిన విడి భాగాల అసెంబ్లింగ్ యూనిట్‌లను ఏర్పరచాలి. బిర్లా-స్టుడెబేకర్, వాల్ చంద్-క్రిస్లర్, నేషనల్ రేయాన్ కార్పొరేషన్ మొదలయిన అనేక భారతదేశ-అమెరికా వ్యాపార ఒప్పందాలు ఈ రకంగా జరిగినవే. భారతదేశ దళారీ బూర్జువా వర్గానికి సామ్రాజ్యవాద గుత్తాధిపత్య సంస్థలకూ మధ్య అటువంటి ఒప్పందాలు జరిగిన తరువాతనే 1947లో అధికార మార్పిడి జరిగింది. ఇది బ్రిటిన్ అధికారిక సామ్రాజ్యం అనేక సామ్రాజ్యవాద శక్తులు పంచుకునే అనధికారిక సామ్రాజ్యంగా పరిణామం చెందడానికి దారితీసింది.

## 5. రెండవ దశ 1947 అగస్టు 15 నుండి 1991 వరకు:

2వ ప్రపంచ యుద్ధానంతరం అగ్రరాజ్యంగా ఆవిర్భవించిన అమెరికా తన వ్యూహాత్మక ఆర్థిక, రాజకీయ, సైనిక ఆధిపత్య ప్రయోజనాలకు అనుగుణంగా నయా వలసవాద విధానాలు రూపొందించుకుంది. యుద్ధంలో బ్రిటన్‌తో పాటు ఇతర యూరప్ దేశాల కరెన్సీల విలువలు యుద్ధభారం, సంక్షోభం కారణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా ద్రవ్య నియంత్రణకు 1944 జులైలో అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు 44 దేశాల ప్రతినిధులతో బ్రెటన్ ఊడ్స్‌లో కాన్ఫరెన్స్‌ను నిర్వహించి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఆనాటి గడ్డు స్థితి నుంచి గట్టెక్కడానికి డాలరు విలువతో వివిధ దేశాల కరెన్సీల విలువలను ముడిపెట్టాలని అమెరికా విధించిన షరతును ప్రతినిధులు అంగీకరించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకుల స్థాపన జరిగింది. అమెరికా నయా వలసవాద విధానాల లక్ష్యం అమెరికా డాలర్ కేంద్రంగా అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను నిర్మించడం. బ్రెటన్ ఊడ్స్ ఒప్పందం ద్వారా అది తన లక్ష్యాన్ని సాధించింది. మోసపూరిత కాగితపు డాలర్లకు నిజ సరుకులు, వనరులు, శ్రమ కోసం మారకం చేయడం అంతర్జాతీయ విధానంగా మార్చింది. నయావలసవాదానికి అనుగుణంగా సామ్రాజ్యవాద పెట్టుబడికీ, అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశాల దళారీ నిరంకుశ

బడా పెట్టుబడికి మధ్య పరస్పరాధారిత దోపిడీ, పీడనలతో కూడిన సంబంధాలను పటిష్టపరచడంలో సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో పాటు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు ప్రముఖ పాత్ర వహించాయి. అమెరికా డాలర్ ఆధిపత్యం రుణగ్రస్త దేశాల సంపదను రుణదాత దేశాలకు బదిలీ చేసేందుకు దారితీసింది. అంటే పేద దేశాలను ధనిక దేశాలు విచ్చలవిడిగా దోచుకోవడానికి వీలు కల్పించింది. ఇది పూర్తిగా అసమాన, అన్యాయ సంబంధం.

దీనికి అనుగుణంగా, భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థ ప్రయోజనాలకు లోబరిచే/మలిచే లక్ష్యంతో కుదుర్చుకున్న ఒప్పందాలలో భాగంగా జరిగినదే 1947 అగస్టు 15 అధికార మార్పిడి. దళారీ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మిశ్రమ ఆర్థిక విధానం పరోక్షంగా అనేక సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యాన్ని సుస్థిరం చేస్తూ దేశాన్ని అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థగా మార్చింది. అధికార మార్పిడితో దేశాధికారాన్ని పొందడంతో పాటు దళారీ బూర్జువా పెట్టుబడి రాజ్య పెట్టుబడితో కలిసి భారతదేశ బడా బూర్జువావర్గం దళారీ నిరంకుశ బూర్జువా వర్గంగా (కాంప్రడార్ బ్యూరాక్రటిక్ బూర్జువాజీ–సీబీబీ) మారిపోయింది. దేశంలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల రాజ్య గుత్త పెట్టుబడిదారీ విధానం అమలులోకి వచ్చింది. భారతదేశంలోని అభివృద్ధి నిరోధక పాలకవర్గాల ఆర్థిక పునాది ఇదే. వివిధ దేశాల సామ్రాజ్యవాద శక్తులు భారతదేశంపైన తమ దోపిడీ, నియంత్రణను చలాయించడానికి గాను ఈ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాల్ని తమ ప్రధాన సామాజిక ఆసరాలుగా చేసుకున్నాయి. అందువల్ల ఈ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు సామ్రాజ్యవాదం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించలేవు. సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీవర్గం అభివృద్ధి చేస్తున్న పెట్టుబడిదారీ విధానం స్వతంత్రమైన జాతీయ పెట్టుబడిదారీ విధానం కాదు. ఇది సామ్రాజ్యవాదంతోను, భూస్వామ్య విధానంతోను ముడిపడి వున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం.

**భారతదేశ రాజ్యపు వర్గ స్వభావం:** "రాజ్యం ఒక వర్గం మరో వర్గాన్ని అణచివేయడం కోసం వుండే యంత్రాంగం" అనీ (సంకలిత రచనలు, సం.29, పే. 380), "అత్యంత ప్రజాస్వామిక బూర్జువా రిపబ్లిక్ కూడా, పెట్టుబడి పీడితులను అణచివేసే యంత్రాంగంగా తప్ప, పెట్టుబడి రాజకీయ పరిపాలనా సాధనంగానూ బూర్జువావర్గ నియంతృత్వ సాధనంగానూ తప్ప మరొకటిగా ఎన్నడూ వుండలేదు, వుండజాలదు" అనీ లెనిన్ బోధించారు (ఏరిన రచనలు, సం.10, పే. 35–36). ఇదే విధంగా 'రిపబ్లిక్', 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' అనబడే పేర్ల కింద చెలామణి అవుతున్న భారతదేశం నయావలస రూపంలోని పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీల కింద వున్న, పిడికెడు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య పాలకవర్గాలు భారత విశాల ప్రజాబాహుళ్యంపై ఉమ్మడి నియంతృత్వం నెరిపే అర్ధవలస, అర్ధభూస్వామ్య రాజ్యమే తప్ప మరొకటి కాదు. ఈ రాజ్య యంత్రాంగ ప్రధాన అంగం దాని సాయుధ బలగాలే. వాటి వర్గ పాలనకూ, వర్గ అణచివేతకూ, వర్గ దోపిడీకి సాధనం. పీడిత ప్రజల దోపిడీ, పీడన, అణచివేతలను సుసాధ్యం

చేసే భావజాలంగా, సామాజిక వ్యవస్థగా కులవ్యవస్థ భారతదేశ రాజ్యంలో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నది. బ్రాహ్మణవాద భావజాలం కలిగి వున్న భారతదేశ రాజ్యం మైనారిటీగా కేవలం 10 శాతంగా వున్న దళారీ దోపిడీ వర్గాలకు–ఆధిపత్య పీడక కులాలకు అనుకూలమైనది, మెజారిటీగా 90 శాతంగా వున్న పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ప్రజలకు వ్యతిరేకమైనది. భారత రాజ్యం 27 శాతంగా వున్న దళితులను అంటరానివారుగా అణగదొక్కుతున్నది. ప్రతిఘాతక 'జాతీయ సమైక్యత'కు, జాతుల అణచివేతకూ, మహిళల పట్ల పితృస్వామిక దృక్పథానికీ, మత మైనారిటీలపై ముఖ్యంగా ముస్లింలపై, దళితులపై, ఆదివాసులపై ఆధిపత్యానికీ, ద్వేషానికీ, వివక్షకూ బ్రాహణవాద భారతదేశ రాజ్యమే మూలం. పీడిత ప్రజల నుంచి మిగులును హస్తగతం చేసుకుని సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకు పంపిణీ చేస్తుంది. ఇందుకు వారసత్వంగా లభించిన ఆయుధంగా కులం వారికి తోడ్పడుతుంది. వారు దేశ వనరులను నిరంతరాయంగా, నిరాటంకంగా దోచుకునేందుకు మార్గాన్ని సుగమం చేస్తుంది. మిగులు పంపిణీ వారి మధ్య అనివార్యంగా ఏర్పడే వైరుధ్యాలను పరిష్కరించే సాధనంగా కూడా అది పని చేస్తుంది.

ఇలాంటి భారతదేశ రాజ్యం అండదండలను, ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నిర్మించిన రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు తదితర మౌలిక సదుపాయాల వ్యవస్థలను, గనులను, పరిశ్రమలను, భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గం క్రమంగా బలపడింది. ఈ పునాది ప్రపంచంలోని అత్యధిక వెనుకబడిన దేశాలలోని దళారీ బూర్జువా వర్గం కన్నా శక్తివంతంగా ఎదగడానికి దానికి తోడ్పడింది. అది పెద్ద మొత్తాలలో ప్రత్యక్ష పెట్టుబడి, రుణ పెట్టుబడుల దిగుమతి కోసం సామ్రాజ్యవాదులకు ప్రాథమికంగా స్థానిక మధ్యవర్తిగా తయారైంది. అది దేశాన్ని వివిధ సామ్రాజ్యవాద దేశాల గుత్త సంస్థల దోపిడీ క్షేత్రంగా మార్చివేసింది. అలాగే సామ్రాజ్యవాద శక్తుల మధ్య వైరుధ్యాలను వాడుకుంటూ తమ స్వప్రయోజనాలను కూడా ఈడేర్చుకుంటున్నది.

అధికార మార్పిడి తర్వాత టాటాలు స్టీల్, ఆటోమొబైల్స్, పవర్, టెలికాం, రసాయనాలు, ఇంజినీరింగ్, టీ, వాచీలు, హోటల్స్ రంగాలలో మదుపులతో నంబర్ 1 కంగ్లామరేట్‌గా ఆవిర్భవించారు. గోద్రెజ్‌లు, వాడియాలు తమ పరిశ్రమలను విస్తరించారు. పార్సీల జనాభా తగ్గడం, వారి పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరించలేకపోవడం వలన కొందరు పాత, కొత్త పారిశ్రామికవేత్తల ప్రాధాన్యత తగ్గింది. అలాగే భాటియాల శక్తి సామర్థ్యాలు కూడా తగ్గిపోయాయి. లొహానాలకు తిండి సరుకుల వర్తకంలో బలమైన పునాది ఉన్నప్పటికీ విదేశీ వర్తకంలో పోటీ పడలేకపోయారు. చెట్టియార్లు ఒకప్పుడు మార్వాడీలతో సరితూగినప్పటికీ ఆగ్నేయాసియాలో వారి పెట్టుబడులు దెబ్బతినిపోవడంతో, కొన్ని చెట్టియార్ సంస్థలు మాత్రమే నిలదొక్కుకున్నాయి.

మార్వాడీలు, గుజరాతీ బనియాలు/జైనులు, సింధీలు అత్యంత బలమైన శక్తులుగా కొనసాగారు. మార్వాడీలు, నాన్–గుజరాతీ బనియాల విషయానికి వస్తే బిర్లాలు, టాటాల తర్వాత శక్తివంతమైనవారుగా వికోస్ ఫైబర్, అల్యూమినియం, రాగి, సిమెంటు, కార్బన్ బ్లాక్, ఇన్సులేటర్లు,

దుస్తులు, రసాయన ఎరువులు, టెక్స్‌టైల్స్, టైర్లు, టెలికాం, బీమా, పామ్ ఆయిల్ రిఫైనరీ, కలప గుజ్జు, చక్కెర, మీడియా, రైలు వాగన్ల తయారీ, కార్లు, ఆటోమొబైల్స్, పేపర్, ఆస్‌బెస్టాస్ రేకులు, ఇతర బిల్డింగ్ మెటీరియల్, కేబుల్స్ రంగాలలో దేశంలోనే కాకుండా వివిధ దేశాలలో విశాల దళారీ కార్పొరేట్ సామ్రాజ్యంగా అభివృద్ధి చెందారు. మిగతా ప్రముఖ పాత వ్యాపార కుటుంబాలు – శ్రీరాంలు, సింఘానియాలు, గోయెంకాలు, బజాజ్‌లు, బంగుర్‌లు, మోడీలు, దాల్మియాల దళారీ కార్పొరేట్ కంపెనీలు విభజనలకు గురయ్యాయి. విభజనకు గురయిన కంపెనీలు కొన్ని తిరిగి పూర్తి స్థాయిలో కొనసాగాయి. బంగుర్‌లు జనపనార రంగంలో నాలుగవ స్థానంలోనూ, ఇతర రంగాలలోనూ ఉన్నారు. కొన్ని మినహా మిగతా కంపెనీలు క్రమంగా దెబ్బతిన్నాయి.

ఇక గుజరాతీ బనియా/జైనులలో సారాభాయిలు పోయి, లాల్‌భాయిలు మాత్రమే కొనసాగుతున్నప్పటికీ, వీరిని మించిన బడా కంగ్లామరేట్లుగా రిలయెన్స్, టొరెంట్, అదానీలు ముందుకు వచ్చారు. రిలయెన్స్ అంబానీలు టెక్స్‌టైల్స్, చమురు శుద్ధి కర్మాగారం, చమురు–సహజవాయువు ఉత్పత్తి, అన్వేషణ, పెట్రో రసాయనాలు, పవర్, టెలికమ్యూనికేషన్స్ రంగాలలో బడా దళారీ కార్పొరేట్ సంస్థగా అవతరించారు. టొరంట్ కంపెనీ ఫార్మాస్యుటికల్స్, పవర్ రంగాలలో అభివృద్ధి చెందింది. అదానీలు టెక్స్‌టైల్స్ వ్యాపారం, వ్యవసాయోత్పత్తులు, వంటనూనె, బొగ్గు, రసాయనిక ఎరువులు, స్టీల్ చెత్త, పెట్రో రసాయనాల వ్యాపారంలో బడా వ్యాపారులుగా, ముంద్రా ఓడరేవు అధిపతిగా ముందుకు వచ్చారు. గుజరాతీ జైనులు వజ్రాల ప్రాసెసింగ్ వ్యాపారంలో ప్రపంచ స్థాయిలో గుత్తాధిపతులుగా వున్నారు. ఇలా మరి కొందరు వివిధ రంగాలలో దళారీ నిరంకుశ పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందారు.

సింధీలలో హిందూజాలు నాన్–రెసిడెంట్ ఇండియన్లుగా మారి లండన్‌లో స్థిరపడి బిలియనీర్లుగా అవతరించారు. మరి కొందరు సింధీలు విదేశాలలో పారిశ్రామికవేత్తలుగా కొనసాగుతుండగా, దేశంలో పలువురు సింధీలు కొత్త పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చారు. అయితే మార్వాడీలలో, హిందీ ప్రాంతాలలోని ఇతర బనియాలలో, గుజరాతీ బనియాలు/జైనులు, సింధీలలో కొందరు దెబ్బతినిపోయినా, కొన్ని కుటుంబాలు వేరుబడి వారి పరిశ్రమలు కూడా విడిపోయినా, తిరిగి ఒక తరం తర్వాత మరొక తరంగా తమ సంస్థలను పునరుజ్జీవింపజేయడం, అనేక కొత్త సంస్థలను స్థాపించడం అనే విశిష్ట లక్షణం వున్నది. పార్సీలు, చెట్టియార్లలో ఈ లక్షణం అంతగా కనపడదు. అధికార మార్పిడి తర్వాత 1960లు, 1970లలో అనేక నాన్–గుజరాతీ/మార్వాడీ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఇందులో జిందల్‌లు, రుయియాలు, దూత్‌లు, షాహ్‌రాలు, సేక్‌సారియాలు, నియోటియాలు చెప్పుకోదగినవారు. వీరితో పాటు అన్సల్‌లు, బన్సల్‌లు, బిందల్‌లు, బజోరియాలు, భోరుకాలు, భువాల్కాలు, ధనుకాలు, గర్గ్‌లు, హిమట్‌సింగ్‌కాలు, జజోడియాలు, జలన్‌లు, జైపురీలు, కాబ్రాలు, కజరియాలు, కెదియాలు, ఖైతాన్‌లు, ఖెమ్‌కాలు, మహేశ్వరీలు, మనక్‌సియాలు, మొహనాట్‌లు, మొరార్కాలు, పరశ్‌రాంపురియాలు, పటోడీలు, పిత్తిలు, పొద్దార్లు, రంకాలు, గుంగ్‌టాలు, సంగనెరియాలు, సింఘీలు, సేథియాలు, సోమనీలు, సూరనాలు, టాయల్‌లు దేశంలోని

వివిధ నూతన కేంద్రాలలో అభివృద్ధి చెందారు.

భారతదేశ వ్యాపారస్థుడు ఆధునిక భాషను మాట్లాడుతాడు కానీ అతడి ఆలోచనలో, ఆచరణలో మధ్యయుగాల నాటి భావాలను కలిగి వుంటాడు. అతను తాను స్థాపించిన వ్యాపారాన్ని తన వారసులు తప్ప ఇతరులు దానిని అదుపు చేసి అభివృద్ధి చేస్తారని ఆలోచించలేడు. భారతదేశ బడా బూర్జువా వర్గ దృక్పథం బ్రాహ్మణవాదంతో నిండి వుంది. అందుకే వీళ్లు హిందుస్థాన్‌ను ఒక హిందూరాజ్యంగానూ, హిందూమతాన్ని ప్రభుత్వ మతంగానూ గుర్తించాలని కోరుకుంటారు.

1980లలో దేశంలోని 11 వ్యాపార కుటుంబాలు పరిశ్రమ రంగాన్ని అదుపు చేస్తుండినప్పటికీ, అందులో తమ స్వంత పెట్టుబడి కేవలం 148 కోట్ల రూపాయలు మాత్రమే ఉండగా, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు 27,000 కోట్ల రూ.లు పెట్టుబడి పెట్టాయి. ఆ 11 కుటుంబాలు ఆ పెట్టుబడి నుండి వచ్చే ఆర్థిక లాభాలలో పెద్ద భాగాన్ని తమ స్వంత ప్రయోజనాల కోసం, 25,000 కోట్ల రూ. నల్లధనాన్ని విదేశీ బ్యాంకులకు మళ్లించాయి. భారత బనియాలకు (వ్యాపారస్థులకు) సాంకేతిక ఆవిష్కరణల పట్ల అభిరుచి కానీ, ఉత్పత్తి క్రమంలో ఆసక్తి కానీ లేవనడానికి ఇది నిదర్శనం.

సామ్రాజ్యవాదంతో మిలాఖతైన భారతదేశ దళారీ బడా బూర్జువా వర్గానికి దేశంలోని పారిశ్రామిక రంగంపై గుత్తాధిపత్యం ఉండడంతో పాటు స్వయంగా వేలాది ఎకరాల భూములను కలిగి వుండి భూస్వామ్య వర్గంగా కూడా వుంది. వారిలో చాలా మంది వడ్డీ వ్యాపారులుగా కూడా ఉన్నారు. ఈ కారణం చేత ఈ వర్గం ఎల్లప్పుడూ మౌలిక భూ సంస్కరణలను, వాటి అమలును వ్యతిరేకించింది. అందువల్లనే భూపరిమితి చట్టాలను దళారీ ప్రభుత్వాలు సరిగా అమలు చేయలేదు. దీనితో పాటు పెరుగుతున్న ఆదాయ అసమానతలు, మూకుమ్మడి పేదరికం, వ్యవసాయ రంగం క్షీణతల కారణంగా తయారీ రంగ వినియోగ సరుకుల మార్కెట్ ప్రధానంగా భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజంలో పై వర్గాలకు మాత్రమే పరిమితం అయిపోయింది.

బొంబాయి ప్లాన్‌కు అనుగుణంగా పంచవర్ష ప్రణాళికల పేరుతో, 1948–55 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెట్లలో భాగంగా భారతదేశంలో ప్రధానంగా అమెరికా తదితర సామ్రాజ్యవాద గుత్త సంస్థల ఆధిపత్యంలోని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకులు పెట్టుబడులు పెట్టాయి. వ్యవసాయాన్ని మెరుగుపర్చడం, ఉన్నత విద్య, వైద్య ప్రమాణాలు, ఖనిజాభివృద్ధి, ఆనకట్టలు, విద్యుత్తు ప్రాజెక్టులు, ప్రజా వినియోగ వసతులు, రోడ్లు మొదలైనవి నిర్మించేందుకు పునాది స్థాయిలో ఆర్థిక వనరులు కల్పించడం ఈ పెట్టుబడుల లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆనాడు సామ్రాజ్యవాదుల కెనీసియన్ విధానాలపై ఆధారపడి వార్షిక బడ్జెట్లలో భారీగా డెఫిసిట్ ఫైనాన్సింగ్‌లకు పాల్పడ్డారు. కార్పొరేట్ పన్నులో రాయితీలు కల్పించడం, పెద్దెత్తున రుణాలు అందించడం, మొండి బకాయిల మాఫీ, కారుచౌకగా సహజ వనరులను కట్టబెట్టడంతో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కార్పొరేట్ పరిశ్రమలు వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దోచుకున్నాయి. 1951 పారిశ్రామిక నియంత్రణ చట్టం ప్రకారం ఉక్కు, మైనింగ్, పెట్టుబడి సరుకులు (కాపిటల్ గుడ్స్), వంటి వివిధ ప్రభుత్వ రంగ పరిశ్రమలను,

నీరు, రవాణా, కమ్యూనికేషన్, బీమా, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో లక్ష్యం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కార్పొరేట్ కంపెనీలకు అన్ని విధాలా సదుపాయాలు కల్పించడమే తప్ప దేశాన్ని పారిశ్రామికం చేయడం కాదు. కొంతమేరకు పారిశ్రామికీకరణ జరిగినప్పటికీ అది అర్ధభూస్వామ్య పునాదిపైననే, సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల ప్రయోజనాల కోసమే జరగడం వల్ల ఆ అభివృద్ధి అంతా వికృతంగా, తలకిందులుగా జరిగింది. ఈ రుణాధారిత అభివృద్ధి విధానం దేశాన్ని పరాధీనంగా మార్చివేసాయి. ఈ విధంగా సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాపై ఆధారపడడం దేశీయ పరిశ్రమల అభివృద్ధికి అవరోధంగా మారింది. ఫలితంగా వ్యవసాయ రంగంలో అదనపు శ్రమశక్తి అధిక భారంగా మారింది, అదనంగా గ్రామీణ పేదలను సృష్టించింది. దీంతో మార్కెట్ మరింతగా కుంచించుకుపోయింది.

రాజులు, భూస్వాములు మిగులును కాజేసేందుకు అమలు చేస్తూ వచ్చిన పాత కుల-భూస్వామ్య దోపిడీ పద్ధతులు అధికార మార్పిడి తర్వాత క్రమంగా పరివర్తన చెందుతూ వచ్చాయి. దళారీ నిరంకుశ పెట్టుబడి ఆవిర్భవించడంతో, ఇది నేరుగా పరిశ్రమల, రైల్వేల, ప్లాంటేషన్ల స్థాపనలో ప్రత్యక్షంగా భాగమైంది. యావత్తు దళారీ దోపిడీ పాలకవర్గ పార్టీలు, రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలు వెట్టిచాకిరిపై ఆధారపడిన ప్లాంటేషన్ ఆర్థిక వ్యవస్థను దేశవ్యాప్తంగా నిస్సిగ్గుగా ప్రోత్సహించడంలో క్రియాశీల పాత్ర పోషించాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని రబ్బర్ బోర్డ్ ద్వారా రబ్బర్‌కు ఎక్కువ ప్రాముఖ్యత లభించింది. గ్రామీణ ప్రాంతాలలో కాంట్రాక్టర్లు, లిక్కర్ మాఫియాలు, గనుల మాఫియాలు, రియల్ ఎస్టేట్ మాఫియాలు మొదలైనవారి ఆవిర్భావంతో దళారీ పెట్టుబడులతో ముడిపడిన నూతన భూస్వామ్య వర్గం రూపుదిద్దుకోవడం మొదలైంది. ఇలాంటి మార్పుల ద్వారా కుల-భూస్వామ్యం సామ్రాజ్యవాదానికి మరింత బలమైన సామాజిక పునాదిగా మార్చబడింది. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం మరింత అభివృద్ధి చెందింది.

1958లో ప్రభుత్వ ద్రవ్య నిల్వలు (బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) క్షీణించడంతో అమెరికా సామ్రాజ్యవాదం రంగంలోకి వచ్చింది. దళారీ పాలకవర్గాలు అమెరికా వైపు మొగ్గు చూపించాయి. అమెరికా పెట్టుబడులు వేగంగా పెరిగాయి. 1957-61 మధ్య భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపు నూతన పెట్టుబడుల రూపంలో, వారితో కుమ్మక్కుల (కొలాబరేషన్ల) రూపంలో ఎఫ్‌డీఐ వచ్చింది. ఇలా యేటేటా ఈ కుమ్మక్కులు పెరిగిపోయాయి. ప్రభుత్వ లోటు బడ్జెట్ విధానం ఫలితంగా వాణిజ్యలోటు పెరుగుతూ వచ్చింది. ఫలితంగా ఐఎంఎఫ్ నుంచి అప్పులు తేవడం పెరిగింది. 1962లో చైనాతో యుద్ధం, తీవ్ర కరువు, లోటు బడ్జెట్లు (డెఫిసిట్ బడ్జెటింగ్), పెద్దెత్తున పెరిగిన ద్రవ్యోల్బణం కారణంగా భారత ప్రభుత్వం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో అప్పులు తెచ్చింది. అవి విధించిన షరతులను ఆమోదించిన ఫలితంగానే రూపాయి విలువ 1947లో ఒక డాలర్‌కి ఒక రూపాయిగా ఉండగా మొట్టమొదటిసారిగా 1966 జూన్‌లో ఒక డాలర్‌కు 7.5 రూ.లుగా తగ్గించారు. మన దేశ ఎగుమతులు చౌకగా మారిపోయాయి.

సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి 1969లో సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారిన తర్వాత 1970లలో పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడి, 'సోవియట్ యూనియన్' సోషల్ సామ్రాజ్యవాద పెట్టుబడి భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం కోసం పోటీ పడ్డాయి. 1970ల ప్రారంభంలో జరిగిన సోవియట్ రష్యా, భారత వ్యూహాత్మక రక్షణ ఒప్పందం ద్వారా భారతదేశ పాలకవర్గాలు అమెరికా అగ్రరాజ్యం నుండి సోవియట్ రష్యా అగ్రరాజ్యం వైపు మొగ్గు చూపాయి. పరిమాణంలో కాకపోయినా అదుపు చేయడంలో 'సోవియట్ యూనియన్' పైచేయి సాధించింది. భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికి పశ్చిమ దేశాలతో మరింతగా బేరసారాలాడే అవకాశం వచ్చింది.

585 సంస్థానాలకు (ప్రిన్స్‌లీ స్టేట్స్‌కు) చెందిన రాజులకు ఏడాదికి 5 కోట్ల రూపాయల చొప్పున ఇస్తూ వస్తున్న రాసి (ప్రైవీ పర్స్) కారణంగా జీడీపీలో ఒక పెద్ద భాగాన్ని పక్కన పెట్టవలసి రావడంతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర చెడు ప్రభావం పడుతూ ఉండింది. ఈ రాశి చెల్లింపులు నిలిపివేయడంతో భూస్వామ్య వర్గం మొదటి దాడికి గురి అయింది. ఆ తర్వాత బ్యాంకులు, బొగ్గు, చమురు, భారీ పరిశ్రమల వంటి వాటిని జాతీయీకరించారు. దీంతో పాలకవర్గాలలో వివిధ ఫాక్షన్‌ల మధ్య ఘర్షణ తీవ్రతరమైంది. ఆనాడు గ్రామీణ ప్రజానీకంలో నెలకొని వున్న తీవ్ర అసంతృప్తి, 1967 నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు ఇందులో ప్రధాన పాత్ర పోషించాయి. రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ ద్వారా బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాల కూటమిలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం నాయకత్వంలోకి (లీడింగ్ రోల్) రావడం ఆరంభమైంది. ప్రభుత్వ రంగం భారీగా పెరిగింది. కోశాగారం నుంచి ఇంకా ఇంకా నిధులు కేటాయించారు, ప్రభుత్వ రంగం వ్యాపారంలోకి దిగింది. బ్యాంకులు, బీమా, చమురు, బొగ్గు, భారీ పరిశ్రమల వంటి వాటి జాతీయకరణా, పారిశ్రామిక రంగపు పునర్వ్యవస్థీకరణా, వస్త్రాల నుంచి హోటళ్ల వరకు యావత్తు ఉత్పత్తి రంగాలలోకీ ప్రభుత్వ రంగ ప్రవేశంతో కోశాగారం నుంచి (అంటే ప్రజలపై పరోక్ష పన్నులు వేయటంతో వచ్చిన డబ్బు) వచ్చిన డబ్బుతో భారీ మొత్తం తయారయింది. దళారీ గుత్త పెట్టుబడి ప్రభుత్వ పెట్టుబడితో కలగలిసిపోవడం, భూస్వాములతో కుమ్మక్కయిన, సామ్రాజ్యవాదానికి విధేయమైన దళారీ నిరంకుశాధికార పెట్టుబడి మరింత అభివృద్ధి చెందింది. ప్రభుత్వ రంగమూ, రాజ్య యంత్రాంగంతో పాటు దళారీ నిరంకుశ బూర్జువా వర్గం అసాధారణమైన రీతిలో వేగంగా వృద్ధి చెందాయి.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ, పీడనలతో 1960ల చివర్లో ఆర్థిక, రాజకీయ సంక్షోభం, దీన్ని వెన్నంటి 1974లో మరో సంక్షోభం దేశాన్ని కుదిపివేసింది. రాజకీయ వాతావరణాన్ని అస్థిరపరచింది. మరో వైపు మహారాష్ట్రలో దళిత్ పాంథర్, గుజరాత్‌లో నవ్ నిర్మాణ్, బిహార్‌లో జయప్రకాశ్ నారాయణ (జేపీ) ఉద్యమం నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు తాత్కాలిక వెనుకంజను వెన్నంటే జరిగాయి. 1975 జూన్ 26న అత్యవసర పరిస్థితిని విధించారు. దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి ఇది మంచి అనుకూలతను కల్పించింది.

ఉదాహరణకు 1966-67లో బిర్లాల వద్ద 447 కోట్ల రూపాయల ఆస్తులు, టాటాల వద్ద 521 కోట్ల రూపాయల ఆస్తులూ ఉంటే, 1975-76 నాటికి బిర్లాల ఆస్తులు 1085 కోట్ల రూపాయలకు, టాటాలవి 975 కోట్లకు పెరిగాయి. ఇలా ఈ వర్గం పాలకవర్గాల కూటమిలోని తన ఆధిపత్య స్థానాన్ని భూస్వామ్య వర్గాలతో పోలిస్తే మరింత సంఘటితపరచుకుంది. ఈ వృద్ధి కారణంగా అధికారులలో (బ్యూరాక్రాట్స్) ఉన్నత శ్రేణికి చెందిన ఒక చిన్న సెక్షన్, పాలకవర్గంలో శక్తివంతులైన రాజకీయవేత్తలు కోట్లాది రూపాయలు ఆర్జించారు. మరో వైపు వీరు వివిధ పద్ధతుల్లో ప్రభుత్వ నిధులు స్వాహా చేయడం ద్వారా అదనంగా మరిన్ని కోట్లు కూడబెట్టారు. ఈ పరాన్నభుక్కు సెక్షన్లు దళారీ నిరంకుశాధికార బూర్జువావర్గంలో భాగమే. దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ, సామ్రాజ్యవాదానికి ప్రత్యక్షం ఊడిగం చేసేవారూ, సామ్రాజ్యవాదం భారతదేశ ప్రజలపై సాగించే దోపిడీకి సమంజసత్వాన్ని ఆపాదించే వందిమాగధులు (మేధావులు, ఉన్నత స్థాయి ప్రొఫెషనల్స్) సైతం ఈ వర్గానికి చెందినవారే అవుతారు.

1960ల మధ్య నాటి హరిత విప్లవ కాలం నుంచే దళారీ ప్రభుత్వాలు నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానపు అవసరాలకు, సామ్రాజ్యవాదపు అవసరాలకు సరిపడే విధంగా వ్యవసాయ రంగాన్ని మలచనారంభించాయి. మారుతున్న పరిస్థితులలో భూస్వామ్య ప్రభువులు గతంలో మాదిరిగా తమ దోపిడీని, ఆధిపత్యాన్ని కొనసాగించలేకపోయారు. ఈ స్థితిలో అత్యధిక దోపిడీ, గ్రామీణ ఆధిపత్యం, నియంత్రణల కోసం వారికి వ్యాపారాలు, ఇతర ఆర్థిక వనరులూ చేకూరే అవకాశాలూ కల్పించి భూస్వామ్య శక్తులను సజీవంగా ఉంచారు. ఉదాహరణకు, సహకార చక్కెర మిల్లులు ఒక వైపు ఆస్తుల, ఉత్పత్తి టెక్నిక్‌ల విషయంలో ఆధునికంగా ఉండడం, మరోవైపు అత్యంత కాలం చెల్లిన, అభివృద్ధి నిరోధక దోపిడీ రూపాలపై ఆధారపడి వుండడం. ఈ వర్గానికి గల ద్వంద్వ స్వభావం వల్ల అంటే దోపిడీ రూపంలో మార్పు ఉన్నప్పటికీ (వేతన శ్రమ) ఉత్పత్తిని నూతన రూపాలలో (సహకార సంఘాలు మొదలైనవి) నిర్వహిస్తున్నప్పటికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి సాధనాలు (గొట్టపు బావులు, వివిధ వ్యవసాయ ఉపకరణాలు, ట్రాక్టర్లు, థ్రెషర్లు, హార్వెస్టర్లు), రసాయనిక ఎరువులు, పురుగు మందులూ, టెక్నిక్‌లు విస్తరించినప్పటికీ ఈ నూతన వ్యవసాయ సంబంధాలు భూస్వామ్య నిర్మూలనకు లేదా ఉత్పత్తి శక్తుల విముక్తికి దారితీయలేదు. మార్కెట్ కల్పన, నిధుల కేటాయింపు యావత్తు నూతన వ్యవసాయ సంబంధాలూ-వ్యాపారమూ పాకేజ్‌లపై ఆధారపడి అమలవుతూ వచ్చాయి. ఇవి సామ్రాజ్యవాదుల, సీబీబీ ప్రయోజనాలను నెరవేర్చడమే కాకుండా, వారికి అనుగుణంగా నూతన గ్రామీణ భూస్వామ్య శక్తులను అభివృద్ధి చేసి, వారి ప్రయోజనాలను నెరవేర్చడానికి కూడా తోడ్పడ్డాయి.

భారతదేశంలో ఉత్పాదక పెట్టుబడి కంటే అనుత్పాదక పెట్టుబడి చాలా ఎక్కువ. యంత్రాలు, యంత్ర పరికరాలు, ఇనుమేతర లోహాలు, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, మోటారు వాహనాలు - ట్రాక్టర్లు, ప్రైమ్ మూవర్లు (శక్తివంతమైన ట్రక్కులు), భారీ రసాయనాలు మొదలైన మౌలిక పరిశ్రమలు ఇక్కడ ఉనికిలో లేవు లేదా ప్రారంభ దశలో వున్నాయి. అందుకే 1975లో భారత ప్రభుత్వం

ప్రకటన ఇలా ఉంది, "భారతదేశం ఇప్పటికీ ప్రధానంగా గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమ దేశంగానే మిగిలింది". ఈ రకమైన ఉత్పత్తి విధానాన్ని చూపుతూ భారత దళారీ పాలకవర్గాలు దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఢంకా భజాయిస్తున్నాయి. వాస్తవానికి ఇది సామ్రాజ్యవాద నయావలసవాద దోపిడిలో భాగంగా వున్న అర్ధవలస ఆర్థిక విధానమే తప్ప స్వతంత్ర పెట్టుబడిదారీ విధానం కాదు. ఇందులో విదేశీ ప్రైవేట్ పెట్టుబడి, విదేశీ రుణ పెట్టుబడి, భారతదేశ దళారీ పెట్టుబడి, ప్రభుత్వ పెట్టుబడి అనే ఈ నాలుగు రకాల పెట్టుబడులు ముందెన్నడూ లేనివిధంగా పెనవేసుకొనిపోయాయి. ఏ పెద్ద భారతదేశ పరిశ్రమను తీసుకున్నా అవి సమ్మిళితమై వున్నాయి.

1970ల నుంచి అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాద దేశాలు నయా ఉదారవాద విధానాల పేరుతో విచ్చలవిడి దోపిడీ విధానాలను రంగం మీదికి తెచ్చి వెనుకబడిన దేశాలపై రుద్దడంతో మన దేశ ఆర్థిక వ్యవస్థను ఉదారీకరించడం (వ్యవస్థాగత సర్దుబాట్లు చేయడం) మొదలైంది. బహుళజాతి కంపెనీల సరుకులతో దేశ మార్కెట్లు నిండిపోయాయి. ప్రైవేట్ వ్యాపారాన్ని లాభదాయకంగా మార్చడానికి సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలకు, దేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. ఉపాధి పరిశ్రమల్లో సంఘటితరంగం నుంచి అసంఘటిత రంగానికీ, వ్యవసాయం నుంచి వ్యవసాయ అనుబంధ రంగాలకూ మారుతూ వచ్చింది. పరిశ్రమల మూసివేత పెరిగింది. ఫలితంగా పారిశ్రామిక, వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు, సర్వీసు రంగం, వాణిజ్యం, సామ్రాజ్యవాద మదుపులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, రాయల్టీలు, గుత్తాధిపత్య ధరలు, మేధోవలస, ఇంకా అనేక ఇతర మార్గాల ద్వారా భారతదేశం నుండి సామ్రాజ్యవాద దేశాలకు అపారమైన సంపద తరలిపోతుండడంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ తూర్పు, ఆగ్నేయాసియాల కంటే, పొరుగు దేశాల కంటే వెనకబడింది.

1990 అగస్టు గల్ఫ్ యుద్ధ కాలంలో చమురు ధరలు ఆకాశాన్ని అంటాయి; ద్రవ్య లోటు మరింత తీవ్రతరమైంది; ద్రవ్యోల్బణం అడ్డూ-ఆపూ లేకుండా పెరిగిపోయింది. విదేశీ అప్పు 1,32,000 కోట్ల రూపాయలకు చేరుకుంది. అత్యవసరమైన నిధులను సమీకరించుకోకపోతే బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ (రుణాల చెల్లింపులు) సంక్షోభం బద్దలయ్యే స్థితి తలెత్తింది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు, దళారీ పాలకులు 67 టన్నుల బంగారాన్ని 1991 ఏప్రిల్‌లో అత్యంత రహస్యంగా లండన్‌కు తరలించి ఐఎంఎఫ్ షరతులకు లోబడి కుదువబెట్టారు. దీంతో 1991 నాటికి రూపాయి మరింత పతనమై ఒక డాలర్‌కు 24.58 రూ. అవడంతో రూ. 1,40,000 కోట్లుగా వున్న విదేశీ అప్పు ఏకంగా రూ. 2,10,000 కోట్లకు చేరుకుంది. దేశం రుణాల ఊబి (debt trap)లో కూరుకుపోయింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరింత పెరిగిపోయాయి. కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువావర్గంపై, మహిళలు, దళితులు, ఆదివాసులు, మతమైనారిటీలు వంటి పీడిత సెక్షన్లపై, కశ్మీర్, ఈశాన్య భారత జాతులపై సామ్రాజ్యవాదుల, దళారీ ప్రభుత్వాల దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష తీవ్రరూపం తీసుకున్నాయి.

1970ల చివర, 1980ల ఆరంభంలో పీడిత ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొని వున్న స్థితిని వినియోగించుకుని ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఆవిర్భవించి శక్తివంతంగా తయారయ్యాయి. ఇది భారతదేశ దళారీ పాలకవర్గాల 'ప్రతిష్టాత్మక హిందుత్వ' 'అఖిల భారత మార్కెట్' నిర్మాణానికి పెద్ద దెబ్బ. ఈ నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీలలో అత్యధికం పీడక కుల నూతన భూస్వామ్య-ధనిక రైతాంగ సెక్షన్‌ల నుంచి, ఆయా రాష్ట్రాల నుండి నూతనంగా అభివృద్ధి చెందుతున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల నుంచి ఆవిర్భవించాయి. ఇవి ప్రాంతీయ, ఇతర జాతిపరమైన గుర్తింపులలో సైతం కులంతో అంటకాగుతూ ఉన్నాయనేది వాస్తవం. ఇలా నూతనంగా ఆవిర్భవించిన ప్రాంతీయ దళారీ బూర్జువా వర్గం తన ఒకానొక వృద్ధి దశలో తమ జాతి ప్రతిష్టను వాడుకోవడం, ప్రాంతీయ రాజకీయ సంస్థలలో మదుపు పెట్టడం ప్రయోజనకరంగా ఉంటుందనే అవగాహనతో పథకాలు రూపొందించుకుని అమలు చేసింది. తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కజగం, అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, పంజాబ్‌లో అకాలీ దళ్, కర్నాటకలో జనతా దళ్, ఒడిశాలో బీజేడీ, చివరికి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్, పశ్చిమ బంగ్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ మొదలైన ప్రాంతీయ పార్టీలు, గుజరాత్‌లో కాంగ్రెస్ సైతం ఈ ధోరణిని వ్యక్తీకరించేవే. అలాగే వెనుకబడిన వ్యవసాయ కులాల నుంచి ఆవిర్భవించిన ఒక చిన్న సెక్షన్ ప్రాంతీయ దళారీ నిరంకుశ బూర్జువా వర్గంగా అభివృద్ధి చెందగా, దీనికి ప్రాతినిధ్యం వహించే సమాజ్‌వాదీ పార్టీ (యుపి), జనతా దళ్ (యు) (బిహార్) మొదలైనవి ముందుకు వచ్చి అభివృద్ధి చెందాయి. వీటిలో అనేకం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా వృద్ధి చెందాయి. వాటి నుంచి అందే కాంట్రాక్ట్‌లు, బినామీ నిధులపై ఆధారపడి ఉన్నాయి. తమ మనుగడ, వృద్ధి కోసం సినిమా రంగం నుంచి లేదా వివిధ రకాల మాఫియాల నుంచి, ఇతర వ్యాపారాల నుంచి, ఆయా రాష్ట్రాల నుండి నూతనంగా అభివృద్ధి చెందుతున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల నుంచి పెట్టుబడి సంచయనం చేసారు. పార్లమెంటులో మెజారిటీ సాధించేందుకు జరిగే బలపరీక్షలో వాళ్లు బేరాలాడసాగారు. తమ వాటా పొందసాగారు. 1990వ దశకం మధ్య కాలంలో, వారిలో కొందరు మరింత ముందుకు సాగారు. ఉదాహరణకు టీడీపీ చంద్రబాబు నాయుడు, బీజేడీ నవీన్ పట్నాయక్ మొదలైనవారు.

## 6. మూడవ దశ 1991 నుంచి 2024 వరకు:

ఇదే ప్రపంచీకరణ దశ. ఈ దశలో నిరర్థకంగా మారిన కెనీసియన్ సిద్ధాంతం స్థానంలో చికాగో స్కూల్‌లో రూపొందిన నయా ఉదారవాద సిద్ధాంతంగా ప్రాచుర్యం పొందిన మిల్టన్ ఫ్రీడ్‌మ్యాన్ మోనిటరిస్టు (ద్రవ్యవాద) సిద్ధాంతాన్ని ముందుకు తేవడంలో అమెరికా అధ్యక్షుడు రీగన్, బ్రిటన్ ప్రధానమంత్రి థాచర్ చాంపియన్లుగా నిలిచారు. ద్రవ్య పెట్టుబడిని సులభంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు 1980ల నాటికే అన్ని రకాల అడ్డంకులు తొలగించడం ఆరంభమైంది. విదేశీ పెట్టుబడి, ప్రత్యేకించి ద్రవ్య పెట్టుబడి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా మార్కెట్లను ముంచెత్తింది. అందుకే వెనుకబడిన దేశాలలో జాయింట్ వెంచర్‌లు 1991 తరువాత

మరింత వేగం పుంజుకున్నాయి. 'సోవియట్' అగ్రరాజ్యం పతనం తర్వాత అమెరికా అగ్రరాజ్యంతో భారతదేశ సంబంధాలు మరింత బలపడ్డాయి. భారతదేశం సైతం నయా ఉదారవాద విధానాల ఉచ్చులోకి ఈడ్చబడింది. డీరెగ్యులేషన్, డీలైసెన్సింగ్, డిసిన్వెస్ట్‌మెంట్, డీఇండస్ట్రియలైజేషన్ (డీ4) ఊతపదాలయ్యాయి. సమాజంలో సమస్త రుగ్మతలకూ నెహ్రూ రీతి సోషలిజమే మూల కారణమన్నారు. ప్రతి ఒక్కరూ నయా ఉదారవాద సంస్కరణల గురించి మాట్లాడసాగారు. 'సోవియట్ యూనియన్' కూలిపోవడంతో జాతీయ ప్రయోజన పరిరక్షణకు సంబంధించిన ఏ చిన్న అంశాన్నైనా వెనుకబడినదిగా, కాలం చెల్లినదిగా, విడిచిపెట్టి వేయవలసినదిగా భావించసాగారు. కార్పొరేట్ మీడియాలో గణనీయమైన సెక్షన్ ఇందులో నైపుణ్యం సంపాదించింది. ఈ దశలో సామ్రాజ్యవాదులు ప్రపంచవ్యాప్తంగా యావత్తు దేశాల ఆర్థిక వ్యవస్థలలో వ్యవస్థీకృత మార్పులు చేసారు. ఈ నయా ఉదారవాద విధానాలు నిజానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు తప్ప మరొకటి కాదు.

1970 దశాబ్దం ఆరంభంలో సంక్షోభం బద్దలు కావడంతో ముందుకు వచ్చిన "స్టాగ్‌ఫ్లేషన్" ఊబి నుంచి బయటపడేందుకు మహా శక్తివంతమైన (జాయంట్) అంతర్జాతీయ గుత్త సంస్థలు (ఎంఎన్‌సీ–టీఎన్‌సీలు) ఈ నయా ఉదారవాద విధానాలలో భాగంగా తమ సాంప్రదాయక పరిశ్రమలను విదేశాలకు తరలించాయి. నూతన తరహా అంతర్జాతీయ శ్రమ విభజనను ప్రవేశపెట్టాయి. ఒక సరుకు తయారీని ఒకటికి మించిన దేశాలలో తయారు చేయడం ద్వారా యావత్తు ప్రపంచాన్నీ తమ ఫ్యాక్టరీగా మార్చివేసాయి. ఒక్కొక్క సరుకు తయారీని అనేక భాగాలుగా విడగొట్టి, ఈ విడి భాగాలను వేర్వేరు దేశాలలో/ప్రాంతాలలో ఉత్పత్తి చేసి, చివరకు వాటిని ఒక చోటికి చేర్చి పూర్తి సరుకుగా అసెంబుల్ చేయడం (జోడించడం) అనే పద్ధతిని అవలంబించాయి. ఈ ప్రక్రియలో ఎక్కడ వనరులు, శ్రామికులు చౌకగా దొరుకుతారో, చట్టాలు అనుకూలంగా ఉ న్నాయో చూసుకొని ఆ ఉత్పాదక గొలుసు (ప్రొడక్షన్ చైన్)ను తయారు చేస్తాయి. ద్రవ్య పెట్టుబడి ఎప్పుడైనా, ఎక్కడికైనా సులభంగా ప్రవేశించి, సులభంగా ఉపసంహరించుకునే విధంగా ఒప్పందాలు చేసుకుంటాయి. దీర్ఘకాలిక స్వభావం కలిగిన మదుపులు పెట్టడానికి సిద్ధపడవు. ఈ విధంగా వేలాది ఎంఎన్‌సీలు–టీఎన్‌సీలు తమ ఉత్పత్తులకు అనుగుణంగా 'గ్లోబల్ వ్యాల్యూ చైన్' నెట్‌వర్క్‌లను తయారు చేసుకుని అత్యధిక దేశాలకు, ప్రాంతాలకు విస్తరింపజేసాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో తమ స్వంత శాఖలను, అనుబంధ కంపెనీలను ఏర్పరచుకున్నాయి. ప్రత్యేకించి వెనుకబడిన దేశాలలోని దళారీ కంపెనీలతో జాయింట్ వెంచర్లు ఏర్పరచుకున్నాయి లేదా ఆ కంపెనీలకు సబ్‌కాంట్రాక్టుకు ఇచ్చాయి. దళారీ కంపెనీలు ఎగుమతి చేయడానికే సరుకులను ఉత్పత్తి చేసేవి. ఈ విధానం కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీసింది. నూతన ఆర్థిక విధానాలలో ఇది చాలా ముఖ్యమైనది. 2017లో ప్రపంచంలోని అతిపెద్ద 100 నాన్‌ఫైనాన్షియల్ బహుళజాతి కంపెనీలు సగటున 60 శాతానికి పైగా తమకు చెందిన ఆస్తులను విదేశాలకు/వెనుకబడిన దేశాలకు తరలించాయి లేదా అమ్మకాలు కొనసాగించాయి. ఇందులో భాగంగానే అవి 21వ శతాబ్దం 2వ దశాబ్దంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆన్‌లైన్, అసెట్‌లైట్ మోడల్ గిగ్ ఎకానమీలో భాగమవుతున్నాయి. ఇది చాలా వరకూ తాత్కాలిక, పార్ట్‌టైం, కాంట్రాక్టు, ఫ్రీలాన్స్ విధానంపై

ఆధారపడినది.

ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ పారిశ్రామిక, ద్రవ్య కంపెనీలు, సంస్థలలో పెద్దెత్తున విలీనాలు, స్వాధీనాలు జరిగాయి. నూతన తరం ఇన్ఫర్మేషన్–కమ్యూనికేషన్స్ టెక్నాలజీల మద్దతుతో, ఇంటర్‌నెట్ ఆవిర్భావంతో క్రాస్–బోర్డర్ మెర్జర్లు, మదుపు, వ్యాపారంలో వెల్లువ వచ్చింది. ఇందులో పిడికెడు బహుళజాతి బ్యాంకులు ద్రవ్య పెట్టుబడి ద్వారా ప్రపంచ ఆర్థిక జీవితంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. పెట్టుబడి కేంద్రీకరణ, అంతర్జాతీయ ప్రత్యక్ష మదుపులు, ఉత్పత్తి–పంపిణీల సామాజీకరణ, అంతర్జాతీయీకరణ, వ్యాపార ప్రపంచీకరణ మునుపెన్నడూ లేనిస్థాయికి చేరి ప్రపంచవ్యాప్తంగా మహాశక్తివంతమైన (జాయంట్) బహుళజాతి గుత్త కార్పొరేషన్లు (ఎంఎన్‌సీలు) ఆవిర్భవించాయి. 2017 నాటికి ప్రపంచంలో అతిపెద్ద 737 ఎంఎన్‌సీలు యావత్తు ప్రపంచ ఉత్పత్తిలో 80 శాతాన్ని నియంత్రిస్తున్నాయి. ప్రపంచ వ్యాపారంలో 80 శాతం బహుళజాతి కంపెనీల ద్వారా కొనసాగుతున్నది. ఈ పరిణామాలను ముందే ఊహించిన కామ్రేడ్ లెనిన్ భవిష్యత్తులో అతి కొద్ది భారీ ద్రవ్య సంస్థలే ప్రపంచాన్ని శాసిస్తాయని అన్నారు.

జాయంట్ ఎంఎన్‌సీల సంపద సుమారు వాటి మొత్తం దేశాల సంపద ఎంతో అంత వుంటుంది. ఉదాహరణకు, 2017లో ఫార్చ్యున్ 500 జాబితాలో ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీగా స్థానాన్ని సంపాదించుకున్న వాల్‌మార్ట్ కంపెనీ మొత్తం 500 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని సంపాదించుకుంది. ఇది బెల్జియం జీడీపీ కంటే అధికం. 2020 నాటికి ప్రపంచంలోని 161 దేశాల కన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది. ఆపిల్ కార్పొరేషన్ మార్కెట్ విలువ (2.7 ట్రిలియన్ డాలర్లు) భారతదేశం స్థూల దేశీయోత్పత్తి (2.6 ట్రిలియన్ డాలర్లు) కంటే ఎక్కువ. ఎంఎన్‌సీల వార్షిక ఆదాయ గణాంకాలను, అదే సమయంలో ప్రపంచంలో మొత్తం దాదాపు 200 దేశాల ఆదాయాల గణాంకాలను పోల్చి చూస్తే ఎంఎన్‌సీలు 100 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో 70 శాతాన్ని మించిన ఆదాయాన్ని కలిగి ఉంటాయి. 2020 నాటికి మొత్తం కార్పొరేట్ సంపదలో 69 శాతం అమెరికాలోనే పోగయివుంది.

2017లో ప్రపంచంలోని అతిపెద్ద 500 కంపెనీలలో సగం కంపెనీలు (అంటే 250 కంపెనీలు) అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లలో ఉన్నాయి. 100 అతిపెద్ద బహుళజాతి సంస్థలలో సుమారు 2/3వ వంతు సంస్థలు ఈ దేశాలలోనే ఉన్నాయి. 2020 నాటికి ప్రపంచంలో 100 అతిపెద్ద కార్పొరేషన్లలో 59 అమెరికాలో ఉన్నాయి. పారిశ్రామిక ప్రపంచీకరణ ద్వారా ఆర్థిక కార్యకలాపాలు మరిన్ని భాగాలుగా విడగొట్టబడడంతో పెద్ద మొత్తాలలో లాభాలు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ప్రపంచంలోని కొద్ది దేశాలు మాత్రమే దక్కించుకుంటున్నాయి. 2017వ సంవత్సరంలో ఫార్చ్యున్ గ్లోబల్ 500 డాటా ప్రకారం ప్రపంచంలోని అతిపెద్ద 500 కంపెనీలలో (చైనా కంపెనీలు మినహా) 380 కంపెనీల ఆదాయాలు 22.83 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. లాభాల వాటా, లాభాల రేటు ఈ రెండింటి సూచికల వృద్ధి సామ్రాజ్యవాదం కొల్లగొట్టే స్వభావాన్ని చాటిచెబుతుంది.

ప్రస్తుతం మహాశక్తివంతమైన పిడికెడు ఎంఎన్‌సీలే అంతర్జాతీయంగా అనేక దేశాలను, వాటి ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. 2024 డిసెంబర్ నాటికి 835 మంది బిలియనీర్లతో అమెరికా అగ్రస్థానంలో, 427 మంది బిలియనీర్లతో చైనా 2వ స్థానంలో ఉన్నాయి. 208 బిలియన్ డాలర్ల సంపదతో మొదటి స్థానంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్, 205 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్ 2వ స్థానంలో, 199 బిలియన్ డాలర్లతో బెర్నార్డ్ ఆర్నాల్డ్ 3వ స్థానంలో నిలిచాడు. కాంటార్ బ్రాండ్జ్ రిపోర్టు ప్రకారం ప్రపంచ టాప్–100 బ్రాండ్లలో అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం, ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ (1,01,590 కోట్ల డాలర్లు) అగ్రస్థానంలో నిలవగా, గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెక్‌డొనాల్డ్స్ వరుసగా తరువాతి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఎంఎన్‌సీలు అమెరికన్ డాలర్, మేధో సంపత్తిపై గుత్తాధిపత్యం, అసమాన అంతర్జాతీయ శ్రమ విభజనల ద్వారా దేశాల భాగస్వామ్య విధానాన్ని, ఉత్పత్తి పద్ధతులను, లాభాల నమూనాలను విస్తృతంగా పునర్నిర్వచించాయి. నూతన కూటములను, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక–భావజాల, సైనిక రంగాలలో ఆధిపత్య సంబంధాలను స్థాపించాయి, ఆ రంగాలను కార్పొరేటీకరించాయి. సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక–భావజాల రంగాన్ని కార్పొరేటీకరించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో కార్పొరేటీకరణకు మార్గం సుగమం చేసాయి. పోటీపడే సామర్థ్యాన్ని విస్తరించుకున్నాయి. మార్కెటింగ్ నెట్‌వర్క్‌లను, సహజ వనరులను, ద్రవ్య వనరులను నియంత్రిస్తూ, సంపదను మరింతగా సంచయనం చేసుకుంటున్నాయి.

నయా ఉదారవాద భావాల వ్యాప్తికి సామ్రాజ్యవాద ఫౌండేషన్లు, థింక్ ట్యాంకులు ముఖ్యమైన చోదక శక్తులుగా పని చేసాయి. ఇందులో ముఖ్యంగా మిల్టన్ ఫ్రీడ్‌మన్, ఆర్నాల్డ్ హర్బెర్గర్ వంటి ఆర్థికవేత్తలు ముందు నిలిచారు. ఉదాహరణకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై సెమినార్లకు, విద్యా సంస్థలకు నిధులివ్వడం ద్వారా అమెరికాలోని ఫోర్డ్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, మోంట్ పెలెరిన్ సొసైటీ, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ ఎంటర్‌ప్రైజ్ వంటి సంస్థలు నయా ఉదారవాదం పేరుతో సామ్రాజ్యవాద విలువలను ప్రోత్సహిస్తున్నాయి. లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల నుండి వచ్చే ఆర్థికశాస్త్ర విద్యార్థులకు వాటిని నూరిపోసి వారిని “చికాగో బోయ్స్”గా తయారు చేస్తున్నాయి. వీరితోనే ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల గూఢచర్య, భద్రతా సంస్థలు, ఎంఎన్‌సీల డైరెక్టరేట్లు నిండి వున్నాయి. వీరే దేశాల ప్రధానమంత్రులుగా, ఆర్థిక మంత్రులుగా, ఆర్థికవేత్తలుగా, ప్రభుత్వ బ్యాంకు అధికార్లుగా, కార్పొరేట్ న్యాయవాదులుగా మారి ఎంఎన్‌సీలకు తలుపులు తెరిచారు. ఆ విధానాలను రుద్దుతున్నారు. మిల్టన్ ఫ్రీడ్‌మన్‌కు నోబల్ బహుమతి ఇచ్చిన తర్వాత ఈ నయా ఉదారవాద విధానాలకు మరింత బలం చేకూరింది. ఇలా ఫైనాన్స్ పెట్టుబడి రాజ్య యంత్రాంగాన్ని నియంత్రించసాగింది. రాజ్యం పెట్టుబడి చేతిలో సాధనమైంది. రాజ్యం ప్రజలపై, ముఖ్యంగా శ్రామిక జనాలపై ప్రత్యక్ష, పరోక్ష హింసను అమలు చేయడం ద్వారా పెట్టుబడికి మార్గం సుగమం చేసింది.

సామ్రాజ్యవాదం తమ అకడమిక్ జీవనంలోని ఉదారవాద సాహిత్యాన్ని, కళలను, విలువలను దేశంలోనూ, విదేశాలలోనూ ప్రధానంగా కార్పొరేట్ మీడియా మార్గాల ద్వారా, విద్య ద్వారా,

ప్రచార కార్యకలాపాల ద్వారా విస్తరింపజేయడం ద్వారా ప్రపంచంపై తన సాంస్కృతిక ఆధిపత్యాన్ని స్థాపించుకుంది. మాగ్జిమ్, వెర్వ్, వోగ్, కాస్మోపాలిటన్ వంటి పత్రికలు, హాలీవుడ్ సినిమాలు, తమ నియంత్రణలో వున్న దాదాపు 75 శాతం ప్రపంచ టెలివిజన్ కార్యక్రమాలు, సంగీతం, సాహిత్యం ద్వారా పాశ్చాత్య జీవనశైలి పట్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో భ్రమలు సృష్టించింది. అమెరికా ప్రధాన స్రవంతి మీడియా నిర్వహించే రీసర్చ్, రిపోర్టింగ్ ద్వారా ప్రపంచ ప్రజల అభిప్రాయాన్ని మలుచుకుంటున్నది. ఈ సామ్రాజ్యవాద భావజాల పునాదిపై ఆధారపడి వెనుకబడిన దేశాలలో నూతన ఉదారవాద విధానాలను అమలులోకి తెచ్చారు.

ఇందుకు అనుగుణంగా భారతదేశ ప్రజల అభిప్రాయాన్ని మలుచుకునే ఉద్దేశ్యంతో దేశంలోని అజీమ్ ప్రేమ్‌జీ, జిందల్, టాటా, రిలయెన్స్ వంటి దళారీ కార్పొరేట్ కంపెనీలు సైతం థింక్ ట్యాంక్‌లను ఏర్పరచాయి. స్కాలర్‌షిప్‌లు తదితర కార్యక్రమాల కోసం నిధులు మంజూరు చేయడం, కళా సాహిత్య ఉత్సవాలు నిర్వహించడం, 'థింక్ ఫెస్ట్‌లు', ఉద్వేగభరిత చర్చలు నిర్వహించడం, విద్యా-వైద్య సంస్థల నిర్వహణ, ప్రైజులు ఇవ్వడం ద్వారా ఈ థింక్ ట్యాంకులు నిరంతరం పాశ్చాత్య, ఆధునికానంతర తదితర కమ్యూనిస్టు వ్యతిరేక భావజాలాన్ని వ్యాపింపజేస్తూ పెట్టుబడిదారీ విధానంలో 'వైవిధ్యాన్ని' ఎత్తిపడుతున్నాయి. ఉదారీకరణ విధానాలకు కులం, జాతి, మతం లేదనీ, నిజమైన సామర్థ్యాన్ని గౌరవిస్తుందని ప్రచారం చేసాయి. నూతనంగా (చాలా చాలా తక్కువగా) ఆవిర్భవిస్తున్న దళిత బిలియనీర్లను చూపుతూ దీనినే 'దళితుల అభ్యున్నతి'గా చూపుతున్నాయి. మరోవైపు ఉదారీకరణ దుష్ప్రభావాలు ప్రజలకు అర్థం కాకుండా ఉండడానికి మతాల మధ్య, కులాల మధ్య, జాతుల మధ్య కొత్త కొత్త ఘర్షణలను సృష్టిస్తున్నాయి. బాబ్రీ మసీదు కూల్చివేత నుండి జ్ఞానవాపీ వరకు ఎన్నైనా ఉదాహరణలు ఇవ్వవచ్చు.

ప్రపంచీకరణ వ్యూహంలో భాగంగా సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి యావత్తు వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలను బుల్డోజింగ్ చేస్తూ పెనుదాడి ఆరంభించింది. భారతదేశ దళారీ పాలకవర్గాలు మొదటి నుంచి విదేశీ పెట్టుబడిపై ఆధారపడే విధానాలను అమలు చేస్తున్నప్పటికీ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థల షరతులకు లోబడి 1985 నుండి మరీ ముఖ్యంగా 1991 నుండి పెద్ద గెంతు వేసి ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలను బరితెగించి అమలు చేస్తూ వచ్చాయి. ఈ దశలో ముఖ్యంగా దళారీ నిరంకుశ బూర్జువావర్గం (సీబీబీ) తన స్థితిని అనేక రెట్లు బలోపేతం చేసుకుంది. ఇందుకోసం కాలంచెల్లిన భారతదేశ అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థను నిలిపి ఉంచుతున్నది. ప్రపంచ ద్రవ్య పెట్టుబడితో మరింతగా పెనవేసుకుపోతూ, తన ప్రయోజనాలను కూడా నెరవేర్చుకోవడానికి ఆయా దశల్లో అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థలో కొన్ని మార్పులు చేస్తున్నది. తమ దోపిడీ, పీడనలను కొనసాగించడానికి, పీడిత ప్రజలలో చీలికలు సృష్టించడానికి, కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలు, పీడిత సెక్షన్లు, పీడిత జాతులు సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా చేస్తున్న వాస్తవిక పోరాటాన్ని దెబ్బతీయడానికి కులాధారిత భూస్వామ్యాన్ని, కుల వ్యవస్థను పెంచి పోషిస్తూ, కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటూనే ఉన్నది.

దళారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలలో భాగంగా కొత్త ఆర్థిక విధానం, కొత్త పారిశ్రామిక విధానం, కొత్త వ్యవసాయ విధానం, కొత్త వ్యాపార విధానం, కొత్త బ్యాంకింగ్ విధానం, కొత్త జౌళి విధానం, కొత్త బొగ్గు విధానం, టూరిజం విధానం, ఐటీ విధానం, అనిమేషన్ విధానం, ఫార్మా విధానం, స్టార్టప్ విధానం - ఇలా ఒక్కో రంగానికీ ఒక్కో ప్రత్యేక విధానాన్ని తెచ్చాయి. పలు ద్రవ్య సంస్కరణలు వగైరాలను ప్రవేశపెట్టాయి. ఇందుకోసం వందలాది చట్టాలను సవరించాయి. జాతీయత పేరుతో జాతీయోన్మాదాన్ని, మతం పేరుతో హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ అధికారంలోకి వచ్చిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ప్రపంచీకరణ విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నది. సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి ఎర్రతివాచీలు పరుస్తున్నది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు పద్ధతులను దూకుడుగా అమలు చేస్తున్నది. ఎటువంటి ప్రజా ప్రతిఘటనను అయినా అణచివేసేందుకు భారతదేశ రాజ్యాంగాన్ని సైతం పక్కకు నెడుతూ, నామమాత్ర ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నది. పౌర ప్రజాతంత్ర హక్కులపై దాడి పెరిగింది. మోదీ ప్రభుత్వం పిడికెడు మందితో కూడిన నిరంకుశ రాజ్యాంగేతర వ్యవస్థను, ఏక వ్యక్తి పాలనను స్థాపించజూస్తోంది. ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, ఆర్‌బీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సీబీఐ వంటి సంస్థలను సీబీబీకి జేబు సంస్థలుగా మార్చివేస్తోంది. అన్ని రంగాలలో విదేశీ పెట్టుబడులను అనుమతించే లక్ష్యంతో నూటికి నూరు శాతం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయడం కోసం ప్లానింగ్ కమిషన్ రద్దు చేసి, దాని స్థానంలో నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా-NITI కమిషన్)ను స్థాపించింది. ఇప్పటికే పలు రంగాలలో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు దారులు వేసింది. ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెట్టింది.

ప్రపంచీకరణ కాలంలో ఎంఎన్‌సీలు భారతదేశంలో తమకు సూపర్ లాభాలు చేకూర్చే సర్వీసు రంగంలో తప్ప ఉత్పాదక రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టలేదు. అందువల్ల విదేశీ పెట్టుబడులు వచ్చిన రంగాలలో ఉత్పత్తి రంగం నాలుగవ స్థానంలో నిలిచింది. ఇందుకు అనుగుణంగానే దేశంలో సీబీబీ వ్యవహరించింది. ప్రపంచ బ్యాంకు ఎల్‌పీజీ విధానాలను అమలు చేసేందుకు రూపొందించిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్నే 'మేక్ ఇన్ ఇండియా' పథకంగా పెద్దెత్తున ప్రచారం చేసుకునే మోదీ 11 యేళ్ల పాలనలో సైతం ఉత్పాదక రంగం పెద్దగా అభివృద్ధి చెందలేదు. జీడీపీలో తయారీ రంగం వాటా కేవలం 17-18 శాతంగా ఉంది. ఒక వైపు ప్రధానంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిపై, ఎంఎన్‌సీల భారీ యంత్రాలపై సాంకేతికతపై ఆధారపడుతూ ఉత్పాదక రంగంలో దేశాన్ని స్వయంసమృద్ధిని సాధిస్తున్నామని 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ పెద్దయెత్తున సాగించే ప్రచారమంతా ఒట్టి బూటకమే. మేక్ ఇన్ ఇండియా పథకం కింద 2014-2023 మధ్య దేశంలోకి మొత్తం 900 బిలియన్ డాలర్లకు పైగా వచ్చిన ఎఫ్‌డీఐ మదుపులు తయారీ రంగంలో కాకుండా అనుత్పాదక రంగాలు, ఉద్యోగ భద్రతలేని విపరీతమైన శ్రమ దోపిడీకి గురిచేసే అసంఘటిత రంగంలో పెట్టడం వల్ల అవి ప్రాధాన్యతా రంగాలుగా మారిపోయాయి. రైల్వే, బీమా, రక్షణ, వైద్య పరికరాల తయారీలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా వచ్చాయి.

విదేశీ పెట్టుబడికి ఊడిగం చేసేందుకు 'ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్'ను ఏర్పాటు చేసారు. ఢిల్లీ–ముంబై, అమృత్‌సర్–కోల్‌కతా, చెన్నై–బెంగళూరు, వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్లు, బెంగళూరు–ముంబై ఆర్థిక కారిడార్ ను ఏర్పాటు చేసారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్మార్ట్ సిటీలు, అమతృకాల్, స్వచ్ఛభారత్ అభియాన్, సాగరమాల ఇలా అనేక పథకాలు సాధించింది సేవరంగ వృద్ధి తప్ప తయారీరంగ వృద్ధి కాదు. ఎఫ్‌డీఐలు, నాలుగు కార్మిక నల్లచట్టాలు, వ్యవసాయ రంగ నల్లచట్టాలు తదితర కార్పొరేట్ ప్రాయోజిత చట్టాలు దేశాన్ని దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు దోచుకోవడానికే తోడ్పడ్డాయి. ద్రవ్య పెట్టుబడి సహాయంతో, ద్రవ్య పెట్టుబడి కోసం, దాని అజమాయిషీలో యావత్తు రంగాలలో అమలు చేస్తున్న విధానాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి. దేశంలో దళారీ పాలకవర్గాలు అమలు చేసిన సామ్రాజ్యవాద విధ్వంసకర అభివృద్ధి నమూనాయే ఇందుకు కారణం.

ప్రపంచీకరణ విధానాల ఫలితంగా రాజ్య యంత్రాంగంలోని ఉన్నతాధికారుల సెక్షన్ సాధారణ ఉద్యోగులతో పోలిస్తే ఎన్నో రెట్లు అధిక వేతనాలు పొందడంతో పాటు తమ నిరంకుశాధికారాన్ని వినియోగించుకుని పలు హవాలా రూపాలలో పెద్దమొత్తంగా సంపదలను ఆర్జించింది. వీరితో పాటు వివిధ దళారీ కార్పొరేట్లలో, ఐటీ కంపెనీల్లో, ద్రవ్య సంస్థలలో, ప్రైవేటు బ్యాంకుల్లో సీఈఓలుగా, డైరెక్టర్లు, ఉన్నతాధికారులుగా పనిచేస్తూ ఒక సెక్షన్ కోట్లకు పడగలెత్తింది. ఈ సెక్షన్లు సీబీబీలో భాగమే. ప్రపంచీకరణ కాలంలో ఈ సెక్షన్లలో సైతం ఎన్నో ఎగుడుదిగుడులు ఉన్నప్పటికీ పెట్టుబడిదారీ పోటీలో ముందంజలో వుండే సెక్షన్లు అధిక లాభాలార్జించాయి.

ఈ కాలంలో భారతదేశం విదేశీ రుణాల ఊబిలో మరింతగా కూరుకుపోయింది. భారతదేశ అప్పులు 2023 డిసెంబర్ నాటికి ఒక కోటి 61 లక్షల కోట్ల రూ.లకు పెరిగిపోయాయి. ఇది 2023–24లో 56.9 శాతం పెరిగింది. 2024–25లో రుణభారం జీడీపీలో 56 శాతం ఉంటుందని అంచనా. ప్రతి రూపాయిలో సుమారు సగం వంతు వడ్డీలు తీర్చడానికి ఖర్చవుతోంది. అప్పులు తీర్చేందుకు తిరిగి అప్పులు చేసే దుస్థితి ఈ కాలమంతటా కొనసాగుతూ వచ్చింది.

భారతదేశ పరిశ్రమల్ని విలీనం చేసుకోవడం, కబ్జా చేసుకోవడంతో ఎంఎన్‌సీల ఆధిపత్యం బాగా పెరిగింది. ఖాయిలాపడ్డవనే పేరుతో ప్రభుత్వ రంగ పరిశ్రమలను (బ్యాంకులను, ఓడరేవులను, విమానాశ్రయాలను) మూసివేస్తున్నారు. లాభాలనార్జిస్తున్న కంపెనీల వాటాలను సైతం ఆధునీకరణ, విలీనం, కబ్జా పేర్లతో కారుచౌక ధరలకు అమ్మివేస్తున్నారు. ఖాయిలాపడ్డ పరిశ్రమలకు, ఆరోగ్యంగా ఉన్న పరిశ్రమలకు మధ్య తేడా లేకుండా పోయింది. మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) వ్యవస్థలను ప్రైవేటు దళారీ కార్పొరేట్ కంపెనీలకు, సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలకూ అప్పగిస్తుండడంతో రైల్వే, ఎయిర్ ఇండియా, ఎంటిఎన్ఎల్, బిఎస్ఎన్ఎల్, బీబీసిఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్లాంట్‌లలో భారీ స్థాయిలో వాటాలు లేదా ఆస్తులు దళారీ నిరంకుశ బూర్జువా వర్గ లేదా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రైవేటు యాజమాన్యంలోకి మారాయి. పలు రాష్ట్రాలలో విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ ప్రైవేటుపరం చేసారు. అన్ని రాష్ట్రాలలోనూ రవాణా, కమ్యూనికేషన్స్

రంగాలలో ప్రైవేటీకరణ క్రమం కొనసాగుతున్నది. విద్యుత్తు రంగం, రహదారులు, టెలీ కమ్యూనికేషన్ రంగం మొదలైనవాటికి భారీ మొత్తాలను అప్పులుగా మంజూరు చేయడానికి అమెరికానే గాక, యూరోపియన్ యూనియన్, జపాన్, చైనా, రష్యా తదితర సామ్రాజ్యవాద దేశాలు కూడా పోటీపడుతున్నాయి.

విమానయాన కంపెనీలలో, చమురు సంస్థలలో, ప్రాజెక్టులలో, బ్యాంకింగ్ రంగంలో పెద్దెత్తున సంస్కరణలు ప్రవేశపెడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాలను, ఓడరేవులను, రైల్వేస్టేషన్లను చేజిక్కించుకోవడానికి విదేశీ పెట్టుబడికి అనుమతినిస్తున్నారు. బొగ్గు గనుల రంగంలోకి నూటికి నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతించారు. విదేశీ పెట్టుబడికి ఉన్న అన్ని కట్టడులను ఎత్తివేస్తూ, సామ్రాజ్యవాద బ్యాంకులకు, బీమా కంపెనీలకు దేశంలో పూర్తి అవకాశం కల్పించారు. 2009 నాటికే భారతదేశ ప్రైవేటు బ్యాంకులకు జాతీయ/ప్రభుత్వ బ్యాంకులతో సమాన స్థాయిలో పనిచేసే హక్కులు ఇచ్చారు. దీంతో సంఘటిత రంగం క్షీణిస్తున్నది. అసంఘటిత రంగం, ప్రైవేటు రంగం ప్రధాన రంగాలుగా మారాయి.

దేశ ప్రాకృతిక వనరులు భారతదేశ సీబీబీకి లాభాల గనిగా ఉన్నాయి. ఖనిజ సంపదను చేజిక్కించుకోవడానికై పెద్ద పరుగు సాగుతోంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బంగ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో పదుల లక్షల కోట్ల రూపాయల గనుల తవ్వకాలకు అవగాహనా ఒప్పందాలు జరిగాయి. ఎంఎన్‌సీల, బడా బూర్జువాల భారీ గని కంపెనీలకు (మైనింగ్ కార్పొరేట్లకు) విశాల భూభాగాలను అప్పగించారు. పారిశ్రామిక కారిడార్ల కోసం భూ బ్యాంక్ విధానం పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను అతిచౌకగా కాజేసారు. ఫలితంగా ఇప్పటికే ఆహారధాన్యాల కొరత ఏర్పడింది.

ప్రత్యేక ఆర్థిక మండలాలను (ఎస్‌ఈజడ్‌లను) ఏర్పాటు చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వాలతో నేరుగా లావాదేవీలు జరుపుకోవడానికి సామ్రాజ్యవాదులకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు అనుమతి ఇచ్చారు. దీంతో వారు పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి, తళుకుబెళుకుల రహదారుల నిర్మాణానికి, హైటెక్ పార్కుల నిర్మాణానికి, హైదరాబాద్, బెంగళూరు వంటి హైటెక్ నగరాల, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణానికి షరతులతో కూడిన అప్పులను నేరుగా మంజూరు చేస్తున్నారు. ఇటువంటి అప్పుల కోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ఇందులో సీపీఐ (ఎం) నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కోసం లక్షలాది ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను రైతుల వద్ద కౌరుచౌక ధరలకు ప్రభుత్వాలు గుంజుకోవడంతో భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూమి కబ్జాలు ఇప్పుడు కొనసాగుతున్నాయి. ఎస్‌ఈజడ్‌లు, ఆనకట్టలు, సూపర్–రహదారులు, పట్టణ 'పునర్వికాస', మెట్రో ప్రాజెక్టులు వంటి బడా 'అభివృద్ధి' ప్రాజెక్టుల, గనుల తవ్వకాల మూలంగా అడవుల్లో నివసించే లక్షలాది ప్రజలు అధికాధికంగా ఆదివాసులు నిర్వాసితులవుతున్నారు. ఎస్‌ఈజడ్‌లలో అమలవుతున్న ఆధునిక బానిసత్వం కింద లక్షలాది కార్మికులు, ప్రత్యేకించి మహిళా కార్మికులు తీవ్ర శ్రమదోపిడీకి

గురవుతున్నారు. అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) లెక్కల ప్రకారమే ఆధునిక బానిసత్వం మూలంగా ఎంఎన్సీలు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 150 బిలియన్ డాలర్ల లాభాలు ఆర్జిస్తున్నాయి.

దళారీ ప్రభుత్వాలు పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్) అనే దోపిడీ విధానాన్ని విస్తరిస్తున్నాయి. పీపీపీ అంటే అంతర్జాతీయ గుత్త సంస్థల, సీబీబీ సంస్థల గుత్తాధిపత్యం తప్ప మరొకటి కాదు. బహుళ జాతి కంపెనీలనూ, సీబీబీని సుసంపన్నం చేసే పద్ధతులలో ఇది ఒకటి. దోపిడీ ప్రభుత్వాలు ఈ నమూనాను వినియోగించి వివిధ ప్రాజెక్టులను క్రమేపీ ప్రైవేటు నియంత్రణలోకి తీసుకువస్తున్నాయి. ఉదాహరణకు గడచిన 30-40 సంవత్సరాలుగా విమానాశ్రయాలు, నౌకా నిర్మాణ కేంద్రాలు, రహదారులు, పట్టణ రవాణా, సరఫరాలు (నీరు, విద్యుత్తు), ఆసుపత్రులు, రక్షణ తయారీ మొదలయిన అనేక ప్రభుత్వ నియంత్రణలో ఉన్న రంగాలను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తున్నారు. బొగ్గు, విద్యుత్పాదన వంటి వాటిని కూడా ప్రైవేటీకరించారు. వ్యవసాయాన్ని సామ్రాజ్యవాదులకు, భారతదేశ భారీ కార్పొరేట్ కంపెనీలకూ అప్పగిస్తున్నారు. ఇలా వివిధ పేర్లతో ప్రజల సొమ్మును వారికి అప్పగించేందుకు చట్టసభలలో సీబీబీకి అవరోధంగా వున్న వందలాది చట్టాలను రద్దు చేస్తున్నారు (ఉదాహరణకు 40 కార్మిక చట్టాల రద్దు), సీబీబీకి ఉపయోగపడే పలు చట్టాలు ముందుకు తెస్తున్నారు. అందులో భాగమే 4 కార్మిక కోడ్లు, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, అటవీ సంరక్షణ చట్టం-2023, కేంద్ర గనుల చట్టం మొదలైనవి.

ముఖ్యంగా స్టాక్ మార్కెట్లో వికాసం సీబీబీకి లాభాలు పండించింది. బ్యాంకుల నుంచి భారీ రుణాలు తీసుకుని, తమ ఆస్తుల, షేర్ల అమ్మకం-కొనుగోలు సాగిస్తూ కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ, తద్వారా మరిన్ని నిధులను ఆకర్షిస్తూ, షేర్లను అత్యంత అధిక రేట్లకు అమ్ముతూ లాభాలు గడించింది. ఈ పెరిగిన షేర్లపై ఆధారపడి జాతీయ/ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసీ మొదలయిన ద్రవ్య సంస్థల నుంచి మరిన్ని రుణాలు పొందింది. ఈ చక్రీయ క్రమం వారి వ్యాపారాన్ని మరింతగా విస్తరింపజేసింది. ఇలా సీబీబీ అతి తక్కువ పెట్టుబడితో, కృషితో భారీ లాభాలను సంపాదించింది. ఉదాహరణకు పతంజలి కంపెనీ.

నిరుపేద ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్లు అత్యధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తూ మైక్రో ఫైనాన్స్ కంపెనీలలో పెద్ద మొత్తాలలో మదుపుపెట్టారు. ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా కార్చిచ్చులాగా వ్యాపించింది. ఇందులో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి భారతదేశంతో సహా వెనుకబడిన దేశాలలో వేలాది పేద ప్రజల పొదుపు మొత్తాలను కొల్లగొట్టి సూపర్ లాభాలు గడించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆత్మహత్యలు చేసుకున్నారు. మైక్రో ఫైనాన్సింగ్ ప్రజలను రాజకీయ ఉద్యమాల నుంచి దూరం చేసింది.

ఈ దళారీ నిరంకుశ బూర్జువా వర్గ కంపెనీలు బ్యాంకు రుణాలను ఎగ్గొడతాయి. ప్రభుత్వం వాటిని మొండి బకాయిలు (నాన్ పర్ఫార్మింగ్ ఎసెట్స్-ఎన్పీఏ)గా ప్రకటించి మాఫీ చేస్తుంది. ఈ మొండి బకాయిలు 2022 డిసెంబర్ నాటికి రూ. 11.17 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వీటిని

మోదీ ప్రభుత్వం 2022 శీతాకాలం పార్లమెంటు సమావేశాలలో రద్దు చేసింది. మొండి బకాయిలతో దివాలాతీస్తున్న బ్యాంకులను రక్షించడం, దళారీ కంపెనీల ద్రవ్య అవసరాలు తీర్చడం కోసమే మోదీ ప్రభుత్వం 2016 నవంబర్‌లో నల్లధనాన్ని (బ్లాక్ మనీని) అరికట్టే పేరుతో 'పెద్ద నోట్లను రద్దు చేసింది', జీఎస్‌టీ, ఈవే బిల్లు విధానాలను అమలు చేసింది. వేలాది ఎంఎస్ఎంఈలను, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలను దివాలాతీయించి, కోట్లాది మంది ఉపాధిని దెబ్బతీయడం ద్వారా వీధుల పాలుజేసి, సీబీబీ ప్రయోజనాలను నెరవేర్చింది.

భారతదేశ సీబీబీ గట్టిగా పనిచేస్తున్న మరో రంగం స్టార్ట్ అప్. 2013లో 350 స్టార్ట్ అప్‌లు వుండగా, 2023 మార్చి నాటికి వీటి సంఖ్య 2 లక్షలకు చేరుకుంది. 130 యూనికార్న్‌లు అభివృద్ధి చెందాయి. ద్రవ్య పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వ స్టార్ట్ అప్ చట్టం స్టార్ట్ అప్ కంపెనీలపై అపారమైన అధికారాలు కల్పించింది. ఆలీబాబా, బైడు వంటి ఒక భారతదేశ ఎంఎన్‌సీని స్థాపించే అవకాశాల గురించి భారత సీబీబీ కలలు కంటున్నది.

అధికార మార్పిడి జరిగిన 50 యేళ్ల వరకు దళారీ పాలకులు 'సాంకేతిక ఆవిష్కరణ'ల మీద ఎలాంటి పాలసీని రూపొందించలేదు. ఆ తర్వాత పాలసీలు రూపొందించినా అవి కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యాయి. భారతదేశ బడా పెట్టుబడి యాజమాన్యంలో వున్న ఫ్యాక్టరీ పరిశ్రమ నిజానికి భారతదేశ వర్తకుల నైపుణ్యాలకు, విదేశీ ఉత్పత్తి ఇంజనీర్లకు పుట్టిన బిడ్డ. అందువల్లనే మన దేశ దళారీ ప్రభుత్వాలు సామ్రాజ్యవాద దేశాల, వాటి ఎంఎన్‌సీల మేధో సంపదకు పోటీలేని విధంగానూ, ఎంఎన్‌సీల, సీబీబీల ప్రయోజనాలను నెరవేర్చే విధంగానూ పెట్రోలియం, టెలిఫోన్, విద్యుత్, రైల్వే వంటి రంగాలలోనే పెట్టుబడులు పెట్టాయి. వాటిని విదేశీ రుణాలతో నింపేసాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు అప్పులతో నిర్మించే ప్రాజెక్టులలో, ప్లాంట్లలో విదేశీ ఆధునిక సాంకేతికతనే వినియోగించాయి.

ఫలితంగా దేశంలో సాంకేతిక పరిజ్ఞానంపై మహాశక్తివంతమైన బహుళజాతి సంస్థల (ఎంఎన్‌సీ-టీఎన్‌సీలకు) గుత్తాధికారం కొనసాగుతున్నది. సాంకేతిక పరిజ్ఞానం త్వరితగతిన మారిపోతూ కాలం చెల్లిపోతున్న రోజులలో భారతదేశంలో ఫ్యాక్టరీ పరిశ్రమలు సాంకేతిక పరిజ్ఞానం, మూలధన వస్తువుల కోసం ప్రధానంగా విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిపై ఆధారపడే ధోరణి కొనసాగుతున్నది. ఫలితంగా తయారైన ఉత్పత్తులు చాలా త్వరితగతిన కాలం చెల్లిపోతున్నాయి (ఔట్‌డేటెడ్ అవుతున్నాయి). సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునే విధానం లేకపోవడం దేశ అభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది.

ఎంఎన్‌సీలు స్థాపించబడితే దానితో పాటు కొత్త శాస్త్ర పరిజ్ఞానం కూడా లభిస్తుందనీ, పారిశ్రామిక అభివృద్ధి పెరుగుతుందనీ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయనీ సామ్రాజ్యవాద థింక్ ట్యాంకులు చేసే ప్రచారం ఎంత మాత్రమూ నిజం లేదు. ఎందుకంటే ఎంఎన్‌సీలకు లాభాలు తప్ప అవి మరే విషయాన్నీ పట్టించుకోవు. తమ అవసరాల కోసం వెనుకబడిన దేశాలకు టెక్నాలజీని బదిలీ చేసినా అవి ద్వితీయ స్థాయి టెక్నాలజీనే ఇస్తాయి. ఆ టెక్నాలజీని ఇమిడ్చుకునే విషయంలో సైతం భారతదేశ

పారిశ్రామిక రంగం బాగా వెనుకబడి ఉంది. వాస్తవానికి ఈ దేశంలో యావత్తు టెలికాం విప్లవం, హాండ్‌సెట్లతో సహా, దిగుమతి చేసుకున్న సామగ్రితో నిర్వహించిందే. ఇటీవల 5జీ సెల్ ఫోన్ సర్వీసులు దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడినవే. రిజర్వు బ్యాంకు తీసుకువచ్చిన ఈ-రూపీ కూడా విదేశీ సాంకేతికతపై ఆధారపడినదే. మన వ్యవసాయ రంగంలో ఉపయోగించే ప్రతి ఒక్కటీ విదేశీ మేధో సంపత్తి నుంచి ఉత్పత్తి అయినవే. రోడ్డు నిర్మాణం చేసే కంపెనీలు, బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణ సంస్థలు ఉపయోగించే పరికరాలు అన్నీ విదేశీ ఉత్పత్తులే. భారతదేశంలో మహాశక్తివంతమైన సాఫ్ట్‌వేర్ రంగం తన యాజమాన్యంలో అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ చాలా తక్కువ. అది దిగుమతి చేసుకున్న సాఫ్ట్‌వేర్‌ను కేవలం ఆపరేట్ చేస్తుంది. దేశంలో ఆర్ అండ్ డీ పై పెట్టే ఖర్చు కూడా తక్కువ. అలాగే ఎంఎన్‌సీలు తీసుకొచ్చే ఆధునిక టెక్నాలజీ మూలంగా ఉన్న ఉపాధి పోతుంది తప్ప పెరగదు. అవి ఎక్కడైనా కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టినా సంబంధిత సైన్స్, ఫార్ములాలను సాధారణంగా ఇవ్వవు. అవి తమ దేశాలలో కాకుండా వెనుకబడిన దేశాలలో పెట్టుబడులు పెట్టడానికి కారణం – అక్కడ ఎవ్వరినీ ఉద్ధరించడానికి కాదు, బలహీనమైన చట్టాలను, లాభదాయకమైన టాక్స్ పాలసీలను ఉపయోగించుకొని అక్కడ చౌకగా లభించే సహజ వనరులను, శ్రమశక్తిని దోచుకోవడానికే. వీటి వల్ల ఎంఎన్‌సీలతో పాటు, ఆ దేశాల సీబీబీ కూడా ఎక్కువ లాభాలు పొందుతుంది. ఇలాంటి బలహీనమైన చట్టాలను, లాభదాయక టాక్స్ పాలసీలను వాళ్లే చెవులు మెలిపెట్టి చట్టసభల్లో ఆమోదింపజేస్తారు.

ప్రపంచీకరణ విధానాల ఫలితంగా గత మూడు దశాబ్దాలలో దేశ అవసరాలతో సంబంధం లేకుండా సామ్రాజ్యవాదులకు సూపర్ లాభాలు చేకూరుస్తూ దిగుమతి చేసుకున్న పాతబడిన హైటెక్ యంత్రాల, టెక్నాలజీ వినియోగం బాగా పెరిగింది. దీనితో ఈ కాలంలో దేశ చరిత్రలో వేగవంతంగా జరిగిందని చెప్పబడుతున్న 'సుడిగాలి వృద్ధి' దేశ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నానికీ, సామాజిక అశాంతికీ, పర్యావరణ విధ్వంసానికీ దారితీసింది. ఫలితంగా లక్షలాది కార్మికుల, ఉద్యోగుల ఉపాధి దెబ్బతినిపోయింది. కాజువలీకరణ/కాంట్రాక్టీరణ పెరిగింది. ఔట్‌సోర్సింగ్ పెరిగింది. 2015-2023 మధ్య కాలంలో 18 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) మూతపడి 54 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. 'ఉపాధిలేని వృద్ధి' ప్రధాన ధోరణి అయింది. ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. నిరుద్యోగం గత 45 సంవత్సరాలలో అతి ఎక్కువ స్థాయికి చేరింది. లేబర్ ఇంటెన్సివ్‌గా వున్న భారత ఆర్థిక వ్యవస్థ క్యాపిటల్ ఇంటెన్సివ్ వైపు పయనిస్తోంది. ఉపాధి కోల్పోయిన శ్రామిక శక్తి పారిశ్రామిక రంగాల నుంచి వెనుకకు వ్యవసాయ రంగం వైపు పయనిస్తోంది. 2016-2017 నుంచి 2021-22 మధ్య కాలంలో 5.2 కోట్ల నుంచి 2.7 కోట్ల మంది అంటే దాదాపు 50 శాతం మంది తయారీ (పారిశ్రామిక) రంగాల నుంచి తగ్గారు. టెక్స్‌టైల్స్, భవన నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో ఉపాధి క్షీణత ఎక్కువగా ఉంటోంది. పట్టణాల్లో ఉపాధి తగ్గిపోవడంతో వ్యవసాయంపై ఆధారపడే వారి సంఖ్య పెరిగింది. 2018-19 మధ్య 42.5 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడగా, ఈ సంఖ్య 2022-23లో 45.8 శాతానికి పెరిగింది. దీంతో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో

పడింది. గత 30 సంవత్సరాలలో 4 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 26 కోట్ల మంది వ్యవసాయ కూలీలు దుర్భర జీవితాలను గడుపుతున్నారు.

నేడు దేశంలో నిరుపేదల సంఖ్య 81.35 కోట్లకు చేరిందని, 75 శాతం గ్రామీణ ప్రజలు, 50 శాతం పట్టణ ప్రజలు పేదరికంలో నలిగిపోతున్నారని అధికారిక లెక్కలే తెలుపుతున్నాయి. ప్రతీ సంవత్సరం 7 లక్షల మంది అంటే రోజుకు 160 మంది యువత ఆత్మహత్యలు చేసుకుంటోంది. దేశంలో 10 కోట్ల మందికి పైగా యువత డ్రగ్స్ ఊబిలో కూరుకుపోయారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ మంది పేదలు ఉన్న దేశంగా భారతదేశం ఉంది. 2024 ప్రపంచ ఆకలి సూచిలో శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌ల కంటే వెనకబడిపోయి భారతదేశం 105వ స్థానంలో ఉంది. గత 30 యేళ్లలో 2024 డిసెంబర్ మొదటివారం నాటికి రూపాయి విలువ డాలర్‌కు 84.72 రూ.లకు ఘోరంగా పడిపోయింది. నెలకు గ్రామీణ ప్రజల ఆదాయం 1,059 రూపాయలకు, పట్టణ ప్రజల ఆదాయం 1,286 రూపాయలకు పడిపోయింది. ప్రపంచ సగటు తలసరి ఆదాయంలో మన దేశ ప్రజల సగటు తలసరి ఆదాయం నాలుగోవంతుకు దిగువనే ఉంది. దేశ జనాభాలో 77 శాతం మంది రోజువారీ 20 రూపాయల ఆదాయంతో జీవిస్తున్నారని అర్జున్‌సేన్ గుప్తా కమిటీ పేర్కొంది. 2024 మార్చి వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అనే గ్లోబల్ పరిశోధనా సంస్థ గణాంకాల ప్రకారం భారతదేశంలో ఉన్నత ఆదాయవర్గానికి చెందిన ఒకే ఒక శాతం మంది దేశీయాదాయంలో 22.6 శాతం వాటాని కలిగి వున్నారు. ఇది ప్రపంచ దేశాల్లోనే ఎక్కువ. ఇక సంపద విషయానికొస్తే 2022-23లో ఒక్క శాతం ధనికుల దగ్గర 40.1 శాతం సంపద ఉన్నది. దీన్ని బట్టి దేశంలో ఆర్థిక అసమానతలు ఏ స్థాయికి చేరుకున్నాయో, బిలియనీర్ల సంఖ్య ఎందుకు పెరిగిపోతోందో అర్థమవుతుంది. ఇలా దేశంలో కొద్ది మంది దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల గుప్పిట్లో భారతదేశ సంపద కేంద్రీకరించబడి వుండడం ప్రపంచీకరణ విధానాల ఫలితమేననేది స్పష్టం.

ఈ కాలంలో సంక్షోభగ్రస్త సామ్రాజ్యవాదానికి ఐటీ అభివృద్ధి ఒక మేరకు తోడ్పడింది. భారతదేశంలో కొంత మంది నూతన బిలియనీర్లు ఐటీ కంపెనీలను స్థాపించి ఎంఎన్‌సీలకు ఔట్‌సోర్సింగ్ చేయడం ద్వారా లాభాలు గడించారు. దేశంలో అగ్రస్థానంలో వున్న 20 సాఫ్ట్‌వేర్ కంపెనీలు మొత్తం సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో దాదాపు సగం వరకు ఎగుమతి చేస్తున్నాయి. ఇది ఒక సెక్షన్ ధనికులకు, ఎగువ మధ్య తరగతికీ వివిధ అవకాశాలు కల్పించింది. నూతన ధనిక వర్గం, నూతన దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి. పరమ చౌక నిపుణ శ్రమను కోరుకునే అంతర్జాతీయ స్థాయి బీపీఓ (బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్) వ్యాపారాలు, బయోటెక్, ఐటీ వ్యాపారాలు వెలుగొందాయి. ఇవి అమెరికన్లనే ముఖ్యమైన ఉద్యోగాలలో నియమించడం వల్ల, అమెరికా ఉద్యోగికి, భారతదేశ ఉద్యోగికీ మధ్య వేతన నిష్పత్తి 24:1కి దిగజారింది. ఇవన్నీ బహుళజాతి కంపెనీలకు, దేశీయ దళారీ నిరంకుశ బూర్జువా కంపెనీలకు భారీ లాభాలు అందించాయి. అయితే కృత్రిమ మేధ కారణంగా పలు రంగాల్లో మాదిరిగానే ఐటీ రంగం మీద కూడా ప్రభావం పడుతుండడంతో గత 3-4 సంవత్సరాల నుంచి అది మునుపటి వైభవాన్ని కోల్పోతున్నది.

దళారీ పాలకులు ఒకవైపు ఎగుమతి కోసం ఉద్దేశించబడిన ఉత్పత్తిని పెంచడాన్ని ప్రోత్సహించారు. ఇంకొకవైపు దిగుమతి పరిమితులను సడలించడం ద్వారా రోజువారీ జీవితంలో ఉపయోగించే 1,400లకు పైగా వస్తువులపై సమస్త దిగుమతి సుంకాలను రద్దు చేసారు. వ్యవసాయోత్పత్తుల వ్యవస్థలను కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ-కామర్స్ ద్వారా వ్యాపారం పెరుగుతుండడంతో పాటు వ్యాపారంపై గుత్తసంస్థల ప్రాబల్యం పెరుగుతున్నది, చిన్న, మధ్య స్థాయి వ్యాపారులు చితికిపోతున్నారు.

విద్య, వైద్య రంగాలలో ఒక వైపు ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ కార్యకలాపాల బాధ్యతల నుంచి వైదొలగుతుండగా, మరో వైపు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలతో ఎంఎన్‌సీల, సీబీబీల గుత్తాధిపత్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడడంతో పేదలకు చదువుకునే అవకాశాలు మృగ్యమైపోయాయి. పిల్లలకు వృత్తిపర ఉన్నత విద్యను అందించాలన్న మధ్యతరగతి ఆకాంక్షలను ఉపయోగించుకుంటూ కార్పొరేట్ యాజమాన్యాలు ఐఐటీ, ఐఐఎం లాంటి ఉన్నత విద్యా సంస్థల, నీట్ పోటీ పరీక్ష కోసం కోచింగ్ సెంటర్ల విద్యను వ్యాపారీకరించి అత్యధికంగా సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ రంగంలోకి ప్రారంభంలోనే వచ్చిన, చాలా వరకు భూస్వామ్య రాజకీయ నేపథ్యం కలిగిన కంపెనీలకు విద్యా ట్రస్ట్‌ల పేరుతో రాజ్యం పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను చౌక ధరలకు ఇచ్చివేస్తున్నది. ఇలా ప్రభుత్వ మద్దతుతో పెద్ద పెద్ద విద్యా సామ్రాజ్యాలు నిర్మాణం అవుతున్నాయి. రిలయన్స్, ఆజీమ్ ప్రేమ్‌జీ, ఓపీ జిందాల్, బిర్లా వంటి కంపెనీలు ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను నిర్మించాయి. ఈ రంగంలో బైజూల వంటి నూతన దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు ముందుకు వచ్చారు. మోదీ ప్రభుత్వం నూతనంగా ఒక్క స్కూల్ కూడా నిర్మించకపోగా, విద్య కోసం బడ్జెట్ కేటాయింపును తగ్గించింది. నూతన విద్యా విధానం పేరుతో మానవ పరిణామ క్రమానికి, సామాజిక చరిత్రకు, విజ్ఞానశాస్త్రానికి తలకిందులుగా భాష్యం చెప్పే, మధ్యయుగాల నాటి మనువాద బ్రాహ్మణీయ హిందుత్వ ఛాందసవాదాన్ని చొప్పించే విద్యను ప్రాథమిక స్థాయి నుంచి ప్రవేశపెట్టింది. ఇటీవలి కాలంలో ఒక ధోరణిగా మారిన ఆన్‌లైన్ విద్య కార్పొరేటీకరణలో భాగమే. విదేశీ విశ్వవిద్యాలయాలతో సహా మరెన్నో వందల కార్పొరేట్ విద్యా సంస్థలు గడచిన మూడు సంవత్సరాలలో ముందుకు వచ్చాయి.

వైద్య రంగంలో గడచిన రెండు దశాబ్దాలలో సీబీబీ వటవృక్షంలా వృద్ధి చెందింది. యావత్తు ప్రధాన, రెండవ శ్రేణి నగరాలలో కూడా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వచ్చాయి. ఇవి ఆడంబరమైన ఎడ్వర్టయిజ్‌మెంట్‌ల ద్వారా ప్రజలను ఆకర్షించి, ఫీజుల రూపంలో విపరీతంగా డబ్బు గుంజుతూ రోగులను దోపిడీ చేస్తున్నాయి. నిస్సహాయ పేదలకు ప్రాణాంతకమయ్యాయి. వీటి తర్వాత బీమా కంపెనీలు వస్తాయి. ఈ రెండు రంగాలలో ఇవి సూపర్ లాభాలు గడిస్తున్నాయి. చిన్న పైసతో సహా ఎంతటి లాభాల వెనుకైనా ఇమిడి ఉండేది కష్టజీవుల శ్రమే. ప్రజా ప్రభుత్వాలుగా చెప్పుకుంటూ ప్రజలను దోపిడీ చేస్తూ సీబీబీని బలోపేతం చేస్తున్నాయి.

పర్యాటక రంగం ఒక వ్యాపారం కావడంతో కార్పొరేట్ కంపెనీలు రంగంలోకి దిగాయి.

బహుళ జాతి కంపెనీల హొటళ్లు, రిసార్ట్‌లు, ట్రావెల్స్, పార్లర్‌లు, సెలూన్‌లు, స్పా సెంటర్లు మల్టీ బిలియన్ డాలర్ వ్యాపారంగా మారాయి. దీని ఫలితంగా మొండిరోగాలు ప్రబలుతున్నాయి.

భారతదేశ సీబీబీల డిజైనర్ బ్రాండ్‌లు ఎత్తులకు చేరుకున్నాయి. దిగుమతి చేసుకున్న ఫర్నిచర్ పరిశ్రమలు అనేకం భారతదేశ మార్కెట్‌లోకి ప్రవేశించడంతో వేలాది చిన్నపాటి భారతదేశ ఉత్పత్తిదారులు దివాలాతీసారు. ప్రధాన పండుగలను కార్పొరేట్ లేదా వాణిజ్య నిధులతో వ్యాపారీకరించడం ద్వారా సూపర్ లాభాలు ఆర్జించడమే కాకుండా సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని వ్యాపింపజేస్తున్నారు. క్రీడలను వాణిజ్య స్థాయికి తీసుకువెళ్లారు. చలనచిత్రాలు కూడా ఎంఎన్‌సీల, సీబీబీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈవెంట్ మేనేజ్‌మెంట్, వెడ్డింగ్ ప్లానర్స్ ఈ మధ్య కాలంలో వచ్చిన నూతన సేవలు. గ్రీటింగ్స్, గిఫ్ట్స్ పరిశ్రమలు కొన్ని విదేశీ బ్రాండ్‌ల నేతృత్వంలో నడుస్తున్నాయి.

గడచిన రెండు, మూడు దశాబ్దాలుగా ముఖ్యంగా పర్యావరణ సమస్యలు ముందుకు వచ్చాయి. దీనిని అవకాశంగా తీసుకుని వందలాది ఎంఎన్‌సీలూ, సీబీబీలు సొమ్ము చేసుకుంటున్నాయి. భారతదేశంలో సుజ్లాన్ ముందుగా విండ్ టర్బైన్‌ల నిర్మాణం ప్రారంభించింది. అనేక కంపెనీలకు ఈఎం6 కూడా ఉన్నది. మెట్రోలలో వాయు నాణ్యత దిగజారిపోవడం ఒక వ్యాపార అవకాశంగా మారిపోయింది. రూమ్, ఆఫీస్ ఎయిర్ ప్యూరిఫయర్‌లు, వాటర్ ప్యూరిఫయర్‌లు, మాస్క్‌లకు గిరాకీ పెరుగుతున్నది. అనేక రాష్ట్రాలలో భూగర్భ జలాలను తాగునీటి కోసం వాడడాన్ని అనుమతించడం వల్ల రివర్స్ ఓస్మోసిస్‌కు గిరాకీ బాగా పెరిగింది. స్థానిక స్థాయిలో నూతన తరహా భూస్వాములకు ఇది మరొక వ్యాపార సాధనంగా మారింది. దీని వల్ల భవిష్యత్తులో మరింతగా భూగర్భ నీటి స్థాయి క్షీణిస్తుంది.

ఈ దశలో ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడంలో, 'అఖండ భారత్'ను స్థాపించాలనే భారతదేశ దళారీ పాలకుల ప్రత్యేకించి దళారీ నిరంకుశ బూర్జువావర్గ విస్తరణవాదకాంక్షకు అనుగుణంగా విధానాలను అమలు చేయుడంలో, బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని ఎత్తిపట్టడంలో/అమలు చేయడంలో, కేంద్రంలో కాంగ్రెసు నాయకత్వంలోని యుపీఏ ప్రభుత్వమైనా, బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వమైనా, వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల, రివిజనిస్టు, నయా రివిజనిస్టు సీపీఐ, సీపీఐ (ఎం) పార్టీల ప్రభుత్వాలైనా పెద్దగా విభేదాలు లేవు. ఈ దోపిడీ పాలకవర్గ పార్టీలన్నింటి లక్ష్యం సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను ఈడేర్చడమే. దేశంలో ఆనాటికానాటికీ పాలకవర్గాల మధ్య పెరిగిపోతున్న కుక్కల కాట్లాటలు అవి అవలంబించే విధానాలకు సంబంధించినవి కావు. ఇవి అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదుల మధ్య నానాటికీ పెరుగుతున్న సంక్షోభ ఫలితం. 'స్వదేశీ', 'స్వావలంబన', 'దేశం వెలిగిపోతుంది', 'రెండవ తరం సంస్కరణలు', 'మన్మోహనామిక్స్', 'మోదీనామిక్స్', 'ఆత్మనిర్భర్ భారత్' – పద ప్రయోగాలు ఏవైనప్పటికీ ఈ వాస్తవిక స్థితి దాచేస్తే దాగేది కాదు.

2023 ప్రారంభంలో హిండెన్ బర్గ్ నివేదిక ద్వారా అదానీ కుంభకోణం వెలుగు చూసిన

తర్వాత ప్రధాని మోదీకి, అదానికి మధ్యనున్న సన్నిహిత సంబంధాలు 'మోదానీ' పదంతో కుఖ్యాతి గాంచాయి. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాల్లో గానీ, అర్థవలస-అర్థభూస్వామ్య దేశాల్లో గానీ 'రాజ్యం' దోపిడీ వర్గాల ప్రయోజనాల పరిరక్షణకే పని చేస్తుంది. అయితే సామ్రాజ్యవాద దేశాల్లో మహాశక్తివంతమైన ఎంఎన్‌సీ, టీఎన్‌సీల అధిపతుల్లో కొందరు 'రాజ్యానికి' అత్యంత సన్నిహితంగా ఉంటూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి కార్పొరేట్ల నుంచి ఎదురయ్యే పోటీ నుంచి, సమస్యల నుంచి అన్ని రకాలుగా రక్షణ పొందుతారు, లాభపడతారు. అర్థవలస-అర్థభూస్వామ్య దేశాల్లోని సీబీబీలో కూడా కొందరు రాజ్యానికి అత్యంత సన్నిహితంగా ఉండి లాభపడతారు. దీన్నే ప్రధాన స్రవంతి మీడియా క్రోని కాపిటలిజం/క్రోని కాపిటలిస్టులు అని రాస్తోంది. ప్రస్తుతం భారతదేశంలో అదానీ, అంబానీ తదితర దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లు కేంద్ర ప్రభుత్వానికి ఆశ్రితులుగా (క్రోనిలుగా) లాభపడుతున్నారు.

భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు ఎంత సంపన్నవంతులు అయినప్పటికీ వీరు ఎన్నడూ స్వతంత్ర ఉనికిని కలిగి లేరు. ప్రపంచీకరణలో వీరికి సామ్రాజ్యవాదంతో సంబంధాలు గట్టిపడ్డాయి, విస్తరించాయి. బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లతో కుదుర్చుకునే జాయింట్ వెంచర్‌లలో భారతదేశ భాగస్వామికి తక్కువ వాటా ఉండడం వల్ల వాటిపై వారికి యాజమాన్య నియంత్రణ వుండదు. అందువల్ల సీబీబీ మరింతగా వాటి మీద ఆధారపడి వుంటారు. అందువల్ల ఇందులో ఏ ఒక్కరూ ప్రపంచ మార్కెట్‌లో బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లతో సర్వసమగ్రంగా పోటీపడగల నిజమైన గ్లోబల్ ఛాంపియన్‌గా లేరు. నిజానికి వీరు ఎంఎన్‌సీలకు దళారీలు మాత్రమే.

సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పు చెందుతూ వస్తున్న మన దేశ అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గం ఆధిపత్య స్థానంలో ఉంది. ఇందులో దళారీ ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సామ్రాజ్యవాద ఎంఎన్‌సీ, టీఎన్‌సీలకు సేవ చేస్తాయి. అగ్ర రాజకీయ నాయకులు, ఉన్నత అధికారులు సంపాదనను ఆర్జించేందుకు మరింతగా సామ్రాజ్యవాదుల పాదాలు వత్తుతుంటారు. దేశ పరిశ్రమను, వ్యవసాయాన్ని నాశనం చేస్తారు. తాము రూపొందించుకున్న రాజ్యాంగానికి తామే స్వయంగా తూట్లు పొడుస్తారు. వీరు వల్లించే 'ఆత్మనిర్భర్ భారత్' ఎంత బూటకమో దీని ద్వారా సులభంగా అర్థం చేసుకోవచ్చు. వీరు విశాల గ్రామీణ ప్రాంతాల్లోని పాత వెనుకబడిన అర్థభూస్వామ్య అధికార స్వరూపాలతో విలీనమవుతారు. ఏ విధమైన ప్రజాస్వామిక చైతన్యాన్ని అయినా, ఉద్యమాన్ని అయినా అణచివేస్తారు. బ్రాహ్మణీయ భావజాలం ఇందుకు తోడ్పడుతుంది. దళారీ ప్రభుత్వాలు బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని పెంచి పోషిస్తూ అదే ప్రజలకు స్వాంతన చేకూరుస్తుందనే భావనను పెంపొందిస్తాయి. బాబాలు, సాధువులూ, సన్యాసులూ పెరుగుతారు. దీంతో ముస్లిం తదితర మత మైనారిటీ ప్రజలు మరింతగా వెనక్కు, తమ మత ఛాందసవాద భావజాలం వైపు వెళతారు.

ప్రపంచీకరణ కాలంలో కూడా కులం సీబీబీ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది. ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో సీబీబీ చాలా వరకూ కేవలం కొన్ని కులాల నుంచి మాత్రమే అభివృద్ధి చెందడం స్పష్టంగా కనపడుతుంది. బ్రాహ్మణ (గౌడ సరస్వత బ్రాహ్మణ-జీఎస్‌బీ) కులం నుంచి

అభివృద్ధి చెందిన విజయ్ మాల్యా వంటి వారు కొందరున్నారు. కానీ సీబీబీలో చాలా మంది బనియాలు, మార్వాడీల నుంచి అభివృద్ధి చెందారు. ఈ రెండు కులాల నుంచి సీబీబీ బృందాలు ప్రతీ సంవత్సరం ఫోర్బ్స్ బిలియనీర్ లిస్టులో ఆధిపత్యంలో ఉంటాయి. ఇందులో సహజంగా అంబానీలకు, అదానీలకు, ఎస్సార్‌కు చెందిన రుయా సోదరులకు స్థానం ఉంటుంది. భారతదేశ పారిశ్రామిక రంగంపై 'బనియా–బ్రాహ్మణ' కులాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం, 21వ శతాబ్దంలోని రెండవ దశాబ్దంలో భారతదేశంలో 50 అతి పెద్ద కంగ్లామరేట్లు ఆధిపత్యం చలాయిస్తుండగా, దేశంలో 2/3వ వంతు అతిపెద్ద లిస్టెడ్ కంపెనీలను బనియా–బ్రాహ్మణ కుటుంబాలే నడుపుతున్నాయి. ఈ సంబంధాలు విశ్వసనీయతను సంపాదించుకోవడం ద్వారా సులభంగా ఒప్పందాలు చేసుకునేందుకు లేదా డబ్బును పెంచుకునేందుకు తోడ్పడుతున్నాయి. ఇవి విధేయతను, చరిత్రను, కులాన్ని, అదే విధంగా లాభాలను, రెవెన్యూలను కీర్తించే వ్యాపార సంస్కృతులను సృష్టించాయి. ఇప్పటికీ ఒకే కులం వారు పరస్పరం సహకరించుకోవడం, అనుకూలమైనవారు సహకరించుకోవడం కొనసాగుతున్నది. కులం, రక్త సంబంధాలకు సంబంధించిన అవే సంబంధాలు తరచుగా పారిశ్రామిక రంగానికి ఒక నమూనా నేపథ్యాన్ని సమకూర్చుతున్నాయి. అందువల్లనే ఎలాంటి నైతిక విలువలు లేని బనియా కులం అంటే దేశ ప్రజానీకంలో వ్యతిరేకత బాగా ప్రబలమైంది.

'బనియా–బ్రాహ్మణ' ఆధిపత్యంతో కూడిన ఉత్తరాది సీబీబీ తమ వ్యాపారాలలో పని చేసేందుకు ఉద్యోగులను కాకుండా, డబ్బు కోసమే కాక కీర్తికండూతి కోసం కూడా పాకులాడే గుడ్డి అనుచరులను తయారు చేస్తారు. యుద్ధ వ్యాపార సంస్కృతి అనేక సీబీబీ కుటుంబాలలో ఆధిపత్యం వహిస్తుంది. ఇవి ఎల్లప్పుడూ తాము యుద్ధంలో ఉన్నట్లుగా భావిస్తాయి. తమకు వ్యతిరేకంగా ఏ సమయంలోనైనా తలెత్తే ప్రమాదాలను, విద్రోహాలను దృష్టిలో ఉంచుకుని తమ యుద్ధ సన్నద్ధతను ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకుంటూ ఉంటాయి. 21వ శతాబ్దంలో చోటు చేసుకున్న భారీ మార్పులతో పీడక కుల సంబంధాలు కలిగిన కొన్ని చిన్న వ్యాపార కుటుంబాలు సైతం హఠాత్తుగా ప్రపంచమంతటా తమ దళారీ వ్యాపార వాటాలను విస్తరించుకుంటూ భారీ పరిశ్రమల అధిపతులుగా, అతి తక్కువ సంఖ్యలో అతిసంపన్న కుటుంబాలుగా మారాయి. ఈ దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల కుటుంబాల జీవనశైలి మారింది. నూతన సంపన్న సంస్కృతి అభివృద్ధి అయింది. ఒకప్పుడు సాధారణంగా వుండిన వ్యాపార కుటుంబాలు ఇప్పుడు ప్రసిద్ధి చెందిన పటిష్టమైన విలాసవంతమైన భవనాలు, కార్లు, ప్రైవేటు జెట్లు, విలాసవంతమైన మెగా బోట్లు తయారీలో మదుపు పెట్టడం ఆరంభించాయి.

గత మూడు దశాబ్దాలలో దేశంలో ప్రముఖ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులుగా అంబానీలు, మిత్తల్‌లు, బిర్లాలు, అదానీలు, ప్రవాస భారతదేశీయులుగా వున్న హిందూజాలు, రూయియాలు (ఎస్సార్), జిందల్‌లు, టాటాలు, థాపర్‌లు, బజాజ్‌లు, మహీంద్రాలు, మఫత్‌లాల్‌లు, గోయెంకాలు, వేదాంత, ఇన్ఫోసిస్, ఎస్సార్, ఆర్‌పీజీ వంటి కంపెనీలు, టీవీఎస్ అయ్యంగార్, విజయ్ మాల్యా, దిలీప్ శింఘ్వీ, అజీమ్ ప్రేమ్‌జీ, శివ్ నాడార్, ఉదయ్ కొటక్, సైరస్ ఎస్ పూనవాలా, సైరస్ పల్లోంజి మిస్త్రీ, షాపూర్జి పల్లోంజి, నరేష్ గోయల్, సుభాష్ చంద్ర, కిశోర్ బియానీ వంటి వారు

పైకి ఎగబాకారు. ఐటీ రంగంలో నూతన బనియా–మార్వాడీ వ్యాపారులు నరేంద్ర కుమార్ పాట్నీ, అరుణ్ జైన్‌లు, పాత టెక్స్‌టైల్స్ రంగంలో లక్ష్మీ ఝున్‌ఝున్‌వాలా, కస్లీవాల్ బ్రదర్స్, ఓస్వాల్స్, లోహియాలు అభివృద్ధి చెందడంతో పాటు, అశోక్ భగీరత్‌మల్ జివ్రాజ్‌కా, రాజేందర్ గుప్తా, గోపీరాం గోయెంకా వంటి నూతన దళారీ పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. మరి కొన్ని ఇతర ప్రముఖ బనియా–మార్వాడీ గ్రూపులు ఫార్మా, చక్కెర, ఉక్కు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, వ్యాపార వాహనాలు, ఎలక్ట్రిక్ సామగ్రి, నిర్మాణం, సరుకుల రవాణా, షిప్పింగ్, తదితర రంగాలలో ముందుకు వచ్చాయి. వీరితో పాటు పతంజలి వంటి పలు మహాశక్తివంతమైన యూనికార్న్ కంపెనీలు, అసెట్‌లైట్, ఏగ్రిగేటర్ నమూనా స్టార్టప్ కంపెనీలు ఆవిర్భవించి అభివృద్ధి చెందాయి.

ప్రపంచీకరణ దశ ఆరంభమైనప్పుడు, అంటే 1990ల ప్రారంభం వరకు ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఒక్క భారతదేశ బిలియనీర్ కూడా లేరు. 1990ల మధ్య నాటికి ఇద్దరు భారతదేశీయులు - కుమార మంగళం బిర్లా, ధీరూభాయి అంబానీలు మాత్రమే, 3 బిలియన్ డాలర్లతో ఆ జాబితాలో చేరారు. ప్రవాస భారతదేశీయులుగా వున్న హిందూజా సోదరులు ఇందుకు మినహాయింపు. 2002 నాటికి ఈ సంఖ్య నిదానంగా ఐదుగురికి చేరింది. అప్పటి నుంచి ఇది విస్ఫోటనంలా విస్తరించడం ప్రారంభమైంది. 2010 చివరి నాటికి 49 మంది, 2014 నాటికి 100కు పైగా, 2020 నాటికి 102 మంది, 2022 నాటికి 166 మంది, 2024 డిసెంబర్ నాటికి 185 మంది భారతదేశీయులు బిలియనీర్లుగా మారారు. 2022 మధ్య నాటికి వీరి సంపద రోజుకు 3,608 కోట్ల రూ.లుగా వృద్ధి చెందుతోంది. 2024 డిసెంబర్ నాటికి వీరి మొత్తం సంపద 90,560 కోట్ల డాలర్లు (రు. 76.66 లక్షల కోట్లు). ఇందులో కొన్ని పాత కుటుంబాలు నడిపే కంగ్లామరేట్లు గ్లోబల్ మల్టీనేషనల్ కంపెనీలుగా పరివర్తన చెందాయి. నూతన తరం బిలియనీర్లు సాఫ్ట్‌వేర్ నుంచి మైనింగ్ వరకు వివిధ రంగాలలో అభివృద్ధి చెందారు. 2002లో అదానీ గ్రూపు ఆస్తులు కేవలం 70 మిలియన్ డాలర్లు ఉండగా, 2012 నాటికి 20 బిలియన్ డాలర్లకు, 2024 జూన్ నాటికి 111 బిలియన్ డాలర్లకు (రు. 9.24 లక్షల కోట్లు) (అగస్టు నాటికి రు. 15.44 లక్షల కోట్లు) పెరిగాయి. 2010లో ఇద్దరు ఇండియన్లు - ముకేష్ అంబానీ, లక్ష్మి మిత్తల్‌లు లను ప్రపంచంలోని ఐదుగురు సంపన్నులలో స్థానం సంపాదించగా, 2022లో ప్రపంచంలోని అత్యంత ధనికుల జాబితాలో రూ. 12,45,600 కోట్ల (ఆనాటి డాలర్ విలువ 80 రూ.ల చొప్పున) (155.7 బిలియన్ డాలర్ల) నికర ఆస్తులతో గౌతం అదానీ 2వ స్థానాన్ని సంపాదించుకున్నాడు. ముకేష్ అంబానీ యాజమాన్యంలోని రిలయన్స్ సంస్థ 2002 మార్చి నెలలో రూ. 41,989 కోట్ల మార్కెట్ పెట్టుబడిని కలిగి వుండగా, 2022 మార్చి నాటికి, 20 శాతం వార్షిక వృద్ధి రేటుతో అది రూ. 17,81,841 కోట్ల రూపాయలకు చేరింది. 2024 జూన్ నాటికి అంబానీ గ్రూపు ఆస్తులు 109 బిలియన్ డాలర్లకు, అగస్టు నాటికి రు. 25.75 లక్షల కోట్లు, బజాజ్ గ్రూపు ఆస్తులు రు. 7.13 లక్షల కోట్లకు, బిర్లా గ్రూపు ఆస్తులు రు. 5.39 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ జాబితా ప్రకారం 2024 జూన్ నాటికి ప్రపంచ సంపన్నులలో అంబానీ 12వ స్థానంలో ఉండగా, అదానీ 14వ స్థానంలో ఉన్నాడు. ఇదే సమయంలో కాంటార్

బ్రాండ్జ్ రిపోర్టు ప్రకారం ప్రపంచ టాప్-100 బ్రాండ్లలో స్థానం సంపాదించుకున్న నాలుగు భారత కంపెనీలలో 46వ స్థానంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) (4,479 కోట్ల డాలర్లు), 47వ స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (4,326 కోట్ల డాలర్లు), 73వ స్థానంలో ఎయిర్‌టెల్ (2,526.3 కోట్ల డాలర్లు), 74వ స్థానంలో ఇన్ఫోసిస్ (2,468.6 కోట్ల డాలర్లు)లు ఉన్నాయి. ఇలా దేశంలో ఒక నూతన అతిసంపన్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి అయింది. దేశ సహజ వనరులను, పబ్లిక్ రంగ సంస్థలను తమ సొంత ఆస్తిగా దోచుకోగలగడం వల్లనే ఈ వర్గం బిలియన్లకు పడగలెత్తిందనేది స్పష్టం.

**7. జాతీయ బూర్జువా వర్గం అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న సామ్రాజ్యవాదమూ, దళారీ నిరంకుశ బూర్జువావర్గమూ:**

జాతీయ బూర్జువా వర్గం ఒక వైపు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలతో పీడించబడుతూ, మరోవైపు భూస్వామ్యం చేత కట్టివేయబడి ఉంటుంది. ఇది రాజకీయంగా బలహీనంగా వుండడం వలన దానికి రాజ్యాధికారంలో వాటా ఉండదు. రాజ్య నిధులపై ఏ అజమాయిషీ, అధికారం దానికి లేదు. దానికి సామ్రాజ్యవాదంతో సాపేక్షికంగా తక్కువ సంబంధాలు వుంటాయి. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల కూటమి వారి మార్కెట్టును నిరంతరాయంగా కబళిస్తుంటుంది. ఫలితంగా వారి పరిశ్రమల్లో వృద్ధి పరిమితంగానే ఉంటుంది. రోజు రోజుకీ లక్షలాది పరిశ్రమలు దివాలా తీస్తుంటాయి. ఆ విధంగా ఇది భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవపు ముగ్గురు శత్రువులతోనూ వైరుధ్యాన్ని కలిగి వుంటుంది. అందువల్ల ఈ విప్లవంలో నాలుగు విప్లవకర మిత్ర వర్గాల్లో ఇది ఒకటిగా ఉంటుంది.

అధికార మార్పిడికి ముందూ, ఆ తర్వాతా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల తీవ్ర దాడికి గురైన వర్గాలలో ఒకటి జాతీయ బూర్జువా వర్గం. ఇది సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, కాంట్రాక్టులతో పాటు హోల్‌సేల్, రీటైల్ వ్యాపారాలు, రవాణా, విద్య, వైద్య రంగాలు, హోటళ్లు వంటి వ్యాపార, సేవా రంగాలలో పెట్టుబడులు కలిగి వుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో 30 శాతాన్ని కలిగి, వ్యవసాయం తర్వాత, 40 శాతం (20 కోట్ల మందికి) ఉపాధిని కల్పించే రంగం ఇదే. మొత్తం 6.33 కోట్ల ఎంఎస్ఎంఈలలో సూక్ష్మ పరిశ్రమలు 6.30 (90 శాతం) కోట్లు ఉండగా, చిన్నతరహా పరిశ్రమలు 3.11 లక్షలు, మధ్యతరహా పరిశ్రమలు 5 వేలు ఉన్నాయి. దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు రెండూ సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) వ్యాపారాల/పరిశ్రమల సేవలను తీసుకుంటూ, వీటిని అక్రమ పద్ధతుల ద్వారా తమకు అనుకూలంగా వినియోగించుకుంటూ దోపిడీ పీడనలకు గురిచేస్తున్నాయి.

అధికార మార్పిడి తర్వాత దేశంలో మొట్టమొదట రూపొందించిన మిశ్రమ ఆర్థిక విధానంలో అసంఘటిత రంగంలో భాగంగా ఒక ముఖ్యమైన రంగంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా-ఎంఎస్ఎంఈ (గతంలో చిన్న తరహా పరిశ్రమల రంగం) రంగానికి పచ్చళ్లు, తాళపు కప్పల నుంచి కొయ్య ఫర్నిచర్ వరకు వందలాది ఉత్పత్తులు రిజర్వు చేయబడినాయి. ఇది 'మేడ్

ఇన్ ఇండియా' పేరుతో పలు ఉత్పత్తులు ఉత్పత్తి చేసేందుకు పేద చేతివృత్తులవారికి తోడ్పడింది. ఈ రంగం విదేశీ, స్వదేశీ పరిశ్రమల నుంచి తీవ్రమైన పోటీని తట్టుకుని నిలబడింది. కానీ ఇది ఎంతో కాలం కొనసాగలేదు. దళారీ ప్రభుత్వాలు ఈ విధానానికి తూట్లు పొడిచాయి.

ప్రపంచీకరణ కాలంలో ఈ రంగంలో క్యాజువలీకరణ అత్యధిక స్థాయికి చేరుకుంది. ఈ రంగాన్ని చౌక దిగుమతుల వరదతో ముంచెత్తడం, కొన్ని వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఈ రంగానికి ఇచ్చిన రిజర్వేషన్‌ను రద్దు చేయడం ద్వారా దెబ్బతీసారు. ఈ రంగంలో అత్యంత సాధారణమైన సమస్య ఎంఎస్ఎంఈలకు బకాయిలను సకాలంలో చెల్లించలేకపోవడం, అవసరమైన పెట్టుబడులను సమకూర్చకపోవడం, ముడి పదార్థాలను అందించకపోవడం, వీటిని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలు, దళారీ కార్పొరేట్ కంపెనీలు తమ అనుబంధ కంపెనీల స్థాయికి దిగజార్చివేయడం. ఫలితంగా దాదాపు 80 శాతం ఎంఎస్ఎంఈ యూనిట్లు అధిక వడ్డీ రేట్లకు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేయడం సర్వసాధారణం. చౌక శ్రమశక్తితో పెద్ద ఎత్తున మార్కెట్‌కు సరుకులను అందించే ఈ రంగానికి ప్రావిడెంట్ ఫండ్, డీఏ, బోనస్, ఈసిస్ మొదలైన యావత్తు సామాజిక భద్రతా పథకాల నుండి వమ్ము చేస్తూ వాటిని కేవలం పెద్ద వ్యాపార సంస్థలకు, టీఎన్‌సీలకు, పబ్లిక్ రంగానికి మాత్రమే పరిమితం చేసారు.

అబిద్ హుస్సేన్ కమిటీ సిఫారసుల ప్రకారం 1997లో ఈ రంగానికి ఉద్దేశించిన ఐస్‌క్రీములు, బిస్కట్లు, బియ్యం, పప్పుల మిల్లులు మొదలైన 14 ముఖ్యమైన ఉత్పత్తులను ప్రభుత్వం డీ-రిజర్వు చేసింది. 1999 నాటికే 'ఉదారీకరణ'లో భాగంగా 3,000 రకాల విదేశీ ఉత్పత్తులు, ఎగుమతి దిగుమతి (ఎగ్జిం) పాలసీ ప్రకారం 8,000 రకాల విదేశీ ఉత్పత్తులు భారతదేశ మార్కెట్‌ను ముంచెత్తాయి. ఎగుమతి-దిగుమతి పాలసీ-2000 ప్రకారం 714 సరుకుల, 2001లో మిగతా 715 సరుకుల దిగుమతులపై ఆంక్షలను తొలగించడం, నూతన టెక్స్‌టైల్ పాలసీ-2000 ప్రకారం ఈ రంగపు దుస్తుల తయారీకి చెందిన భారీ సెక్టార్‌ను రిజర్వు లిస్టు నుంచి తొలగించడంతో ఈ రంగాలకు గల స్వతంత్ర మార్కెట్ ధ్వంసమైంది.

ప్రభుత్వం ఈ సెక్టార్‌లో ఎఫ్‌డీఐపై గరిష్ట పరిమితిని కూడా 24 శాతం నుంచి 100 శాతానికి పెంచింది. దీంతో విదేశీ పెట్టుబడి దుస్తుల తయారీ పరిశ్రమను టేక్ ఓవర్ చేసుకుంది. బడా వ్యాపార సంస్థలచే ఔట్‌సోర్సింగ్ (ఉత్పత్తి మరియు సర్వీసు - రెండు రంగాలలో)ను ప్రోత్సహిస్తూ దాని స్వతంత్ర అస్తిత్వాన్ని రూపుమాపుతున్నారు. రిటైల్ (చిల్లర) వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడిని, దళారీ బడా బూర్జువా పెట్టుబడిని అనుమతించారు. దీంతో అమెరికా, యూరప్‌లలోని రిటైల్ వ్యాపార భారీ సంస్థలు దళారీ బడా బూర్జువాలతో చేతులు కలిపి భారతదేశంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇవి లక్షలాది చిల్లర వ్యాపారాలను దివాలా తీయిస్తున్నాయి. విదేశీ ఫర్నిచర్ పరిశ్రమలను అనుమతించడంతో వేలాది చిన్న భారత పరిశ్రమలు మూతపడుతున్నాయి.

పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల సూక్ష్మ పరిశ్రమల్లో 40 శాతం ఖాయిలాపడే స్థితి ఏర్పడింది. ఈవే బిల్లు విధానం ట్రాన్స్‌పోర్ట్‌లను దివాలాతీయించింది. పెద్ద నోట్ల రద్దు ఫలితంగా 50 లక్షల

ఉద్యోగాలు పోయాయి. రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారమే దేశవ్యాప్తంగా 4,86,291 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. 2015-2023 మధ్య కాలంలో 18 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) మూతపడి 54 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. వాటి యజమానులు, కార్మికులు తీవ్ర కష్టనష్టాలకు గురయ్యారు. వలస కూలీలు రోడ్డున పడ్డారు. 2019లో 42.9 శాతంగా వున్న కార్మిక భాగస్వామ్య రేటు 2022లో 39 శాతానికి తగ్గింది.

కరోనా మహమ్మారి కాలంలో 'మహమ్మారిలను, ప్రకృత్తి విపత్తులను అవకాశాలుగా మార్చుకోవాలి' అనే నినాదంతో మోదీ ప్రభుత్వం ఎమ్.ఎస్.ఎమ్.ఈ.ల నిర్వచనాన్ని మార్చివేసింది. ఈ రంగాన్ని సామ్రాజ్యవాద కంపెనీలకు, దళారీ కంపెనీలకు కట్టబెట్టింది. దీంతో ఈ కార్పొరేట్ కంపెనీలు నేరుగానూ ఈ రంగంలో ప్రవేశిస్తున్నాయి లేదా ఫైనాన్స్ చేస్తున్నాయి.

ప్రభుత్వ విధానాలను రూపొందించే సీఐఐ, ఎఫ్ఐసీసీఐ, అసోచామ్ వంటి వందలాది అంగాలలో దళారీ కార్పొరేట్ కంపెనీలకు ప్రాతినిధ్యం ఉంది. కానీ ఎంఎస్ఎంఈ రంగానికి ఎక్కడా ప్రాతినిధ్యం లేదు. రుణ అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి ఉపాధిహామీ పథకం, ముద్ర, సంప్రదాయ పరిశ్రమల పునరుత్తేజిత నిధి (స్ఫూర్తి), కాయిర్ బోర్డు పథకాలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల రుణహామీ పథకం (సీజీటీఎమ్ఎస్ఈ), రుణ ఆధారిత మూలధన సబ్సిడీ పథకం వంటివి ఎన్నో ఉన్నాయి. ఈ పథకాలకు ప్రభుత్వ కేటాయింపులు తగినంతగా లేవు. ఈ రంగంలోని 16 శాతం పరిశ్రమలకు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలు లభిస్తున్నాయి. మాన్యుఫాక్చరింగ్ రంగంలో 40 శాతం ఉత్పత్తి చేసే ఈ రంగానికి 2015-2020 మధ్య రుణాలు 19 శాతం తగ్గిపోయాయి.

యంత్రసామగ్రి లేకపోవడం, న్యాయమైన ధరకు ముడి పదార్థాలు లభించకపోవడం, వీటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, ఉత్పత్తి ఖర్చు పెరిగి తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, దేశ-విదేశీ కార్పొరేట్ కంపెనీల పోటీ కారణంగా వీటి ఉత్పత్తులకు గిరాకీ లేకపోవడం, విద్యుత్ కొరతను, అధిక విద్యుత్తు రేట్లను ఎదుర్కోవడం ఈ రంగం దివాలాతీయడానికి ముఖ్య కారణాలు. నిజానికి ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్సీ) 2019లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఈ ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.16.66 లక్షల కోట్ల మేరకు రుణ అవసరాలు ఉన్నట్లు తేలింది. భారత దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలకు ఈ రంగం అవసరాల పట్ల గానీ, దీనికి అవసరమైన టెక్నాలజీని అందించే శ్రద్ధ గానీ లేదు. అవి అవలంబిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా ఈ రంగంలో లక్షలాది పరిశ్రమలు దివాలాతీస్తున్నాయి. ఉత్పత్తి శక్తులు నిరంతరం ధ్వంసమవుతున్నాయి. ఇందులో పనిచేసే కోట్లాది మంది ప్రజలు దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు. వీటన్నింటి కారణంగా ఎంఎస్ఎంఈ రంగం వృద్ధి రేటు పడిపోతున్నది. ఇవి మార్కెట్‌లో డిమాండ్‌ను, జీడీపీ వృద్ధి రేటును మరింతగా కుదించివేస్తున్నాయి. ఈ పరిశ్రమలకు యాజమాన్యంగా ఉన్న జాతీయ బూర్జువా వర్గం సైతం

నిరంతరం దెబ్బలు తింటున్నది.

## 8. 'భారత' జాతి, దేశ 'సమైక్యత', 'సమగ్రత' పేరుతో దేశాన్ని జాతుల బందీఖానాగా మార్చడం, 'అఖండ భారత్' లక్ష్యం వెనుక వున్నది సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాలే

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని ఆక్రమించిన తర్వాత తమ సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం దేశాన్ని వలస, అర్ధభూస్వామ్య దేశంగా పరివర్తన చెందించడంతో పాటే దేశంలో జాతులపై దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష ఆరంభమై జాతుల సమస్య తలయెత్తింది. దీనికి ప్రధాన కారణం సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడితో, దేశంలో బనియా-మార్వాడీ దళారీ పెట్టుబడిదారుల, స్థానిక జమీందార్ల-భూస్వాముల మిలాఖతు. ఈ కూటమి దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమానికి, సమస్త జాతుల, తెగల సహజ అభివృద్ధి, జాతి రాజ్యాల నిర్మాణ క్రమానికి ప్రధాన అడ్డంకిగా మారింది. హిందుమత-పీడక సాంప్రదాయ కులాల బిజినెస్ కమ్యూనిటీల నేపథ్యం నుండి వచ్చిన భారతదేశ దళారీ పెట్టుబడిదారులు అధికార మార్పిడికి ముందు నుంచే దేశాన్ని అధికారికంగా హిందూ రాజ్యంగా, హిందూ మతాన్ని అధికారిక మతంగా మార్చాలనే భావనను కలిగి వున్నారు. ఆనాటి నుంచి వారు హిందుత్వ భావజాలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ 'భారత జాతి' భావనను ముందుకు తెచ్చారు. బనజిగలు (కర్నాటక), సామ్రాజ్యవాద అడుగుజాడల్లో నడిచే దళారీ బనియాలు, మార్వాడీలు, పార్సీల లాగా 'భారత జాతి' అనే భావనకు ప్రాతినిధ్యం వహించడం కాకుండా 'జాతీయ బూర్జువా వర్గానికి' ప్రతీకగా నిలిచారు. బ్రిటిష్ పాలకులు జాతులను ముక్కలుగా చేసి వివిధ ప్రావిన్సులకు, 'రాష్ట్రాల'కు జోడించే విధంగా "బ్రిటిష్ ఇండియా" ప్రావిన్సులు "స్థానిక రాజ్యాలుగా" ఏర్పాటు చేయబడ్డాయి. ఉదాహరణకు, తెలుగు మాట్లాడే ప్రజల భూభాగం రెండుగా విభజించబడి ఒక భాగం మద్రాసు ప్రెసిడెన్సీతో (ఇందులోకి తెలుగువారితో పాటు తమిళులు, కన్నడిగలు, మలయాళీలు కూడా చేర్చబడ్డారు), రెండవ భాగం హైదరాబాద్ రాష్ట్రంతో కలిపారు (ఇందులో తెలుగువారే కాక మరాఠీ, కన్నడ మాట్లాడేవారు కూడా ఉండినారు). గుజరాతీలు 200కు పైబడిన అతి చిన్న స్థానిక రాష్ట్రాలలో విభజింపబడినారు. బొంబాయి ప్రెసిడెన్సీలో అతి పెద్ద మరాఠా భూభాగంతో పాటు గుజరాతీలను కూడా కలిపారు. మరాఠీ, గుజరాతీ, బంగాలీ, ఒడియా, తెలుగు, కన్నడ ఇలా ప్రతి జాతినీ, వాటి భూభాగాలను చిన్న చిన్న ముక్కలుగా ఇతరులతో కృత్రిమంగా జోడించారు. జాతులను విభజించడం ద్వారా, జాతుల ఐక్యతను, అభివృద్ధిని దెబ్బతీసి తమ దోపిడీకి మార్గం సుగమం చేసుకున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, భారత దళారీ పెట్టుబడిదారులతో చేతులు కలిసి, భూస్వామ్యాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించి, దానిని సామాజిక పునాదిగా చేసుకుని దేశాన్ని కొల్లగొట్టారు. ఈ క్రూరమైన దోపిడీకి వ్యతిరేకంగా, దేశంలోని అన్ని ప్రాంతాల, జాతుల ప్రజలకు వలస దాస్యశృంఖలాలను తెంచుకుని స్వాతంత్ర్యాన్ని సాధించే లక్ష్యంతో బంగాలీ, తెలుగు, తమిళ, మరాఠా, కన్నడ, గుజరాతీ తదితర జాతుల పోరాటాలు బద్దలయ్యాయి. బ్రిటిష్ వలసవాదులు

ఐర్లాండును దురాక్రమించినప్పుడు అక్కడ వృద్ధి చెందుతున్న అన్ని రకాల పరిశ్రమల్ని ధ్వంసం చేసారనీ, అక్కడ శవ పేటికలు తయారు చేసే ఏకైక పరిశ్రమ మాత్రమే నిలదొక్కుకున్నదనీ, కనుక ఐర్లాండు జాతి అస్తిత్వాన్ని కాపాడాలంటే ఆ జాతి ప్రజలకు "స్వయంపాలన, వ్యవసాయ విప్లవం..." అవసరమని మార్క్స్ బోధించారు. ఇది మన దేశానికి కూడా వర్తిస్తుంది. అయితే భారతదేశ దళారీ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే కాంగ్రెస్ పార్టీ దేశంలో వెల్లువలా సాగుతున్న స్వాతంత్ర్య సంగ్రామానికి ద్రోహం చేసింది. జాతుల ఉద్యమాలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో మిలాఖతై అధికార మార్పిడికి ఒప్పందాలు చేసుకుంది.

అధికార మార్పిడి తర్వాత భారత దళారీ పాలకవర్గాలు 'భారత జాతి', 'అఖండ భారత్' భావనలను ఎత్తిపడుతూ మన దేశ కార్మిక, కర్షక తదితర శ్రామిక ప్రజలకు, జాతీయ బూర్జువా శక్తులకూ, జాతుల వికాసానికీ, జాతుల సమైక్యతకూ, అన్ని ప్రాంతాల అభివృద్ధికీ ప్రధాన అడ్డంకిగా మారాయి. భారతదేశ రాజ్యాంగంలోని నామమాత్ర ఫెడరల్ సూత్రాలను సైతం కాలరాచి, ఆధిపత్యంలో వున్న యూనిటరీ సూత్రాలను యథేచ్ఛగా అమలు చేసాయి.

కశ్మీర్‌ను ఇండియా, పాకిస్తాన్‌లు రెండూ దురాక్రమించుకుని కశ్మీర్ స్వయంనిర్ణయాధికార హక్కును కాలరాచివేసాయి. ఇదే విధంగా భారతదేశ దళారీ పాలకవర్గాలు ఈశాన్య ప్రాంతంలోని మణిపుర్, నగాలాండ్, అసోం భూభాగాలను అక్కడి జాతుల, తెగల ప్రజల అభీష్టానికి భిన్నంగా ఆక్రమించుకున్నాయి. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు హామీని సైతం తుంగలో తొక్కాయి. దేశంలో వివిధ జాతుల ప్రజలు ఎంతో నెత్తురు ధారపోసిన తర్వాతనే 30 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అనేక చోట్ల ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం 'బలమైన కేంద్ర ప్రభుత్వం', 'దేశ సమైక్యత', 'దేశ సమగ్రత', 'దేశ భద్రత'ల పేరుతో నిరంకుశ పాలనను అమలు చేసింది. సామ్రాజ్యవాద, సీబీబీ, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను నెరవేర్చింది. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు ఏ పార్టీల ప్రభుత్వాలు ఏర్పడినా ఇవే విధానాలను కొనసాగించాయి. భారతదేశం విభిన్న జాతులకు నిలయం కాదనీ, భారతదేశంలో ఉన్నది ఒకే జాతి అనీ, అదే 'హిందూ' జాతి అనీ, హిందూ మతమే సాంస్కృతికంగా ఈ జాతిని సమైక్యం చేసి నిలబెడుతూ వస్తోందనీ, ఈ సాంస్కృతిక జాతీయవాదం ఆధారంగా భారతదేశం ఒకే జాతిని కలిగిన దేశమనీ (సింగిల్ నేషన్ స్టేట్) అంటూ 'అఖండ భారతాన్ని' ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాజకీయ రంగంలో పనిచేయడానికి భారతీయ జనతా పార్టీని ఏర్పరచింది. అది దళారీ పాలకవర్గాల పార్టీగా మొదటి నుండీ ఇందుకు అనుగుణంగా పని చేస్తున్నది. బీజేపీ 2014 మే నెలలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత అది 'వస్తు సేవల పన్ను' (జీఎస్‌టీ) పేరుతో ఆర్థిక ఏకీకరణ సాధించడంలో భాగంగా దేశమంతా ఒకే పన్ను (జీఎస్‌టీ) విధానాన్ని అమలులోకి తెచ్చింది. 'ఒకే దేశం-ఒకే పన్ను విధానం'

నినాదాన్నిచ్చింది. 'ఒకే దేశం–ఒకే రేషన్ కార్డ్'ను నామమాత్రంగానైనా అమలులోకి తెచ్చింది. తన 'అఖండ భారత్' స్థాపన దిశగా అది 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్' నినాదాన్ని ముందుకు తెచ్చింది. ప్రస్తుతం 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' విధానం తెచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంది. అత్యంత అభివృద్ధి నిరోధక, కాలంచెల్లిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు 2047 నాటికి సాధించదలచిన 'నయా భారత్' (న్యూ ఇండియా) అంటే భారతదేశంలోని పీడిత జాతులన్నింటిని అణచివేసే, భారతదేశ రాజ్యాంగంలోని లాంఛనప్రాయమైన ఫెడరల్ స్వభావాన్ని కూడా తొలగించి, పూర్తి యూనిటరీ స్వభావం కలిగిన నిరంకుశ, కేంద్రీకృత, యూనిటరీ లక్షణాలు కలిగిన ఫాసిస్టు దేశంగా మార్చడమే తప్ప మరేమీ కాదు. హిందుత్వ ఫాసిజాన్ని ఆశ్రయించిన సీబీబీ సామ్రాజ్యవాదంతో మిలాఖతయి దేశం మొత్తాన్ని ఏకీకృత మార్కెట్‌గా మార్చివేసేందుకు వేగిరపడుతున్నది.

అందువల్ల దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల స్థాపన కోసమే ఆయా జాతులు సుదీర్ఘ పోరాటాలు చేయాల్సి వచ్చింది. సుదీర్ఘకాలంగా కశ్మీర్, నగా, మణిపుర్, అసోం జాతులు భారతదేశం నుండి విడిపోయే హక్కుతో సహా జాతి ప్రాతిపదికన స్వయంనిర్ణయాధికార హక్కు కోసం పోరాడుతున్నాయి. చారిత్రకంగా గల జాతిపర మూలాలపై ఆధారపడి దేశంలోని చాలా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌తో ఉద్యమాలు తలెత్తుతున్నాయి, కొనసాగుతున్నాయి. ఈశాన్య భారతదేశంలోని వివిధ జాతులు, ప్రాదుర్భావ జాతులు (ఆదివాసీ తెగ సముదాయాలు) తమకు స్వయంపాలన (అటానమి), ప్రత్యేక రాష్ట్రాలు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ వివక్షకు వ్యతిరేకంగా, ప్రాంతీయ వెనుకబాటుతనానికి వ్యతిరేకంగా, రాష్ట్రాలకు అధికారాల పెంపు, నిధుల పెంపు కోసం, అంతర్‌రాష్ట్ర నదీ జలాల న్యాయమైన వాటా కోసం, సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయి.

ఈ డిమాండ్ల సాధన పేరుతో ఆయా రాష్ట్రాలు, ప్రాంతాలలో పలు ప్రాంతీయ పార్టీలు ఏర్పడి, వివిధ సమయాలలో, వివిధ స్థాయిల్లో పోరాటాలు నడిపినప్పటికీ అవి చాలా వరకూ సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను ఈడేర్చేవే కావడంతో జాతుల ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేరలేదు. వివిధ అవకాశవాద రివిజనిస్టు పార్టీలు కూడా వాస్తవానికి జాతుల స్వయంనిర్ణయాధికారానికి వ్యతిరేకమే. ఇవి ప్రధానంగా సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలనే ఈడేర్చుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో వున్నా జాతివిముక్తి పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచుతున్నాయి, తీవ్ర దమనకాండను అమలు చేస్తున్నాయి. వాటిని వేర్పాటు ఉద్యమాలుగా చిత్రించి, వీటికి వ్యతిరేకంగా ప్రజలలో బూర్జువా జాతీయ దురభిమానాన్నీ, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. జాతుల, ప్రాదుర్భావ జాతుల, జాతి మైనారిటీల మధ్య అనైక్యతను, ఘర్షణలను సృష్టిస్తూ విభజించు–పాలించు విధానాన్ని అమలు చేస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రయోజనాలను ఈడేర్చే భారత దళారీ పాలకవర్గాలను కూలదోసి, ప్రతి జాతి విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారం, సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి జాతివిముక్తి పోరాటాలకు కార్మికవర్గ పార్టీ నాయకత్వం వహించడం తప్పనిసరి.

## 9. భారతదేశ పాలకవర్గాల విస్తరణవాదకాంక్ష వెనుక వున్నవి సామ్రాజ్యవాదుల, బ్రాహ్మణీయ హిందుత్వ, పీడక కులాధిత్య సీబీబీ ప్రయోజనాలే

బ్రిటిష్ వలసవాదం మన దేశాన్ని దోచుకునే క్రమంలో, హిందూ మహా సముద్ర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవడం కోసం మన దేశాన్ని ఒక వ్యూహాత్మక ప్రాంతంగా వాడుకుంది. ఇందులో భారతదేశ దళారీ బూర్జువావర్గం కేవలం భారతదేశంలోనే గాక, ఆఫ్రికా, ఆసియాలలో బ్రిటిష్ పాలన కింద వుండిన పలు దేశాలలో కూడా వారికి దళారీగా పని చేసింది. అధికార మార్పిడి తర్వాత భారతదేశ దళారీ పాలకవర్గాలు తమ ఆర్థిక, సైనిక శక్తినీ, రాజకీయ ప్రాబల్యాన్నీ ఉపయోగించి దక్షిణాసియా దేశాలపైన పెత్తనం చెలాయిస్తున్నాయి. భారతదేశ పాలకవర్గాలు దేశంలోని పీడిత జాతులతో పాటు దక్షిణాసియా భూభాగాలనంతటినీ కలిపి 'అఖండ భారతాన్ని' ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నాయి. అవి సామ్రాజ్యవాదం అండతో విస్తరణవాదకాంక్షతో దేశాన్ని ఒక ప్రతిఘాతక దుర్గంగా మార్చివేయడంతో అది దక్షిణాసియాలో శాంతికి ముప్పుగా మారింది. భారతదేశ పాలకవర్గాల విస్తరణవాదకాంక్ష వెనుక వున్నవి సామ్రాజ్యవాదుల, బ్రాహ్మణీయ హిందుత్వ, పీడక కులాధిత్య భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాలే తప్ప మరొకటి కాదు.

మొత్తంగా చూసినప్పుడు, ఈ మూడు దశాబ్దాల కాలంలో ప్రపంచీకరణ ద్వారా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా పథకం ప్రకారం చేస్తున్న దాడి వెనుకబడిన దేశాలపై తీవ్రస్థాయికి చేరుకుంది. భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడిపై ఆధారపడి వుండడం, దాని ప్రయోజనాలతో తమ ప్రయోజనాలు ముడిపడి ఉండడం వలన, దానితో వాటి కుమ్మక్కు మున్నెన్నడూ లేనిస్థాయికి పెరిగిపోయింది. దేశంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలను కాపాడే విధానాలు అమలు జరుపుతూ వచ్చాయి. దేశ బడ్జెట్లలో అధిక భాగం ఎంఎన్‌సీల, భారతదేశ సీబీబీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేటాయిస్తూ వచ్చాయి. మోదీ ప్రభుత్వం గత ప్రభుత్వాల కన్నా అత్యంత వేగంగా వీటిని అమలు చేస్తున్నది. చమురు, అణు ఇంధనం, ఆయుధాలు, యుద్ధ సామగ్రి కోసం ప్రధానంగా దిగుమతుల మీద ఆధారపడుతున్నది. అది చేసే ఉత్పత్తులు, ఎగుమతులు సామ్రాజవాద బహుళజాతి కంపెనీలతో కలిసి ఏర్పరచుకున్న జాయింట్ వెంచర్‌లకు చెందినవీ, ద్వితీయ శ్రేణికి చెందినవే. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అనే పరస్పర విరుద్ధ భావనలను పక్కన పెట్టి ప్రజల్ని మూర్ఖులను చేసే ప్రచారమంతా వారిని భ్రమల్లో ముంచెత్తడానికీ, పక్కదారి పట్టించడానికీ తప్ప మరొకటి కాదు. దేశంలో ప్రముఖ ఆర్థిక కార్యకలాపాలుగా కన్‌స్ట్రక్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ముడి పదార్థాల వెలికితీత (గనులు), సాఫ్ట్‌వేర్, సామ్రాజ్యవాదుల మాన్యుఫాక్చరింగ్ సరుకుల విడిభాగాల అసెంబ్లింగ్, సేవారంగ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దేశం ముడి పదార్థాలను, కొన్ని ముఖ్యమైన వ్యవసాయ సంబంధ శ్రమను, సర్వీసులను ఎగుమతి చేసే ఆర్థిక వ్యవస్థగా మారింది. దేశం నుంచి మేధో శ్రమ, నైపుణ్యం లేని

శ్రమ, అర్ధ నైపుణ్యపు శ్రమ వలస కూడా అధికంగానే ఉంది. సామ్రాజ్యవాద దేశాల నుంచి ప్రధానంగా యంత్రాలను (కాపిటల్ గూడ్స్), చాలా రకాల మాన్యుఫాక్చరింగ్ సరుకులను, టెక్నాలజీని దిగుమతి చేసుకోవడం కొనసాగుతున్నది.

సూపర్ లాభాల వేటలో విదేశీ పెట్టుబడులపై, నూతన టెక్నాలజీపై ఆధారపడి దేశంలో పలు స్టార్టప్ కంపెనీలను స్థాపించడం వలన నూతనంగా పలు శక్తులు దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలలో భాగమయ్యాయి. తమ ప్రాజెక్టుల కోసం ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగ ప్రజల, పట్టణ పేద ప్రజలను బలవంతంగా విస్థాపితం చేయడం సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాగా మారింది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థల ఆధిపత్యం, దేశ సహజ వనరుల దోపిడీ, పీడిత ప్రజల శ్రమశక్తి దోపిడీ, పీడన, అణచివేత, పర్యావరణ విధ్వంసం ఎన్నో రెట్లు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ రుణ పెట్టుబడి ఊబిలో గొంతులోతు కూరుకుపోయింది. అర్ధవలసగా ఉన్న దేశ పరిస్థితి మరింత దిగజారింది. దేశ పరాధీనత పెరిగిపోయింది. ఇది నయావలస తరహా అర్ధవలస దేశం కావడం వల్ల పారిశ్రామిక రంగం సంపూర్ణంగా అభివృద్ధి చెందే అవకాశం లేకపోవడంతో సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల పెట్టుబడి, ముడి సరుకుల, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన మార్పులే జరిగాయి. వారి అభివృద్ధి నిరోధక స్వభావంలో ఎటువంటి మార్పూలేదు.

ఈ విధంగా ప్రపంచీకరణ దశలో ప్రత్యక్ష, పరోక్ష పద్ధతులలో వివిధ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, సంస్థలతో పాటు వాటితో వివిధ రూపాలలో కుమ్మక్కైన దేశీయ దళారీ కార్పొరేట్ కంపెనీలు లక్షల కోట్ల రూపాయలు లాభాలను ఆర్జించాయి/సంపదలను పెంచుకున్నాయి. ఉదాహరణకు, మోదీ ప్రభుత్వ మొదటి ఐదేళ్ల పాలనలో దేశంలోకి 20.30 లక్షల కోట్ల రూపాయలు ఎఫ్‌డీఐ మదుపులు రాగా ఈ కాలంలో ప్రతి సంవత్సరం సుమారు 47.09 లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలు తరలించుకుపోయాయి. ఇలా దళారీ నిరంకుశ బూర్జువావర్గం మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే సాధనంగా ఉంది. అది స్వావలంబన పునాదిగా దేశాన్ని పారిశ్రామీకరించేందుకు వ్యతిరేకం. అది దేశాన్ని రుణగ్రస్తం చేసి సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడీకి నిలయంగా చేసింది. ఈ క్రమంలోనే ప్రపంచీకరణ దశలో భారత దళారీ నిరంకుశ బూర్జువావర్గం సామ్రాజ్యవాదానికి అత్యంత విశ్వసనీయమైన దళారీగా సేవ చేస్తూనే అది అనేక రెట్లు బలపడింది.

సారాంశంలో, సీబీబీకి కులాధారిత భూస్వామ్యంతో వున్న చెక్కు చెదరని రాజకీయ-సాంస్కృతిక బంధాల వల్లనూ, తమ సామాజిక పునాదిగా భూస్వామ్యం తమ మనుగడకు అవసరం కావడం వల్లనూ, స్వభావ రీత్యాను అది సామాజిక ప్రజాస్వామికీకరణకు వ్యతిరేకం. సీబీబీ 'అఖండ భారత్', 'హిందూరాజ్య' స్థాపన లక్ష్యంతో విస్తరణవాద ప్రయోజనాలను కలిగి ఉంది. ఇందులో తమ ప్రయోజనాలు కూడా ఇమిడి ఉండడంతో సామ్రాజ్యవాదం సీబీబీకి చెందిన విస్తరణవాద ప్రయోజనాలను పెంచి పోషిస్తున్నది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాలుగా పిలవబడే

బలగాలలో భాగంగా, భారత పాలకులు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో భారతదేశ సైన్య బలగాలను, అర్ధసైనిక బలగాలను మోహరించడం వెనుక సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చడంతో పాటు, తమ విస్తరణవాద ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నారు. మోదీ పాలనలో చేపట్టిన ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) మొదలైన చర్యలు వీటికి కొనసాగింపే. తద్వారా దళారీ పాలకులు 'భారత జాతి' అనే నినాదాన్ని ఒక పాలసీగా అమలు చేస్తున్నారు. ఒక పక్క పీడిత జాతుల, రాష్ట్రాల ఆకాంక్షలను అణగదొక్కుతూ, మరో వైపు, చరిత్రను వక్రీకరిస్తూ, దేశ ప్రజలను 'హిందుత్వ' భావజాలంతో ముంచేస్తున్నారు. వారు దేశంలో నామమాత్ర పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో ఒక కళగానే అభివృద్ధి చేసారు. ఈ 'ప్రజాస్వామ్యం' నిజానికి నిరంకుశత్వం తప్ప మరొకటి కాదు. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్-బీజేపీ మోదీ నేతృత్వంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు పార్లమెంటు, మెజారిటీ అసెంబ్లీలలో 'మందబలాన్ని' సాధించుకుని, రాజ్య యంత్రాంగాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను ఫాసిస్టీకరిస్తున్నాయి. తమ ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తున్నాయి.

1960, 70లలో సీబీబీ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వైపు బ్యాంకులు, ఇన్సూరెన్స్, బొగ్గు, చమురు రంగాల జాతీయాకరణా, రాజ భరణాల రద్దు, మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలు వృద్ధి చెందడంతో భూస్వామ్య వర్గాలు కొంత బలహీనపడగా, సీబీబీ అభివృద్ధి చెంది సంఘటితపడింది. భూసంస్కరణల ద్వారా కొన్ని చోట్ల భూస్వాముల ఎస్టేట్లను స్వాధీనం చేసుకోవడం, వాటిపై ఆధారపడిన వారి ప్రైవేటు మిల్లులు దెబ్బతినిపోవడం వలన కూడా భూస్వామ్య వర్గం కొంత బలహీనపడింది. ఒక క్రమంలో పాలకవర్గాల కూటమిలో తన ఆధిపత్య స్థానాన్ని, నాయకత్వ పాత్రను భూస్వామ్య వర్గంతో పోల్చితే సీబీబీ మరింతగా సంఘటితపరుచుకుంది. ప్రపంచీకరణ కాలంలో ప్రభుత్వ రంగంలోని భారీ పరిశ్రమల వాటాలను ఎంఎన్సీ, టీఎన్సీలకు, సీబీబీ కార్పొరేట్ కంపెనీలకు కారు చౌక ధరలకు అమ్మివేస్తుండడంతో విదేశీ పెట్టుబడితో పాటు సీబీబీలోని ఒక సెక్షన్ పెట్టుబడి పెరుగుతున్నది. సీబీబీ భూస్వామ్య వర్గంతో మైత్రిని నెరుపుతూ, సామ్రాజ్యవాద ప్రయోజనాలు నేరవేర్చే విధంగా అర్ధభూస్వామ్య సంబంధాలను నూతన రూపాలలో కొనసాగించే పథకాలను ప్రభుత్వం ద్వారా రూపొందించి అమలు చేయించింది. దీంతో భూస్వామ్య దోపిడీ పద్ధతులలో మార్పులు వచ్చాయి. సీబీబీ, ఎంఎన్సీలు గ్రామీణ వ్యవస్థలోకి చొచ్చుకుపోవడానికి ఇది మరింతగా సహాయపడింది. అర్ధభూస్వామ్య సంబంధాలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. భూస్వామ్య ఆధిపత్యపు గత రూపాల స్థానంలో నూతనమైనవి వచ్చాయి. గ్రామాలలో ఇది ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ-సహకార సంస్థ-పంచాయితీ-పోలీసు' వ్యవస్థలు కుమ్మకైన విస్తృత-సమిష్టి రూపం తీసుకుంది. నూతన భూస్వామ్య శక్తుల అభివృద్ధిలో ద్రవ్య పెట్టుబడి కీలకమైన పాత్ర పోషించింది. కాంట్రాక్టు/కార్పొరేట్ వ్యవసాయం విస్తరించింది.

సీబీబీ తన ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం పరిస్థితులకు అనుగుణంగా ఎల్లప్పుడూ మారుతూ వస్తున్నది. దళారీ ప్రభుత్వాలు ప్రత్యేకించి సీబీబీ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రగతిశీలంగా కనిపించే పలు ఆడంబరమైన మార్పులు చేసాయి. అమెరికా, సోవియట్ యూనియన్

(ప్రస్తుతం రష్యా)ల మధ్య, వీటికీ ఇతర (జపాన్, జర్మనీ, బ్రిటిన్, ఫ్రాన్స్, ఇటలీ) సామ్రాజ్యవాద దేశాల మధ్య వున్న వైరుధ్యాలను తమ ప్రయోజనాల కోసం వాడుకున్నాయి. చైనా సోషల్ సామ్రాజ్యవాదులతో సైతం మన దేశ దళారీ ప్రభుత్వాలకు, సీబీబీకీ బలమైన సంబంధాలు కొనసాగుతున్నాయి.

సామ్రాజ్యవాద పెట్టుబడి భారతదేశ పారిశ్రామిక రంగంలో, ఎగుమతులలో, దిగుమతులలో, వ్యాపార లావాదేవీలలో, బీమా రంగంలో ఆధిక్యతలో ఉంది. భారతదేశ దళారీ పాలకులు అమలు చేసిన వివిధ పారిశ్రామిక అభివృద్ధి నమూనాలు సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి, సాంకేతికత, యంత్రాలు, రుణాలు, నిధులు, సహాయంపై భారీగా ఆధారపడి, సామ్రాజ్యవాదులు దేశాన్ని లూటీ చేసేందుకు అనుకూలంగా వారి కనుసన్నల్లోనే రూపొందాయి. భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువావర్గం వ్యాపారం, బ్యాంకింగ్ నేపథ్యాల నుంచి ఉద్భవించడం వల్ల వారికి వాటిపై వున్న ఆసక్తి ఉత్పత్తి రంగంపై లేదు. అధికార మార్పిడికి ముందు, వారి అభివృద్ధి అంతా భూస్వామ్య పాలకులతో మైత్రితోనూ, బ్రిటిష్ సామ్రాజ్యవాద పెట్టుబడితో కుమ్మక్కుతోనూ, దాని ప్రయోజనాలకు అనుగుణంగానూ, అది విధించిన పరిమితులలోను జరిగింది. ఫలితంగా వారు అధికార మార్పిడి అనంతరం కూడా సామ్రాజ్యవాద పెట్టుబడిపై ఆధారపడిన పెట్టుబడి సంచయన విధానాన్ని అనుసరించారు. బహుళజాతి కంపెనీలు భారతదేశంలో తమ శాఖలు, అనుబంధ సంస్థలు నెలకొల్పటంతో పాటు భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గంతో సహకార (కుమ్మక్కు) ఒప్పందాలు కుదుర్చుకుని ఇక్కడ ఉమ్మడి పరిశ్రమలు స్థాపించటం మొదలుపెట్టాయి. సామ్రాజ్యవాద పెట్టుబడి భారతదేశ బడా పెట్టుబడి సన్నిహితంగా కలగలిసిపోవడం మొదలైంది. సాంకేతిక పరిజ్ఞానం, మూలధన వస్తువులు బహుళజాతి సంస్థల చేతిలో ఉండటంతో ఈ ఉమ్మడి పరిశ్రమల్లో భారతదేశ పెట్టుబడి మూలధనం వాటా ఎంత ఉన్నప్పటికీ వాటిపై నియంత్రణ బహుళజాతి కంపెనీల చేతిలోనే వుంటున్నది. దీంతో భారతదేశ సీబీబీకి భారీ జాతీయవాద పారిశ్రామికీకరణ కార్యక్రమాన్ని ముందుకు తెచ్చేందుకు ప్రాతిపదికే లేకుండా పోయింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లోబడి వుండే సంస్కరణలను చేపట్టి విదేశీ పెట్టుబడి, సాంకేతికతలపై ఆధారపడే విధానాన్ని అనుసరించింది. దీంతో విదేశీ సహాయంపై ఆధారపడడం, అంతర్గత బకాయిలు, లోటు ఫైనాన్సింగులు సాధారణమయ్యాయి.

సామ్రాజ్యవాద పెట్టుబడిపై ఆధారపడి వుండడం వలన "లంపెన్ అభివృద్ధి", "వక్రీకరించిన అభివృద్ధి" భారతదేశంలో తీవ్రస్థాయిలో జరుగుతున్నది. అటువంటి అభివృద్ధి వల్ల ప్రధానంగా ప్రయోజనం పొందుతున్నది విదేశీ సామ్రాజ్యవాద గుత్తాధిపత్య సంస్థలూ, భారతదేశ బడా నిరంకుశ దళారీ పెట్టుబడిదారీ వర్గమేననేది స్పష్టం. బహుళజాతి కంపెనీలు ఇక్కడ నెలకొల్పిన వాటి శాఖలు, అనుబంధ సంస్థలు, ఉమ్మడి వ్యాపారాలు (జాయింట్ వెంచర్స్), ఇంకా భారతదేశ బడా నిరంకుశ దళారీ పెట్టుబడిదారులు స్థాపించిన పరిశ్రమలు లేక ప్రభుత్వ పెట్టుబడితో పెట్టిన పరిశ్రమలు అన్నీ యంత్రాలు, పరికరాలు, విడిభాగాలు, పారిశ్రామిక ముడి పదార్థాల కోసం సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడినవే. అవి వీటిని అంతర్జాతీయ ధరల కంటే చాలా ఎక్కువ ధరలకు అమ్ముకునే

దుకాణాలుగా వాడుకుంటున్నాయి. అందువల్ల ఈ సరుకులకు భారతదేశంలోని మార్కెట్ అంతర్గత మార్కెట్‌గా కాక సామ్రాజ్యవాద పెట్టుబడి 'అనుబంధ అంతర్గత మార్కెట్'గా తయారయింది. ఈ 'అభివృద్ధి' దేశ వనరులను బహుళజాతి కంపెనీలు పెద్దమొత్తంలో లూటీ చేసేందుకు దారితీసింది. ఈ 'అభివృద్ధి' వలన సామ్రాజ్యవాద దేశాలు, భారతదేశ దళారులు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు.

సామ్రాజ్యవాద దేశాల నుండి పెద్దెత్తున పెట్టుబడి ఈ దేశంలోకి రావటానికి భారతదేశ బడా దళారీ బూర్జువావర్గం, రాజ్యం మార్గాలుగా వున్నాయి. ఇవి ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ కావడం వల్లనే సామ్రాజ్యవాద దేశాల నుండి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల (ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటివి) నుండి రుణ పెట్టుబడి దేశంలోకి ప్రవేశిస్తున్నది. అది అన్ని రంగాలపై ప్రాబల్యం సంపాదించి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నది, పరాధీన స్థితికి దిగజార్చి వేస్తున్నది. సామ్రాజ్యవాద శక్తులతో సీబీబీకి గల పరిమితమైన బేరాలాడే శక్తి వారికి కొన్ని లాభాలు కొనితేవచ్చు కానీ వారు అప్పటికీ సామ్రాజ్యవాద కాడి కిందనే బందీలుగా వుంటారు. సామ్రాజ్యవాదంపై సీబీబీ మౌలికంగా ఆధారపడి వుండటమే ఇందుకు కారణం. ఈ పరాధీనత వల్ల ప్రజలకు కలిగే నష్టాలు మాత్రం అపారం.

అంతర్జాతీయ, దేశీయ రాజకీయ పరిణామాలపై ఆధారపడి భారతదేశ సీబీబీ విస్తరణవాద ప్రయోజనాలను నెరవేర్చడంలో భాగంగా భారతదేశ ప్రభుత్వం 1973వ సంవత్సరంలో సిక్కింను కబలించి దేశంలో భాగం చేసుకుంది. పాకిస్తాన్‌తో రెండుసార్లు యుద్ధాలు చేసింది. పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్‌ను విడదీసింది. ఈలం సమస్యను పరిష్కరించే సాకుతో శ్రీలంకకు భారతదేశ సైన్యాలను పంపించింది. ఈ విధంగా అది దక్షిణాసియా దేశాలన్నింటి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది, కుట్రలకు పాల్పడుతోంది. అది కేవలం దక్షిణాసియా మార్కెట్ కోసమే కాకుండా సామ్రాజ్యవాదానికి లొంగి ఉంటూనే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో తన పెట్టుబడులను విస్తరింపచేయడానికి ప్రయత్నాలు చేస్తూ వుంది. ఐక్యరాజ్యసమితిలోని భద్రత మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం నిరంతరం ప్రయత్నాలు చేస్తోంది.

## 10. సీబీబీ పట్ల రివిజనిస్టుల, వివిధ ఎం-ఎల్ పార్టీల వైఖరులు

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనంగా ప్రవర్తించింది. దీంతో అది భారతదేశ సమాజపు సరైన అధ్యయనం, పరిశోధనతో వర్గ విశ్లేషణను చేయలేకపోవడంతో సరైన వ్యూహం-ఎత్తుగడలను అవలంబించలేకపోయింది. శత్రువులను, మిత్రులను వేరు చేసి, శత్రువులను ఏకాకులను చేస్తూ మిత్రులందరినీ కలుపుకుపోయి, శత్రువులను ఓడించే ఎత్తుగడలను సృజనాత్మకంగా అభివృద్ధి చేయలేకపోయింది. ఫలితంగా భారతదేశ బడా బూర్జువా వర్గ స్వభావాన్ని జాతీయ స్వభావం కలదిగా భావించింది. జాతీయ విముక్తి పోరాటంలో కదలిన విశాల ప్రజానీకానికి విప్లవకరమైన నాయకత్వాన్ని అందించటానికి బదులు దళారీ బడా బూర్జువా వర్గానికి అంటకాగింది. విప్లవకర నాయకత్వం లేకపోవడంతో సామ్రాజ్యవాదుల, భారతదేశ

బడా పెట్టుబడిదారుల కుతంత్రాలకు ఎదురులేకుండా పోయింది. 1947లో దేశ విభజనకు వారు చేసిన కుట్రను 'ముస్లిం జాతులు' అన్న తప్పుడు భావనతో సీపీఐ పాకిస్తాన్ డిమాండ్‌ను సమర్థించింది. ముస్లిములలో పిడికెడు మంది దళారీ బడా పెట్టుబడిదారులు మాత్రమే పాకిస్తాన్‌ను కోరుతున్నారన్న వాస్తవాన్ని చూడలేకపోయింది. అధికార మార్పిడి తర్వాత కూడా సీపీఐ భారతదేశ రాజ్య స్వభావాన్ని సక్రమంగా అర్థం చేసుకోలేకపోయింది. అందుచేత దళారీ బడా బూర్జువా వర్గపు స్వభావము, పనిచేసే విధానం గురించి తప్పుడు భావాలు విస్తృతంగా వ్యాప్తిలో ఉండినాయి.

సీపీఐ (ఎం) అభిప్రాయం ప్రకారం దళారీలు కేవలం వ్యాపార బూర్జువా వర్గం మాత్రమే. అంటే సామ్రాజ్యవాద బూర్జువా వర్గానికి ముడి పదార్థాలను సమకూర్చటము, దేశీయ మార్కెట్లో వారి వస్తువులను అమ్మటం చేస్తూ వారి ఏజెంట్లుగా వ్యవహరించడమే వారి విధి అనే సాధారణ అభిప్రాయం ఉంది. దీని అర్థం విదేశీ పెట్టుబడికి ఏజెంట్లుగా కేవలం వాణిజ్య రంగంలో పాల్గొనటమే దళారీలను జాతీయ బూర్జువా వర్గం నుండి విడదీసి చూడటానికి ఒక కొలమానంగా చూడబడుతున్నది. ఈ విధంగా పారిశ్రామిక బూర్జువా వర్గాన్ని దళారీ వర్గంగా చూడడం లేదు. సీపీఐ (ఎం) ఇలా పేర్కొన్నది: "ఇక్కడ గుర్తించవలసిన వాస్తవమేమిటంటే ఈ రోజున కొత్త రాజ్యము (భారతదేశ యూనియన్), కొత్త ప్రభుత్వ హయాములో పారిశ్రామిక బడా బూర్జువా వర్గము ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తున్న బలమైన శక్తిగా ముందుకొచ్చింది. కానీ దళారీ వర్గం కాదు" (డైవర్జెంట్ వ్యూస్ బిట్వీన్ అవర్ పార్టీ అండ్ ద సీపీసీ ఆన్ సర్టెన్ ఫండమెంటల్ ఇష్యూస్ ఆఫ్ ప్రోగ్రాం అండ్ పాలిసీ, సీపీఐ (ఎం) కేంద్రకమిటీ ఆమోదించిన తీర్మానం, పీపుల్స్ డెమోక్రసీ, సెప్టెంబర్ 10, 1967 అనుబంధం). సీపీఐ (ఎం) యావత్తు భారతదేశ బూర్జువావర్గాన్ని సామ్రాజ్యవాద ఏజెంట్లుగా పరిగణించదనీ, జాతీయ, ప్రజాస్వామిక విప్లవంలో జాతీయ బూర్జువా వర్గ విప్లవకర పాత్రను గుర్తించడంలో విఫలమైందనీ దీని ద్వారా స్పష్టమవుతోంది. అధికార మార్పిడి తర్వాత దోపిడీ, పీడన, అణచివేతలతో విసిగివేసారి అసంతృప్తితో వున్న విశాల ప్రజానీకానికి అది విప్లవ నాయకత్వాన్ని అందించలేకపోయింది సరికదా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి విద్రోహం చేసింది. ఆ తర్వాత సీపీఐ, సీపీఐ (ఎం)లు పార్లమెంటరీ పంథా చేపట్టి రివిజనిజం, నయారివిజనిజంలో కూరుకుపోయాయి.

ఎంఎల్ ఉద్యమంలోని ఎంఎల్ పార్టీలలో సాధారణంగా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని ప్రభుత్వ రంగంతో సమానం చేయడం అనే తప్పుడు ధోరణి ఉంది. ఇది దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన భావనను దాని రూపాలలో కేవలం ఒకదానికి కుదించివేస్తుంది. పలు ఎంఎల్ పార్టీలు 2వ ప్రపంచ యుద్ధానంతర కాలంలో నిరంకుశ బూర్జువావర్గ పాత్ర బలోపేతమైందనే విషయాన్ని ఆమోదించాయి. సామ్రాజ్యవాద ఆధిపత్య నేపథ్యంలో పెట్టుబడి ప్రాథమిక సంచయనాన్ని ప్రోత్సహించడం కోసం రాజ్యం ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించడం వలన సీబీబీ బలోపేతమయిందని కొన్ని పార్టీలు అభిప్రాయపడినాయి. మరి కొన్ని పార్టీలు ఇది దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం వేళ్లూనుకొనడానికి సంబంధించిన అంశమని వాదించాయి. సామ్రాజ్యవాద రుణ పెట్టుబడితో ఆర్థిక వ్యవస్థలో వృద్ధితో పాటు సీబీబీ ఆవిర్భవించిందని వాటి

అభిప్రాయం. ముఖ్యంగా, సీఆర్‌సీ ఈ వాదనలు ముందుకు తెచ్చింది. వాస్తవానికి, వివిధ దశలలో పీడిత దేశాలకు పెట్టుబడి ఎగుమతి వివిధ రూపాలు తీసుకుంది. కొన్ని సందర్భాలలో అది ప్రత్యక్ష మదుపు రూపంలో ఉండింది, మరికొన్ని సందర్భాలలో పోర్ట్‌ఫోలియో మదుపు (షేర్లు మొదలైన మదుపులు) లేదా రుణాలు, 'సహాయం' రూపంలో అది ఉండింది. అందువల్ల సీఆర్‌సీ నయావలసవాదాన్ని గుణాత్మకంగా నూతన దశగా చెప్పడం, సామ్రాజ్యవాదానికి ఇక ఎంతమాత్రమూ భూస్వామ్యాన్ని తన సామాజిక పునాదిగా పరిరక్షించాల్సిన అవసరం లేదని సూత్రీకరించడం వస్తుగత వాస్తవికతకు విరుద్ధమైనది. 'పెట్టుబడిదారీ అభివృద్ధి', 'సామ్రాజ్యవాదం భూస్వామ్యాన్ని నిర్మూలిస్తున్నది' మొదలైన యావత్తు రివిజనిస్టు, సంస్కరణవాద సిద్ధాంతాలు ఎంఎల్‌ఎం అవగాహనకు భిన్నమైనవి. నయావలసవాదం సామ్రాజ్యవాద ఆధిపత్యం, దోపిడీలలో ఒక నూతన రూపం లేదా పద్ధతి మాత్రమే. ఇందులో ప్రత్యక్ష ఆధిపత్యం, దోపిడీ కాక, పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీ కొనసాగుతాయి. వలసవాద దశలో మాదిరిగానే, నయావలసవాదం కింద కూడా సామ్రాజ్యవాదం భూస్వామ్యాన్ని పరివర్తనకు గురిచేస్తుంది. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం పెంచి పోషించబడుతుంది. సామ్రాజ్యవాదం మరింత మోసపూరితంగా, అభివృద్ధినిరోధకంగా మారుతుంది. అది రివిజనిజాన్ని ఒక ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తుంది.

కొన్ని పార్టీలు దళారీ, నిరంకుశ బూర్జువాలు ఒకే వర్గంగా వ్యవహరిస్తారని పరిగణించాయి. మరికొన్ని వాటిని వేర్వేరు వర్గాలుగా చూస్తాయి. సీపీఐ (ఎం-ఎల్) 1970 8వ కాంగ్రెస్ ఆమోదించిన పార్టీ కార్యక్రమం ప్రభుత్వ రంగాన్ని దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానంగా ప్రత్యేకించి పేర్కొనడాన్ని కొంతమంది ఈ రూపంలోని పెట్టుబడిదారీ విధానం ప్రభుత్వ రంగానికి మాత్రమే వర్తిస్తుందని అర్థం చేసుకున్నారు. నిజానికి, పారిశ్రామిక రంగంలోని పెద్ద ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు రెండూ, అలాగే 'ఆధునీకరించబడినట్లు' కనపడే బడా భూస్వామ్య వర్గం సైతం నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన భావన పరిధిలోకి వస్తాయి.

అలాగే నిరంకుశ పెట్టుబడిదారీ విధానం గురించి మావోయిస్టు భావనను అన్వయించడంలో, అర్ధభూస్వామ్య సంబంధాలలో చోటు చేసుకుంటున్న పరివర్తనల స్వభావాన్ని విశ్లేషించడం, అర్థం చేసుకోవడంలో మరింత సమస్య ఉంది. 1970 పార్టీ కార్యక్రమం భారతదేశంలో 'పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి'ని అర్థం చేసుకోవడంలో విఫలమైందంటూ మార్క్సిస్టు-లెనినిస్టు శిబిరంలోని కొన్ని పార్టీలు "వక్రీకరించిన పెట్టుబడిదారీ విధాన" భావనను తరచుగా వాడుతున్నాయి. ఇది ఒక నిర్దిష్ట రకపు పెట్టుబడిదారీ విధానం అని స్పష్టం చేయడానికి "వక్రీకరించిన" అనే పదాన్ని తరచుగా వాడుతున్నాయి. ఇక్కడ పెంపొందించబడుతున్న పెట్టుబడిదారీ సంబంధాలను కేవలం "వక్రీకరించిన" అని మాత్రమే రాయడం వలన ఉపయోగం అంతగా ఉండదు. ఈ సంబంధాలు పెట్టుబడిదారీ (సామ్రాజ్యవాద) దేశాలలోని సంబంధాల కంటే గుణాత్మకంగా భిన్నమైనవి. ఈ సమస్యలో 'వక్రీకరణ' స్వభావాన్ని వివరించాల్సి ఉంటుంది. ఈ సంబంధాల గురించి సామ్రాజ్యవాదానికి సేవ చేస్తాయనే విషయానికి సంబంధించిన ఒక పార్శ్వం మాత్రమే 'వక్రీకరణ'అనే పదంలో వ్యక్తమవుతుంది.

మావో నిర్వచించినట్లుగా, అది "దేశీయ భూస్వామ్య వర్గం, పాతరకం ధనిక రైతులతో సన్నిహితంగా ముడివేయబడి వుంటుంది" కూడా. మావో సూత్రీకరణలో, నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అంటే "దళారీ, భూస్వామ్య, రాజ్య-గుత్త పెట్టుబడిదారీ విధానమే". సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, రాజ్యం - ఈ మూడింటికి గల సంబంధాన్ని తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలి. ఇందుకు భిన్నంగా కేవలం "వక్రీకరించిన పెట్టుబడిదారీ విధానం" అనే సూత్రీకరణ అసలు విషయంలోని సారాంశాన్ని మరుగుపరుస్తుంది. శాస్త్రీయంగా 'దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం' నియమాన్ని అందించిన మావో సూత్రీకరణను, దాని నిర్వచనాన్నే మనం పునరుద్ఘాటించాలి. 'వక్రీకరించిన పెట్టుబడిదారీ విధానం' గురించి మిగతా ఎంఎల్ పార్టీల వ్యాఖ్యానానికి మన వ్యాఖ్యానానికి తేడా వుంది. మన వ్యాఖ్యానం ప్రకారం వక్రీకరించిన పెట్టుబడిదారీ విధానం అంటే దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానమే. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానపు భావనకు భిన్నంగా 'వక్రీకృత పెట్టుబడిదారీ విధానాన్ని' వ్యాఖ్యానిస్తే రాజకీయ తప్పిదానికి దారితీస్తుంది.

సామ్రాజ్యవాద యుగంలో వలస, అర్ధవలస దేశాలు ఎదుర్కొనే ఇటువంటి ప్రత్యేక సమస్యలను మొట్టమొదటిసారి మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ మావో సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ విజయవంతంగా పరిష్కరించారు. ఆయన ఇలా చెప్పారు: "ఒక దళారీ అంటే దాని అసలు అర్థం ఒక విదేశీ వాణిజ్య సంస్థలో పనిచేసే చైనీయుడైన మేనేజరు లేక ఉద్యోగి. దళారీలు విదేశీ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూ సామ్రాజ్యవాదంతోనూ, విదేశీ పెట్టుబడితోనూ దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నారు" (మావో సే-టుంగ్ సెలెక్టెడ్ వర్క్స్, మొదటి సంపుటి, "ఎనాలిసిస్ ఆఫ్ ది క్లాసెస్ ఇన్ చైనీస్ సొసైటీ" అనే వ్యాసం చివర ఇచ్చిన వివరణ నుంచి).

ఒక వలస లేక అర్ధవలస దేశంలోని బూర్జువా వర్గం గురించి కామ్రేడ్ మావో ఇలా చెప్పారు, "సామ్రాజ్యవాద దేశాలలోని పెట్టుబడిదారులచే పెంచి పోషించబడి వారి ప్రయోజనాలను ప్రత్యక్షంగా నెరవేర్చే వర్గం: గ్రామీణ ప్రాంతాలలోని ఫ్యూడల్ శక్తులతో దానికి అతి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి" (ది చైనీస్ రివల్యూషన్ అండ్ ది చైనీస్ కమ్యూనిస్టు పార్టీ).

అంటే ఒక వలస లేక అర్ధవలస దేశంలోని బూర్జువా వర్గం అది వ్యాపార బూర్జువా వర్గం కానీ పారిశ్రామిక బూర్జువా వర్గం కానీ, సామ్రాజ్యవాద పెట్టుబడికి ప్రత్యక్షంగా సేవ చేస్తూ, స్వదేశానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడీ, పీడనలను తీవ్రతరం చేయటానికి సహాయపడే వర్గం దళారీ బూర్జువా వర్గం.

కామ్రేడ్ మావో బోధనలపై ఆధారపడి, భారతదేశ నిర్దిష్ట అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక పరిస్థితుల్లో భారత పెట్టుబడిదారీ వర్గానికి దళారీ స్వభావం ఉంది అనే సూత్రీకరణను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు), ఎంసీసీ పార్టీలు 1969లోనే గుర్తించాయి. ఈ సూత్రీకరణను 1970లో జరిగిన సీపీఐ (ఎం-ఎల్) 8వ కాంగ్రెస్ ఆమోదించిన పార్టీ కార్యక్రమం-నిబంధనావళిలోనూ, ఎంసీసీ పార్టీ వ్యూహం-ఎత్తుగడలలోనూ పొందపరచడమైంది.

వీటి ప్రకారం భారతదేశంలోని పెట్టుబడిదారీ వర్గంలో రెండు సెక్షన్లు ఉన్నాయి - ఒకటి విదేశీ పెట్టుబడికి ఏజెంటుగా వ్యవహరిస్తూ, విదేశీ పెట్టుబడి ప్రయోజనాలతో తన ప్రయోజనాలు ముడిపడి వున్న బడా దళారీ పెట్టుబడిదారీ వర్గము. రెండవది భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్వతంత్ర అభివృద్ధిని కోరుకునే జాతీయ పెట్టుబడిదారీ వర్గం. అయితే 1947 అగస్టు 15 అధికార మార్పిడితో ఈ దళారీ పెట్టుబడి రాజ్య పెట్టుబడితో కలిసిపోవడంతో బడా దళారీ పెట్టుబడిదారీ వర్గం దళారీ నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గంగా అవతరించింది. ఈ వర్గం బడా భూస్వామ్య వర్గంతో కలిసి రాజ్యాధికారాన్ని చేపట్టిన తర్వాత భారతదేశం అర్థవలస, అర్థభూస్వామ్య ఆర్థిక వ్యవస్థగా మారింది.

పై మూడు దశలలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (సీబీబీ) వర్గం గురించి పరిశీలించిన విషయాలను సంగ్రహించాలనుకున్నప్పుడు మనం సామ్రాజ్యవాదంతో ప్రారంభం కావాలి. ఎందుకంటే, సామ్రాజ్యవాద ప్రాపకంలోనే ఇది పుట్టి పెరిగి వృద్ధి చెందింది. సామ్రాజ్యవాదం లేకుండా దీనికి అస్తిత్వం లేదు. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యంతో పాటు బ్యాంకింగ్, విద్య, వైద్యం, రవాణ, కమ్యూనికేషన్స్ వంటి సేవారంగాలు ముఖ్యమైన రంగాలుగా ఉన్నాయి. 1960ల చివర, 1970ల ప్రారంభంలో అమెరికా సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాల ప్రభుత్వాలకు మూడు ప్రతిఘాతక కర్తవ్యాలను నిర్దేశించింది: 1. నిరంకుశ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి, 2. భూస్వామ్య దళారీ నిరంకుశ రాజ్య పునర్వ్యవస్థీకరణ, 3. విప్లవాన్ని అణచివేయడం. ఇవి సామ్రాజ్యవాద అవసరాలకు అనుగుణంగా స్పందించాయి. సరిగా ఇవే ఎల్ఐసీ పాలసీని రూపొందించడంలో తోడ్పడ్డాయి. ప్రపంచంలో, ముఖ్యంగా పీడిత దేశాలలో ఏం జరుగుతుందన్న దాని గురించి చారిత్రక దృష్టి కోసం, అర్థం చేసుకోవడం కోసం ఇది చాలా ముఖ్యం. వెనుకబడిన దేశాలలో అభివృద్ధి చెందుతున్న 'పెట్టుబడిదారీ విధానం' ఆర్థిక అభివృద్ధికి వ్యక్తీకరణ కాదు. అది సామ్రాజ్యవాదానికి లోబడి వుండే పెట్టుబడిదారీ విధానం. బాహ్య మార్కెట్ల కోసం కొట్లాడుకునే సామ్రాజ్యవాదుల అవసరాన్ని తీరుస్తుంది. పీడిత దేశాలలో పరాధీన పారిశ్రామికీరణను పెంపొందించడం, తద్వారా వారి (నిరంకుశ పెట్టుబడిదారీ విధాన) ప్రయోజనాలను నెరవేర్చుకోవడం, ముఖ్యంగా కారుచౌకగా కాపిటల్ గూడ్స్ పరిశ్రమలను నెలకొల్పేందుకు, అభివృద్ధి చేసేందుకు ఇది తోడ్పడుతుంది. అమెరికా సామ్రాజ్యవాద సంక్షోభం దీనిని ప్రేరేపిస్తుంది. యావత్తు వైరుధ్యాలను పదునెక్కిస్తుంది.

2వ ప్రపంచ యుద్ధంలో ఆధిపత్య సామ్రాజ్యవాద శక్తిగా ఆవిర్భవించిన అమెరికా సామ్రాజ్యవాదం వెనకబడిన దేశాల గ్రామీణ ప్రాంతాలలో తమ పెట్టుబడి చొరబాటుకు అనుగుణంగా ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులను బట్టి భూస్వామ్య విధానాన్ని మలుచుకుంది. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల్లో 'హరిత విప్లవాన్ని' ప్రవేశపెట్టింది. అధిక లాభాలు పొందేందుకు తమ 'టెక్నీషియన్'లను పంపించింది. వ్యవసాయ చట్టాలను ముందుకు తీసుకొని వచ్చింది. వీటినే 'వ్యవసాయ సంస్కరణలు' అన్నారు. ఈ సంస్కరణలు భూస్వామ్య విధానాన్ని సామ్రాజ్యవాద, సీబీబీకి అనుకూలంగా మలుచుకునేవే తప్ప మరొకటి కావు. అందువల్ల నూతన రూపాలలో భూమి సమస్య ముందుకు

వస్తున్నది. దీంతో రైతాంగ ప్రజలపై దోపిడీ, పీడనలు రెట్టింపు అయ్యాయి. భారతదేశ కార్మిక, కర్షక, ఇతర శ్రామిక ప్రజానీకాన్ని దోపిడీ చేసి సంపాదించుకున్న పెట్టుబడి, ఉత్పత్తి సాధనాలు, శ్రమశక్తి సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి, సీబీబీ, భూస్వామ్య రక్తపిపాసుల చేతుల్లో పెట్టుబడిగా సంచయనం అవుతున్నాయి. దీంతో మధ్యతరగతి (పెటీబూర్జువా) ప్రజల, చిన్న, మధ్యతరహా బూర్జువావర్గం (జాతీయ బూర్జువావర్గం) చేతుల్లో పెట్టుబడి సంచయనం కావటం లేదు. అశేష పేద ప్రజానీకం అన్నీ కోల్పోయి, ఉపాధి దొరకక నగరాలలో కిక్కిరిసి చాలీచాలని జీవితాలు వెళ్లదీస్తున్నారు. సామ్రాజ్యవాద పెట్టుబడి ద్వారా పీడిత దేశాలలో 'వృద్ధి' మరింత వెనుకబాటుతనాన్ని, మరింత పీడనను, హింసను కలిగిస్తుంది. కనుక నూతన ప్రజాస్వామిక విప్లవం చేసేందుకు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవడం కీలకం. ఎంఎల్ఎం అనుసరించేవాళ్లంగా నిరంకుశ పెట్టుబడిదారీ విధానం గురించి చర్చించడానికి మనం సామ్రాజ్యవాద ప్రధాన ఆర్థిక లక్షణాలతో ప్రారంభమవుతాం – గుత్తాధిపత్యం, పరాన్నభుక్కు, క్షీణిస్తున్న పెట్టుబడిదారీ విధానం. లెనిన్ పేర్కొన్నట్లు 'సామ్రాజ్యవాద అత్యంత లోతైన ఆర్థిక పునాది గుత్తాధిపత్యం'. దీనిని ద్రవ్య పెట్టుబడి సృష్టిస్తుంది.

మన దేశం సామ్రాజ్యవాద బంధనాలలో అర్ధభూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధాన పీడనలో ఉన్న దేశం. నేటికీ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, ఫ్యూడల్ భూస్వాములు కలిసి మన దేశ పాలకవర్గాలుగా కొనసాగుతున్నారు. అర్ధభూస్వామ్యంలో జరుగుతూ వచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల ఫలితంగా మధ్యయుగాల వరకు కలగలిసిపోయి వుండిన కులం, వర్గం మధ్య అంతరాలు పెరుగుతూ వచ్చినప్పటికీ, సాంప్రదాయ వ్యాపార కులాలయిన బనియాలు, మార్వాడీల నుంచే ప్రధానంగా సీబీబీగా అభివృద్ధి చెందారు. సీబీబీ ప్రాంతీయ, ఇతర జాతిపరమైన గుర్తింపులలో కూడా కులం పట్టుకొని వుంది. ఇది పారిశ్రామిక రంగంపై పీడక కులాలకు చెందిన దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికి గుత్తాధిపత్యం వుందని స్పష్టం చేస్తుంది. అయితే పెట్టుబడి సంచయన క్రమం తీవ్రతరమయ్యే కొలదీ దళారీ బూర్జువా వర్గం మధ్య కులం, జాతి, ప్రాంతం తదితర విభజన రేఖలు క్రమంగా చెరిగిపోతున్నట్లు పైకి కనపడినా అర్ధవలస, అర్ధభూస్వామ్య పునాదిలో, ఉపరితలంలో ఇవి బలంగా పాతుకుపోయి వుండడం వలన ఈ వ్యవస్థను మౌలికంగా మార్చకుండా సారాంశంలో ఈ మార్పు జరిగే అవకాశం లేదు.

అలాగే దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం కేవలం సామ్రాజ్యవాదం, బడా బూర్జువాలకు సంబంధించిన విషయం కాదు. అది బడా భూస్వాములకు కూడా సేవ చేస్తుంది. ఈ మూడు దశలన్నింటిలోనూ విదేశీ పెట్టుబడికి స్వదేశీ మధ్యవర్తిగా పనిచేసే దాని దళారీ స్వభావంలో మార్పు లేదు. దేశ సామాజిక వ్యవస్థలో అనేక రాజకీయ, ఆర్థిక మార్పులు వచ్చినప్పటికీ సామ్రాజ్యవాద పెట్టుబడికి సేవ చేస్తూ, అది దేశంలో చొరబడటానికి, బలపడడానికి ప్రధాన సాధనంగా పనిచేసే సీబీబీ పాత్ర గతంలో లాగే కొనసాగింది. సీబీబీ తన ప్రయోజనాలకు అనుకూలంగా లేనప్పుడు పాత యజమానిని వదిలివేసి కొత్త యజమానికి సేవ చేసేందుకు సిద్ధపడుతుంది. ఇది సామ్రాజ్యవాదానికి లోబడి ఉండే, దానికి సేవచేసే చట్రంలోనే ఉంటుంది.

సామ్రాజ్యవాదం భారతదేశంలో తన అవసరాలకు అనుగుణంగా నిరంతరం అర్ధభూస్వామ్యాన్ని కొన్ని మార్పులకు గురి చేయడం ద్వారా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని వృద్ధి చేయడం ఈ మూడు దశలలోనూ కనపడుతుంది. అది అధికార మార్పిడి తర్వాత తన నయా వలసవాద పరోక్ష పాలనను దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గాల ద్వారా నిర్వహించింది. ఈ మార్పు పెట్టుబడిదారీ విధానం చేత భూస్వామ్యాన్ని స్థానభ్రంశం చేయడం ద్వారా జరిగినది కాదు. ఇది రెండింటినీ పెనవేసింది. అందువల్ల భారతదేశంలో కులాధారిత భూస్వామ్యం నేపథ్యంలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం ద్వారా అర్ధభూస్వామ్య సంబంధాలను నిర్వచించిన విధంగానే ఆ అర్ధభూస్వామ్య సంబంధాల ద్వారా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం గుర్తించబడుతోంది. పరిశ్రమలు, భావజాల రంగం ఈ రెండింటిలోనూ ఇది యథార్థం. భూస్వామ్య వర్గం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులతో కూడిన పాలకవర్గ కూటమిలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారులే (లీడింగ్ రోల్) నాయకత్వంలో ఉన్నారు. ఈ నాయకత్వ పాత్ర దాని మూల లక్షణం. ఈ నాయకత్వ పాత్రను అది తన స్వంత బలంతో సాధించలేదు. కులాధారిత భూస్వామ్యం తన నాయకత్వ పాత్రను వలసవాద సంఘటితీకరణతో కోల్పోయింది. దానిపై నిరంకుశ పెట్టుబడిదారీ విధానం కాక సామ్రాజ్యవాదం ఆధిపత్యం వహిస్తుంది. అయితే ఒక ప్రత్యేక వర్గంగా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం తనదైన ప్రత్యేక ప్రయోజనాలను కలిగి ఉంది. దీని వల్ల దానికి కొన్ని సందర్భాలలో ఏవో కొన్ని సామ్రాజ్యవాద దేశాలతో వైరుధ్యాలు తలెత్తవచ్చు. కానీ మొత్తంగా చూసినప్పుడు అది సామ్రాజ్యవాదం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించలేదు. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ నాయకత్వ పాత్ర పాలకవర్గాల కూటమిలో, విధానాల నిర్ధారణలో దానికి అపరిమిత అధికారాలను లేదా సౌకర్యాలను కల్పించదు. అంతిమంగా సామ్రాజ్యవాదమే వాటిని నిర్ధారిస్తుంది. సామ్రాజ్యవాదానికి అర్ధభూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం రెండింటి అవసరమూ ఉంది. అందువల్ల దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని ముందుకు తీసుకుపోయే దిశలో ప్రభుత్వం (రాజ్యం) తీసుకొనే ప్రతి చర్యలో సామ్రాజ్యవాద అవసరాలకు అనుగుణంగా సీబీబీ, అర్ధభూస్వామ్య బహుళ ప్రయోజనాలు ఇమిడి వుంటాయి.

1920లో లెనిన్ "సామ్రాజ్యవాద శక్తులు ఒక పద్ధతి ప్రకారం సాగించే మోసం" గురించి హెచ్చరించారు. "సామ్రాజ్యవాద శక్తులు రాజకీయంగా స్వతంత్ర రాజ్యాల ముసుగులో ఆర్థికంగా, ద్రవ్యపరంగా, సైనికంగా తమపై పూర్తిగా ఆధారపడిన రాజ్యాలను ఏర్పాటు చేస్తాయి". కామ్రేడ్ లెనిన్ చెప్పిన దాని ప్రకారం అటువంటి ఆధారపడటం యొక్క ఒక రూపమే అర్ధవలస.

లెనిన్, మావోల బోధనల వెలుగులో మనం ఈ మూడు దశలలో క్రోడీకరణగా ఈ కింది విధంగా విశదీకరించవచ్చు. మొదటిది – ఒక అర్ధవలస, లాంఛనప్రాయ స్వతంత్ర రాజ్యం – కాని వాస్తవానికి అది ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా సామ్రాజ్యవాద శక్తులపై ఆధారపడి వుంటుంది. ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలో భాగమైనందున అర్ధవలస దేశంలోని పాలకవర్గాలు ఈ ఆధారపడటాన్ని వదిలించుకోవు. ఎందుకంటే అవి సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడికి సేవ చేయడం ద్వారా మాత్రమే మనగలిగి అభివృద్ధి చెందగలుగుతాయి. రెండవది – అర్ధవలస

దేశం ఏకైక సామ్రాజ్యవాద శక్తి అధీనంలో వున్నది కాదు. ఒకటి కంటే ఎక్కువ సామ్రాజ్యవాద శక్తులు ఆధిపత్యం కోసం పోటీపడే యుద్ధభూమి. ఇది దేశ పాలకవర్గాలకు ఆ సామ్రాజ్యవాద శక్తుల మధ్య బేరసారాలాడటానికి కొంతమేరకు అవకాశం కల్పిస్తుంది. దీనివల్ల వారు స్వతంత్రంగా వున్నట్లు అనిపించవచ్చు కానీ పైకి కనిపించే దానిని వాస్తవంతో గందరగోళపరచకూడదు. మూడవది – ఒక అర్థవలసపై అనేక సామ్రాజ్యవాద శక్తులు కలిగి వుండే అదుపు స్థాయి వారి బలం, చొరబాటు, ఇతర భౌతిక పరిస్థితులను బట్టి ఉంటుంది. వివిధ దశలలో భౌతిక పరిస్థితులలో తేడాలున్నందున సామ్రాజ్యవాద శక్తులు కలిగి వుండే అదుపు స్థాయి కూడా ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండదు. అందువల్ల అనేక సామ్రాజ్యవాద శక్తులు పోటీపడుతున్నప్పుడు, ఒక దశలో ఒకదానికి ఎక్కువ అదుపు ఉండి, తర్వాత దశలో మరొకదానికి అధిక అదుపు ఉండవచ్చు.

మన పార్టీ కేంద్రకమిటీ రూపొందించిన ఎంఓపీ డాక్యుమెంటు (2020) *'దళారీ నిరంకుశ బూర్జువా వర్గం మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే సాధనం'* (214వ పేజీ, 222వ పేజీ) అని చెప్పింది. అయితే భారతదేశ పాలకవర్గాలలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం నాయకత్వ పాత్రను పోషిస్తూ సామ్రాజ్యవాద నిర్దేశిత ఆర్థిక, పారిశ్రామిక విధానాల్ని అనుసరిస్తూ అడవుల కార్పొరేటీకరణ, వ్యవసాయరంగ కార్పొరేటీకరణ, అన్ని రంగాల కార్పొరేటీకరణ చేస్తుండడం వలన దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ దేశ విశాల ప్రజారాసులకూ మధ్య వైరుధ్యం ప్రపంచీకరణ దశలో తీవ్రతరమవుతూ వస్తున్నదనేది స్పష్టం. వీటన్నింటి రీత్యా సీబీబీకి భారతదేశ ప్రజానీకానికి మధ్యనున్న వైరుధ్యాన్ని ప్రముఖ మౌలిక వైరుధ్యాల్లో చేర్చడం అత్యంత అవసరంగా ముందుకు వచ్చింది. అందువల్ల *దళారీ నిరంకుశ బూర్జువా వర్గం మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే ప్రధాన సాధనం (principle vehicle)*గా ఉందని చెప్పడం సరిగా ఉంటుంది. దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి విశాల ప్రజానీకానికి మధ్య వైరుధ్యం సామ్రాజ్యవాదానికి భారత ప్రజలకూ మధ్య; పెట్టుబడికీ శ్రమకూ మధ్య గల రెండు వైరుధ్యాలలోనే అంతర్భాగంగా వుందని చెప్పడం వల్ల స్పష్టత చేకూరదు. భారతదేశ పాలకవర్గాల కూటమికి నాయకత్వం (లీడింగ్ రోల్ నిర్వహిస్తున్న) వహిస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి వున్న ప్రాముఖ్యతనూ, ప్రజా ప్రయోజనాలను సామ్రాజ్యవాదానికి అమ్మేస్తూ దేశ పురోగతికి అవరోధంగా ఉంటూ అది నిర్వహిస్తున్న అత్యంత ప్రతిఘాతక పాత్రనూ వివరించడానికి అది సరిపోదు. భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గం విస్తరణవాద స్వభావాన్ని కలిగి వుంది. సామ్రాజ్యవాదంతో షరీకై భారతదేశంలోని జాతులనే కాక మొత్తం దక్షిణాసియా ప్రాంతంలోని ప్రజానీకాన్ని ప్రత్యక్షంగా పీడించే దోపిడీదారుగా వుంది. దానికి వ్యతిరేకంగా దేశంలోనూ, దక్షిణాసియా ప్రాంతంలోనూ పీడిత ప్రజలు ఇప్పటికే పలు పోరాటాలు చేసారు, చేస్తున్నారు. భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా వర్గం సామ్రాజ్యవాదానికి లోబడి వున్నప్పటికీ అది ఒక విడి వర్గంగా అస్తిత్వంలో ఉందనీ, అది సామ్రాజ్యవాదానికి కేవలం కీలుబొమ్మ కాదనీ, సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తూనే అది తన స్వంత వర్గ ప్రయోజనాలను కూడా ఈడేర్చుకుంటోందనీ దీని ద్వారా స్పష్టమవుతుంది.

ఈ వర్గమే విశాల అర్ధభూస్వామ్య సామాజిక పునాదిని వినియోగించుకుని ప్రజలను బంధనాల్లో

ఉంచుతోంది, తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. వీరు దేశ ద్రోహులుగా, విచ్ఛిన్నకులుగా, ప్రజలకు క్రూరమైన శత్రువులుగా, వంచకులుగా, అబద్ధాలకోరులుగా, అవినీతిపరులుగా, మోసగాళ్లుగా, ప్రజల్ని హత్యలు, ఊచకోతలు కోసేవారుగా, రేపిస్టులుగా రుజువయ్యారు. భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థ సామ్రాజ్యవాదుల, సీబీబీ, బడా భూస్వామ్య వర్గాల దోపిడీ, పాలన, నియంత్రణలకు ఒక సాధనం. ఇది బూటకపు ప్రజాస్వామ్యం. రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలు వారి తొత్తులు తప్ప మరొకటి కాదు.

సామ్రాజ్యవాద పెట్టుబడికి సీబీబీ ప్రధాన వాహకం అని, రాజ్యంలోని సీబీబీ, భూస్వామ్య కూటమిలో సీబీబీ నాయకత్వ పాత్ర పోషిస్తోందని చెప్పడం వలన భారతదేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య స్వభావం మారదు. ఇప్పటికీ ఇది ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం కనుక భూస్వామ్యానికీ విశాల ప్రజారాశులకు మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యంగా ఉంటుంది. సాయుధ వ్యవసాయ విప్లవాన్ని అభివృద్ధి చేయడమే ఈ దశలో కేంద్ర కర్తవ్యంగా ఉంటుంది. దీనితో పాటు, దానిని అభివృద్ధి చేస్తూనే సీబీబీ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని కూడా నిర్మించాలి, కొనసాగించాలి. భూస్వామ్య వ్యతిరేక పోరాటం నుంచి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం అభివృద్ధి చెందుతుందని భావించడం లేదా భూస్వామ్య వ్యతిరేక పోరాటం ఒక స్థాయికి అభివృద్ధి చెందిన తర్వాత దానిని తీసుకోవాలనడం తప్పు అవుతుంది.

అందువల్ల ఈ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో సామ్రాజ్యవాదాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగే విప్లవం జాతీయ విప్లవంగా, అర్ధభూస్వామ్యాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగే విప్లవం ప్రజాస్వామిక విప్లవంగా కొనసాగుతుంది. మూడు పర్వతాలయిన సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్యం భారత విశాల ప్రజానీకానికి లక్ష్యాలుగా వున్నందున సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాలను చేపట్టడం ద్వారా మన దేశంలో విప్లవాన్ని పురోగమింపజేయాలి. కులాధారిత భూస్వామ్యంలో పారిశ్రామిక, వ్యాపార ప్రయోజనాలు వృద్ధి చెందడం లేదా వ్యవసాయ రంగంలో పెద్దెత్తున దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం, బహుళ జాతి కంపెనీలు ప్రవేశించడం భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని ఏ విధంగానూ బలహీనపరచడాన్ని సూచించదు. సాయుధ వ్యవసాయక విప్లవ కేంద్రీయతను ఏ విధంగానూ స్థానభ్రంశం చేయడాన్ని సూచించదు. కనుక భూస్వామ్యానికీ, విశాల ప్రజారాసులకు మధ్య వైరుధ్యమే ప్రధాన వైరుధ్యంగా కొనసాగుతుంది. కానీ ఈ మార్పులు వ్యవసాయ విప్లవంలో నూతన కోణాల ఆవిర్భావాన్ని తప్పనిసరిగా సూచిస్తాయి. వ్యవసాయంలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధాన నిర్దిష్ట రూపాలను, ఉనికిలో వున్న కులాధారిత భూస్వామ్య సంబంధాల నిర్దిష్ట వ్యక్తీకరణలను గుర్తించి వాటికి వ్యతిరేకంగా నిర్దిష్ట పోరాట, నిర్మాణ రూపాలను ముందుకు తేవడం అవసరం.

1970లో జరిగిన మన పార్టీ 8వ కాంగ్రెస్ మౌలికంగా సరిగానే భారతదేశంలోని ఉత్పత్తి సంబంధాలను–వర్గ సంబంధాలను విశ్లేషించి వాటి ఆధారంగా భారత విప్లవోద్యమానికి సరైన మౌలిక విప్లవ పంథాను/సాధారణ పంథాను (బేసిక్ రెవెల్యూషనరి లైన్/జనరల్ లైన్)

రూపొందించింది. దాని ఆధారంగానే మనం భారతదేశ విప్లవోద్యమాన్ని నేటి స్థితికి అభివృద్ధి చేసాం. అయితే అది దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాన్ని (సీబీబీ) ప్రత్యేక ప్రతిపత్తి (డిస్టింక్ట్ క్లాసు) కలిగిన వర్గంగా గుర్తించలేదు. దీంతో 1970 నుండి నేటివరకు మనం దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ విశాల ప్రజానీకానికి మధ్యగల వైరుధ్యాన్ని ప్రముఖ వైరుధ్యంగా గానీ, మౌలిక వైరుధ్యంగా గానీ గుర్తించలేదు. ఈ వైరుధ్యం సామ్రాజ్యవాదానికీ భారతదేశ ప్రజలకు మధ్యగల వైరుధ్యంలోనూ, పెట్టుబడికి శ్రమకు మధ్యగల వైరుధ్యంలోనూ అంతర్గర్భితమయ్యే ఉంటుందనే అవగాహన మనలో కొనసాగుతూ వచ్చింది. దీంతో ఒక వైపు సీబీబీకున్న ప్రత్యేక ప్రతిపత్తిని గుర్తించ నిరాకరిస్తూనే, మరోవైపు కూలదోయాల్సిన టార్గెట్‌లలో ఒకటిగా చెపుతూ వచ్చాం. ఇది పరస్పర వైరుధ్యపూరిత అంశం. భారతదేశంలోని ఉత్పత్తి సంబంధాల ప్రకారం చూస్తే పారిశ్రామిక, సేవా, వ్యవసాయ రంగాల్లో సీబీబీకి అపారమైన ఉత్పత్తి సాధనాలపైన యాజమాన్యం/అధికారం ఉంది. దాని ఆధారంగా అది భారతదేశ శ్రమజీవులతో ఉత్పత్తి చేయించి, ఉత్పాదితాలను కైవసం చేసుకుంటోంది. ఈ క్రమంలో అది సామ్రాజ్యవాద పెట్టుబడులకు ప్రధాన వాహకంగా, సేవకురాలుగా ఉంది. అందుకే దానికి స్వతంత్రత లేదు అంటున్నాం. స్వతంత్రత లేకపోవడం వేరు, విడిగా ఒక వర్గంగా ఉనికిలో ఉండడం వేరు. మన దేశంలోని పారిశ్రామిక, సేవా రంగాల్లో, వ్యవసాయిక రంగంలోని కొన్ని పరిశ్రమల్లో, కొన్ని యూనిట్లలో, కొన్ని వ్యవసాయ క్షేత్రాల్లో, కొన్ని ప్లాంటేషన్లలో సామ్రాజ్యవాద, ఎంఎన్‌సీ–టీఎన్‌సీ పెట్టుబడులు 20 శాతం నుండి 100 శాతం ఉన్నప్పటికీ కొన్నింటిలో సీబీబీ పెట్టుబడులు కూడా 20 శాతం నుండి 100 శాతం వరకున్నాయి. వీటి ఆధారంగా సీబీబీ స్వతంత్ర వర్గం కాదని చెప్పడంతో పాటు విడిగా ఉనికిలో ఉన్న వర్గమని కూడా చెప్పడం అవసరం.

వలస, అర్ధభూస్వామ్య, నయావలస, అర్ధభూస్వామ్య దేశాల్లోని భూస్వామ్య వర్గం కూడా సామ్రాజ్యవాదానికి లోబడే ఉంటుంది. అది కూడా సామ్రాజ్యవాద పెట్టుబడికి వాహకంగా, సేవకురాలిగా ఉంటుంది. అయితే భూస్వామ్య వర్గాన్ని మనం విడి వర్గంగా గుర్తించాం. దాన్ని వెన్నంటి దాన్ని విప్లవ లక్ష్యాల్లో (టార్గెట్స్) ఒకటిగా చేర్చాం. భూస్వామ్య వర్గం స్వతంత్రమైంది కానప్పటికీ దాన్ని విడి వర్గంగా గుర్తించినట్లే సీబీబీని కూడా విడి వర్గంగా గుర్తించడం అవసరం.

సీబీబీ విషయంలో మావో చెప్పిన మౌలిక సిద్ధాంతాన్ని భారతదేశ విప్లవానికి సృజనాత్మకంగా అన్వయించడంలో మనలో అస్పష్టత, యాంత్రికత, పిడివాదం కొనసాగుతూ వచ్చాయి. ఫలితంగా రాజకీయ రంగంలో సీబీబీకి వ్యతిరేకంగా జాతీయ బూర్జువాజీ సహ మిగతా పీడిత వర్గాలను కలుపుకుని వ్యూహాత్మక, ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనలను ఏర్పాటు చేయాల్సిన రాజకీయ కృషి పట్ల శ్రద్ధ పెట్టని స్థితికి, దీర్ఘకాల రాజకీయ తప్పిదానికి దారితీసింది. దాని ఫలితంగా భూస్వామ్యానికి అశేష ప్రజానీకానికి మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యం అనేదాన్ని కూడా యాంత్రికంగా అర్థం చేసుకుని రైతాంగ ప్రజల్లో, ఆదివాసీ ప్రజల్లో చేసే విప్లవ కృషి ప్రధానమనే పేరుతో మిగతా వాటి పట్ల శ్రద్ధ పెట్టని జడతార్కిక అవగాహనకు గురయ్యాం. ఫలితంగా మనం పట్టణాల్లో, మైదానాల్లో చేసే రాజకీయ, నిర్మాణ కృషికి తగిన ప్రాధాన్యతనివ్వలేకపోయాం.

సామ్రాజ్యవాదపు అస్తిత్వానికి వలసలు ముఖ్యమైన షరతులు. అందుకే సామ్రాజ్యవాదం ఉనికిలో ఉన్నంతకాలం ప్రపంచంలోని వెనకబడిన దేశాలు లేదా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు సామ్రాజ్యవాదానికి వలసలు గానో, అర్ధవలసలు గానో, నయావలసలు గానో వుండక తప్పదు. ప్రస్తుతం సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న నయావలస విధానంలో భాగంగా ఈ దేశాలు అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశాలుగా ఉన్నాయి. కాబట్టి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాదాన్ని కూలదోయకుండా స్వతంత్ర జాతీయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాదు. అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశాల్లో సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, భూస్వామ్యాన్ని కూలదోసే/నిర్మూలించే నూతన ప్రజాస్వామిక విప్లవం జరగనంతకాలం ఆ దేశాల్లో భూమి సమస్య పరిష్కరించబడదు, ప్రజాస్వామ్యం స్థాపించబడదు, జాతీయ విముక్తి జరగదు. కాబట్టి భూమి సమస్యను పరిష్కరించి, ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి, జాతీయ విముక్తిని సాధించే వరకు ఆ దేశాల విప్లవాల స్వభావం నూతన ప్రజాస్వామికమే/జాతీయ ప్రజాస్వామికమే. అది సోషలిస్టు విప్లవం కాదు. నూతన ప్రజాస్వామిక విప్లవంలో సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్యం కూలదోయాల్సిన టార్గెట్స్‌గా ఉంటాయి. కాబట్టి ఈ దేశాల్లో సామ్రాజ్యవాదానికీ ఆ దేశ ప్రజానీకానికి మధ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ విశాల ప్రజలకు మధ్య, భూస్వామ్యానికీ విశాల ప్రజానీకానికి మధ్య వుండే వైరుధ్యాలు మౌలిక వైరుధ్యాలుగా ఉంటాయి. వీటిలో ప్రస్తుతం భూస్వామ్యానికి అశేష ప్రజానీకానికి మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యంగా వుంటుంది.

అందువలన భారతదేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య ఆర్థిక వ్యవస్థలో జరిగిన మార్పులను, అందులో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ నాయకత్వ పాత్రను దృష్టిలో ఉంచుకొని, 'భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం' అనే డాక్యుమెంటులో పేర్కొన్న విధంగా గ్రామీణ ప్రాంతాల్లో "దున్నేవారికే భూమి చెందాలి, విప్లవ రైతాంగ కమిటీలు/రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు, సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థల, పెట్టుబడిదారీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల వ్యవసాయ క్షేత్రాలను, ప్లాంటేషన్లను ప్రజాపరం చేయండి, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం పోరాడండి" అనే ప్రధాన నినాదంపై కేంద్రీకరించి వర్గ పోరాటాలను అభివృద్ధి చేయాలి. దీనితో పాటు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా నాలుగు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల, పీడిత జాతులకు చెందిన విశాల ప్రజారాసులను సమీకరించడం కోసం దేశవ్యాప్త ప్రజాస్వామిక ఐక్యసంఘటనను నిర్మించాలి. ఈ ఐక్యసంఘటన నిర్దిష్ట రాజకీయ కార్యక్రమంతో పనిచేయాలి.

దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా విశాల భారత ప్రజల పోరాట లక్ష్యం ప్రధానంగా నాలుగు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల, పీడిత జాతుల ప్రయోజనాల పరిరక్షణే. సీబీబీకి వ్యతిరేకంగా పోరాటం సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటం ఒకే సమయంలో విడదీయలేనంతగా సమైక్యమై కొనసాగుతాయి. ఈ పోరాటాల లక్ష్యం ఇదే. ఇవన్నీ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగమే. దేశంలో జాతులకు విడిపోయే హక్కుతో సహా

స్వయంనిర్ణయాధికారాన్ని కల్పిస్తూ, జాతుల సర్వతోముఖాభివృద్ధికి గ్యారంటీ కల్పిస్తూ, ఫెడరల్ సూత్రంపై ఆధారపడిన స్వతంత్ర, స్వావలంబ నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ స్థాపించడం ద్వారా మాత్రమే ఆ పోరాటాలు తమ లక్ష్యాన్ని సాధించగలుగుతాయి. ఈ లక్ష్యసాధనకు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక-కర్షక మైత్రిపై ఆధారపడి నాలుగు విప్లవ వర్గాలను ఐక్యం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం తప్ప మరో మార్గం లేదు.

దేశంలో 'ప్రపంచీకరణ' దాడి వల్ల తీవ్రంగా దెబ్బతింటున్న యావత్తు పీడిత వర్గాలు, సెక్షన్లు, పీడిత జాతులు నూతన ప్రజాస్వామిక స్వావలంబ ఆర్థిక వ్యవస్థ కోసం మూడు మహా పర్వతాలకు వ్యతిరేకంగా కొనసాగే పోరాటంలో ప్రధాన శక్తులు అవుతాయి. ఇందులో నాలుగు పీడిత వర్గాల అంటే కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలూ, దళిత, ఆదివాసీ, మహిళలు, మత మైనారిటీలు తదితర పీడిత సెక్షన్లూ, కశ్మీర్, నగా, మిజో, మణిపురీ, అసోంతో పాటు దేశంలోని పీడిత జాతులన్నీ ఉంటాయి. వీరిని తమ డిమాండ్లపై ప్రచారం, ఆందోళన, వర్గ పోరాటం అనే ప్రక్రియల ద్వారా సమీకరించాలి. చట్టబద్ధ-చట్టవ్యతిరేక, బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాలను సమన్వయిస్తూ ప్రజా పోరాటాల, ప్రతిఘటనా పోరాటాల వెల్లువను సృష్టించాలి.

ఇందుకోసం 1947కు ముందు పోరాటాలలో కాంగ్రెస్, సీపీఐల నాయకత్వాల విద్రోహాల నుంచి గుణపాఠాలు తీసుకుని నిజమైన స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించాలి. తద్వారా మాత్రమే దేశానికి సామ్రాజ్యవాద కబంధ హస్తాల నుంచి, యావత్తు అభివృద్ధి నిరోధకుల నుంచి – ప్రత్యేకించి దేశంలో అభివృద్ధి నిరోధకత్వాన్ని పరిరక్షిస్తున్న విశాల గ్రామీణ ప్రాంతంలోని అర్ధభూస్వామ్య స్తబ్ధత నుంచి స్వేచ్ఛ లభిస్తుంది.

నూతన ప్రజాస్వామిక స్వావలంబ వ్యవస్థ సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువావర్గానికి చెందిన అన్ని పరిశ్రమలను, బ్యాంకులను, ఇతర సంస్థలను స్వాధీనం చేసుకుంటుంది. సామ్రాజ్యవాదులకు చెల్లించాల్సిన అప్పులన్నీ రద్దు చేస్తుంది. చిన్న పరిశ్రమల్ని సంరక్షించి, మధ్యతరహా పరిశ్రమల్ని అదుపు చేసి, క్రమబద్ధీకరిస్తుంది. భూస్వాముల భూములన్నీ స్వాధీనం చేసుకుని పేద, భూమిలేని రైతాంగానికి పంచుతుంది. రైతాంగంపై వడ్డీ వ్యాపారులు, వ్యాపారులు సాగించే దోపిడీని అంతం చేస్తుంది. తద్వారా దేశంలో కార్మికులు, అర్ధ-కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్యతరగతితో సహా యావత్తు పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల విముక్తికి మార్గాన్ని సుగమం చేస్తుంది. ఒక స్వావలంబ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత దోపిడీ వ్యవస్థకు భిన్నంగా రెండు మౌలిక అంశాలను కలిగి ఉంటుంది:

మొదటిది, ఉత్పత్తులకు దేశీయ మార్కెట్‌ను విస్తరించడం ద్వారా పునాది స్థాయిలో దేశ పారిశ్రామికీకరణకు మార్గం సుగమం చేస్తుంది. విశాల ప్రజారాశుల కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా మాత్రమే ఇది సాధ్యం. వీరిలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కాలంచెల్లిన, వెనుకబడిన అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలను ధ్వంసం

చేయడం ద్వారా మాత్రమే దీన్ని సాధించడం సాధ్యమవుతుంది. ఈ పాత ఉత్పత్తి సంబంధాలే ప్రజల దారిద్ర్యానికి ప్రధాన కారణం. ఈ వెనుకబాటుతనం నుంచి ప్రజలు విముక్తి అయితే, నూతన ప్రజాస్వామిక ప్రభుత్వం వ్యవసాయంలో భారీగా మదుపు పెడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థకు ఒక చోదకశక్తి సృష్టించబడుతుంది. దిగుమతులపై ఎంతమాత్రమూ ఆధారపడాల్సిన అవసరం వుండదు. మార్కెట్ కోసం ధనికవర్గపు వినిమయ రూపాలపై ఆధారపడాల్సిన అవసరం వుండదు.

రెండవది, విదేశాల నుంచి వచ్చే భారీ పెట్టుబడులకు ముగింపు పలకడం. మనం యావత్తు విదేశీ కార్పొరేట్/దళారీ పెట్టుబడిని స్వాధీనం చేసుకుంటే, భవిష్యత్తులో దేశంలోకి నూతన పెట్టుబడి ప్రవేశించకపోయినప్పటికీ దేశానికి పెద్ద విపత్తు ఏదీ రాదు.

అటువంటి ఆర్థిక వ్యవస్థ స్వంతకాళ్లపై ఆధారపడేదిగా ఉంటుంది. సామ్రాజ్యవాదులకు కాకుండా, దేశానికి ప్రయోజనం చేకూర్చే విధానాలను రూపొందించి అమలు చేస్తుంది. భారతదేశం 140 కోట్ల జనాభా కలిగిన పెద్ద దేశం. దానికి పెద్దెత్తున సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నాయి. అటువంటి భారీ దేశపు ప్రజలు ప్రస్తుత వ్యవస్థ బంధనాల నుంచి బయటపడితే ఆ దేశం అభివృద్ధి చెందటానికీ, వృద్ధి సాధించటానికీ ఎటువంటి సమస్య ఉండదు.

## 11. మన రాజకీయ కార్యక్రమం

భారతదేశ భూస్వామ్యం కులాధారిత భూస్వామ్యం. ఇది భారతదేశ సమాజపు ప్రత్యేకత (పర్టికులారిటి). ఇది పునాదిలో ఉంది, ఉపరితలంలో ఉంది. ఈ కులాధారిత భూస్వామ్యం భారత సామాజిక జీవితానికి చెందిన సకల రంగాలను ప్రభావితం చేస్తుంది. ఈ ప్రత్యేకత ఫలితంగానే శూద్ర కులాలకు చెందిన చేతివృత్తుల వాళ్లు వ్యాపార రంగంలో గానీ, వాణిజ్య రంగంలో గానీ, బ్యాంకింగ్ రంగంలో గానీ, పారిశ్రామిక రంగంలో గానీ పెట్టుబడిదార్లుగా ఎదగలేకపోయారు. భారతదేశపు సీబీబీలోని అత్యధికులు బనియా (వైశ్య) కులాలకు చెందిన వాళ్లే. భారత సీబీబీకున్న ఈ ప్రత్యేకతను మనం ఈ డాక్యుమెంట్‌లో గుర్తించాం. సీబీబీకున్న వర్గ స్వభావాన్ని గుర్తించే సాధారణత్వం (జనరాలిటీ)తో పాటు దానికున్న కుల స్వభావాన్ని గుర్తించే ప్రత్యేకత (పర్టికులారిటీ)ని కూడా గుర్తించాం. అలాగే దానికున్న విస్తరణవాదమనే నిర్దిష్టతను కూడా గుర్తించాం. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాకు చెందిన అత్యధిక దేశాల్లోని సీబీబీకన్నా ప్రత్యేకించి దక్షిణాసియా దేశాల సీబీబీకన్నా భారత సీబీబీ సాపేక్షికంగా బలమైంది. వీటి అన్నింటి ఆధారంగా సీబీబీకి వ్యతిరేకంగా మన రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకుందాం.

భారతదేశ సీబీబీ గురించి సమగ్రమైన అధ్యయనం చేసి, దాన్ని ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన వర్గంగా గుర్తించి, దానికి విశాల ప్రజారాశులకున్న వైరుధ్యాన్ని మౌలిక వైరుధ్యంగా చేర్చడంతో మన విప్లవ ఎత్తుగడల్లో జరిగే మార్పుల గురించి చెప్పుకుందాం.

మొదటి మార్పు, మనం ఇప్పటివరకు పేర్కొంటూ వచ్చిన పెట్టుబడికి శ్రమకు మధ్య వైరుధ్యాన్ని ప్రముఖ వైరుధ్యాల నుండి తొలగించాల్సి ఉంటుంది. కామ్రేడ్ మావో బోధన ప్రకారం మౌలిక వైరుధ్యాలు ఒక వస్తువు లేదా క్రమం యొక్క అంతస్సారాన్ని లేదా స్వభావాన్ని నిర్ణయిస్తాయి. ఈ

మౌలిక వైరుధ్యాల పరిష్కారం ద్వారానే నిర్ణీత వస్తువు లేదా క్రమం యొక్క అంతస్సారాన్ని లేదా స్వభావాన్ని మార్చగలుగుతాం. అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజంలో భారత ప్రజలు భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అనే మూడు పెద్ద పర్వతాల కింద నలిగిపోతున్నారు. అందువల్లనే మనం ఆ మూడింటిని నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో కూలదోయవలసిన లక్ష్యాలుగా గుర్తించాం. దాని ప్రకారం పెట్టుబడికి శ్రమకు మధ్యనున్న వైరుధ్యాన్ని మౌలిక వైరుధ్యంగా చేర్చకుండా ప్రముఖ వైరుధ్యాల్లో చేర్చినప్పటికీ పెట్టుబడికి శ్రమకు మధ్యనున్న వైరుధ్యాన్ని మనం నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో పరిష్కరించలేం. నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో సామ్రాజ్యవాదాన్ని, దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయాల్సిన టార్గెట్టుగా గుర్తించి భారత ప్రజానీకంపై సామ్రాజ్యవాద పెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపు పెట్టుబడి చేసే దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్థితిలో పెట్టుబడికి శ్రమకు మధ్య వైరుధ్యాన్ని విడిగా ప్రముఖ వైరుధ్యంగా పేర్కొంటే అది జాతీయ పెట్టుబడిదార్లను టార్గెట్ చేయడానికి దారితీస్తుంది. నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో మనం జాతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని టార్గెట్ చేయం (కూలదోయం), చేయకూడదు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం తర్వాత దేశీయ/జాతీయ ఆర్థిక వ్యవస్థను (domestic/national economy)ని అభివృద్ధి చేయడంలో భాగంగా జాతీయ పెట్టుబడిదారీ వర్గానికి స్థానం కల్పిస్తాం.

రెండో మార్పు, సీబీబీని మౌలిక వైరుధ్యాల్లో చేర్చడం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో మనం కూలదోయాల్సిన సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా కార్మికులను, రైతాంగాన్ని, పెటీబూర్జువాలను/మధ్యతరగతిని, జాతీయ పెట్టుబడిదార్లను వ్యూహాత్మక ఐక్యసంఘటనలో, ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనలో కూడగట్టే రాజకీయ కృషిని తీవ్రతరం చేస్తాం/చేయాలి.

మూడో మార్పు, ప్రస్తుతం దేశవ్యాప్తంగా పారిశ్రామిక, సేవా రంగాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోకి, అటవీ ప్రాంతాల్లోకి సామ్రాజ్యవాద పెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడి పెద్దఎత్తున చొరబడి ప్రాకృతిక సంపదలను లూటీ చేస్తున్నందునా ఆ రెండింటికి వ్యతిరేకంగా/వాటిని టార్గెట్ చేస్తూ రాజకీయ నినాదాల్ని రూపొందించడానికి, వాటికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని, ఐక్యసంఘటనా కృషిని తీవ్రతరం చేయడానికి ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 'అటవీ ప్రాంత ప్రాకృతిక వనరులను దోచుకోవడానికి వస్తున్న దేశ, విదేశీ కార్పొరేట్లను తన్నితరమండి', 'దేశ ప్రాకృతిక వనరులను/సంపదలను కాపాడుకోండి/కాపాడుకుందాం' అని స్పష్టంగా నినాదం ఇస్తాం. అలాగే 'దేశ వ్యవసాయరంగ కార్పొరేటీకరణను తిప్పికొట్టండి', 'దేశ రైతాంగ భూముల్ని దోచుకెళ్తున్న సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని తన్ని తరమండి, పంట భూముల్ని కాపాడుకోండి' అని స్పష్టంగా నినాదం ఇస్తాం.

నాలుగవ మార్పు, సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడపడమంటే కేవలం పారిశ్రామిక, సేవా రంగాల్లోనే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా (మైదాన, అటవీ ప్రాంతాల్లో) వాటికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడపడం అనే స్పష్టత

ఏర్పడుతుంది. అలాగే కేవలం ఆర్థిక రంగంలోనే కాదు ఏకకాలంలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో లేదా సామాజిక జీవితానికి చెందిన సకల రంగాల్లో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడపాలనే స్పష్టత ఏర్పడుతుంది.

సీబీబీ వ్యతిరేక పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం. కాబట్టి దేశంలోని పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో సామాజిక జీవితానికి చెందిన సకల రంగాల్లో సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ, భూస్వామ్యానికి వ్యతిరేకంగా/ఆ మూడింటి కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయడానికి తోడ్పడేలా మన రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకుందాం. 'భారతదేశ ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం'/ కేంద్ర ఎమ్ఓపీ డాక్యుమెంట్ ప్రకారం దేశంలోని 7 కేటగిరిలకు వర్తించేలా ఈ రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకుందాం. కేంద్ర ఎమ్ఓపీ గుర్తించిన 7 కేటగిరి ప్రాంతాలు:

1. ఇప్పటికీ అర్ధభూస్వామ్యం బలంగా వున్న ప్రాంతాలు.
2. వర్గపోరాటం ఫలితంగా అర్ధభూస్వామ్యం బలహీనపడిన ప్రాంతాలు.
3. వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలున్న ప్రాంతాలు.
4. ప్లాంటేషన్స్ ప్రధానంగా వున్న ప్రాంతాలు.
5. నగర ఆర్థిక జీవితంలో విడదీయరానంతగా ముడిపడిన నగరశివారు (సబర్బన్) ప్రాంతాలు.
6. కొండలు, గుట్టలు, అడవులతో వున్న ఆదివాసీ ప్రాంతాలు.
7. సముద్రతీర ప్రాంతాలు.

దేశంలోని అసమానాభివృద్ధిని అనుసరించి ఆయా ప్రాంతాల నిర్దిష్టతల, ప్రత్యేకతల ఆధారంగా వర్గపోరాటాన్ని నడపడం కోసం, ఆయా ప్రాంతాల్లోని ప్రధాన శత్రువులకు వ్యతిరేకంగా ఐక్యసంఘటనను నిర్మించి వర్గపోరాటాన్ని నడపడం కోసం ఈ కేటగిరిలను మనం గుర్తించాం.

వర్గ వైరుధ్యాలు తీవ్రంగా వుండి అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాల్లో 'దున్నేవారికే భూమి చెందాలి' అనేది ప్రధాన నినాదంగా వుంటుంది. అయితే ఈ ప్రాంతాల్లో అర్ధభూస్వామ్యాన్ని ప్రధానంగా టార్గెట్ చేస్తూనే సామ్రాజ్యవాద, సీబీబీ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా కూడా పోరాటాన్ని కొనసాగించాలి.

అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడిన ప్రాంతాల్లో, వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాల్లో 'సామ్రాజ్యవాద, సీబీబీకి చెందిన పెట్టుబడిదారీ భూస్వాములకు చెందిన వ్యవసాయ క్షేత్రాలను ప్రజలపరం చేయండి (జాతీయం చేయండి)' అనేది ప్రధాన నినాదంగా వుంటుంది.

మన దేశంలో టీ, కాఫీ, రబ్బరు, వక్కపొడి, మసాల దినుసుల ప్లాంటేషన్స్ అన్నీ దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు చెందినవే. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అటవీశాఖ ఆధ్వర్యంలో దేశ, విదేశీ కార్పొరేట్లకు ప్రయోజనాల్ని చేకూర్చడం కోసం టేకు, రబ్బరు, యూకలిప్టస్ తదితర ప్లాంటేషన్లను పెంచుతున్నారు. ఈ స్థితిలో ప్లాంటేషన్స్ ప్రధానంగా వున్న ప్రాంతాల్లో 'దేశ, విదేశీ

కార్పొరేట్ల ప్లాంటేషన్లను, ప్రభుత్వ ప్లాంటేషన్లను ప్రజలపరం/జాతీయం చేయండి' అనే నినాదంతో వర్గపోరాటాన్ని నడపాలి.

నగర శివారు (సబర్బన్) ప్రాంతాల ఆర్థిక జీవితం పరిసర నగరాలతో/పట్టణాలతో ముడిపడి వుంటుంది. అంటే, ఈ ప్రాంత ప్రజానీకంలో అత్యధికులు లేదా గణనీయమైన సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అసంఘటిత కార్మికులుగా (కాంట్రాక్టు, కాజువల్) పని చేస్తున్నారు. మరి కొద్దిమంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పర్మనెంట్ ఉద్యోగులుగా, కార్మికులుగా పని చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ మాఫియాల, రకరకాల మాఫియాల దోపిడీ, పీడనలు, సామ్రాజ్యవాద, సీబీబీ కార్పొరేట్ల దోపిడీ, పీడనలు పెరుగుతున్నాయి. కాబట్టి ఈ ప్రాంతాల్లో 'ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కాంట్రాక్టు, కాజువల్ వ్యవస్థను రద్దు చేయాలి', 'కార్మికులకు, ఉద్యోగులకు పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలి', 'స్వంత ఆస్తులను కాపాడుకుందాం', 'రియల్ ఎస్టేట్ మాఫియాను తన్ని తరుముదాం', 'సామ్రాజ్యవాదుల, సీబీబీ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడుదాం' అనే నినాదాలతో వర్గపోరాటాన్ని నడపాలి. ఈ ప్రాంతాల్లో అత్యధిక ప్రాంతాలను పట్టణ ఆర్గనైజేషన్‌లో భాగం చేయాల్సి వుంటుంది. ఆయా ప్రాంతాల నిర్దిష్టతల ఆధారంగా కొన్నింటిని గ్రామీణ ప్రాంతాల ఆర్గనైజేషన్‌లో భాగం చేయాల్సి వుంటుంది.

కొండలు, గుట్టలు, అడవులతో వున్న ప్రాంతాల్లో ఆదివాసులు అధికంగా వుంటారు. కాబట్టి ఈ ప్రాంతంలో 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం పోరాడండి' అనేది ప్రధాన నినాదంగా వుంటుంది. ఈ నినాదం ప్రధానంగా సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకు, దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకమైనది. ఈ ప్రాంతాల్లో భారతదేశ విప్లవానికి టార్గెట్లయిన సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు, భూస్వాములకు, దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడిపించాలి. ఈ స్పష్టతతో మనం ఆదివాసీ, గైరాదివాసీ ప్రజానుకూల పెత్తందార్లను, పూజార్లను సామ్రాజ్యవాద, సీబీబీ వ్యతిరేక ఐక్యసంఘటనలో భాగస్వామ్ముల్ని చేయాలి. ఈ ప్రాంతాల్లో వుండే ఆదివాసీ, గైరాదివాసీ భూస్వాములకు వ్యతిరేకంగా 'దున్నేవారికే భూమి చెందాలి' అనే నినాదంతో పోరాటాలు చేయాలి.

ప్రపంచీకరణ మొదలైన తర్వాత సముద్రతీర ప్రాంతాల్లో/కోస్తా ప్రాంతాల్లో ప్రాకృతిక వనరులను కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద, సీబీబీ కార్పొరేట్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో కొత్త ఓడరేవుల నిర్మాణం, పాత ఓడరేవుల విస్తరణ, ఎస్ఈజెడ్‌ల నిర్మాణం-విస్తరణ, కోస్టల్ కారిడార్ల నిర్మాణం, పెట్రో కెమికల్స్ పరిశ్రమల స్థాపన, రిసార్టుల నిర్మాణం, కోస్తా ప్రాంతాలలో పర్యటక కేంద్రాలను అభివృద్ధి చేయడం, తీర ప్రాంత జలాల్లో పవర్ బోట్ల ద్వారా చేపలు పట్టడం, ఉప్పు తయారీ యూనిట్ల నిర్మాణం వగైరాలతో ఆ ప్రాంతాల ప్రజానీకం తీవ్రంగా విస్థాపన సమస్యను ఎదుర్కొంటున్నారు. కాబట్టి 'కోస్తా ప్రాంత ప్రాకృతిక వనరులపై ప్రజలకే అధికారం', 'కోస్తా ప్రాంత వనరులను కొల్లగొడుతున్న సామ్రాజ్యవాద, సీబీబీ కార్పొరేట్లను తన్ని తరుముదాం', 'ప్రాకృతిక వనరులను కాపాడుకుందాం', 'తీర ప్రాంత జలాల్లో కార్పొరేట్లు సాగించే చేపల వేటను నిషేధించాలి,

తీర ప్రాంత జలాలపై మత్స్యకారులకే అధికారం', 'కోస్తా ప్రాంతాల పర్యావరణ వినాశనానికి కారణమవుతున్న దేశ, విదేశీ కార్పొరేట్లను తన్ని తరుముదాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే నినాదాలను ఇవ్వాలి. ఇక్కడ ప్రధానంగా సామ్రాజ్యవాద, సీబీబీకి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడపాలి.

వెనకబడిన దేశాల వ్యవసాయ రంగాల్లో దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలు చొచ్చుకరావడానికి, కాంట్రాక్టు, కార్పొరేట్ వ్యవసాయం ద్వారా ఆ రంగాన్ని కబ్జా చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దీంతో రానున్న రోజుల్లో మన దేశంలోని భూమి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల వద్ద కేంద్రీకరించబడుతుంది. 2020-21లో జరిగిన రైతాంగ పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ చట్టాలను తాత్కాలికంగా ఉ పసంహరించుకున్నప్పటికీ మన దేశ వ్యవసాయ రంగ కార్పొరేటీకరణ ప్రమాదం ఇప్పటికీ కొనసాగుతోంది. అందుకే పైన పేర్కొన్న అన్ని రకాల ప్రాంతాల్లో 'మన భూముల్ని కబ్జా చేయడానికి వస్తున్న స్వదేశీ, విదేశీ కార్పొరేట్లను తన్నితరుముదాం, మన భూముల్ని కాపాడుకుందాం', 'భూముల్ని లీజుకు తీసుకునే, కొనుగోలు చేసే అధికారం స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు వుండకూడదు', 'కాంట్రాక్టు, కార్పొరేట్ వ్యవసాయాన్ని నిషేధించాలి' అనే డిమాండ్లతో పోరాటాలు చేపట్టాలి. అలాగే రైతాంగపు భూముల్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగించే ఉద్దేశ్యంతో భూముల డిజిటలైజేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమం (డీఐఆర్ఎమ్పీ), 'స్వామిత్వ' (ఎస్వీఏఎమ్ఐటీఏ) కార్యక్రమాన్ని నిలిపివేయాలనే డిమాండ్లతో పోరాటాలు చేపట్టాలి.

కులపీడనకు వ్యతిరేకంగా పైన పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో వర్గపోరాటాన్ని నడపాల్సిందే. అయితే సాపేక్షికంగా కులపీడన అధికంగా వున్నచోట ప్రత్యేకించి పీడక కులాల దురహంకారానికి, పీడక కులాలు దళితులపై చేసే దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి. దళిత సమస్య అంటే భూమి (జమీన్), ఆత్మగౌరవం (ఇజ్జత్), అధికారం (అధికారం/సత్తా) సమస్య. కాబట్టి 'భూమి కోసం, ఆత్మగౌరవం కోసం, అధికారం కోసం పోరాడండి', 'కులపీడనకు వ్యతిరేకంగా పోరాడండి', 'బ్రాహ్మణవాదానికి గోరీకట్టండి, కులతత్వాన్ని విడనాడండి, యావత్తు శ్రమజీవులను ఐక్యం చేయండి' నినాదాలతో దళితుల్ని సమీకరించి వర్గపోరాటాన్ని నడపాలి. కుల దురహంకార దాడులను ప్రతిఘటించడానికి ఆత్మరక్షణ దళాలను ఏర్పాటు చేయాలి. అగ్రకులాలు దళితులపై చేసే దాడులను తిప్పికొట్టాలి. ఆ దాడులకు కారకులైన వారిలో కీలకమైన వారిని నిర్మూలించాలి. కుల దురహంకారాన్ని వ్యవస్థీకృతం చేసే హిందుత్వ, భూస్వామ్య శక్తులను భావజాల, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఎదుర్కోవాలి. 'సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడుదాం-నూతన ప్రజాస్వామికాన్ని స్థాపిద్దాం','దోపిడీ వ్యవస్థ రద్దుకై పోరాడుదాం-కుల నిర్మూలనకై పోరాడుదాం-సోషలిజం-కమ్యూనిజం స్థాపిద్దాం' నినాదాలతో దళితులను సమీకరించాలి.

ప్రపంచీకరణ తర్వాత అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో సామ్రాజ్యవాద, సీబీబీ, భూస్వామ్య వర్గాల కుమ్మక్కు మరింతగా పెరిగింది. కాబట్టి ఆయా ప్రాంతాల్లో కేవలం ఒకే వర్గానికి వ్యతిరేకంగా పోరాటం నడపలేము. ఈ మూడు ప్రాంతాల్లో కూడా ఈ కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని నడపాలి. కేంద్రకమిటీ విడుదల చేసిన 'భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం' డాక్యుమెంట్‌లో సమాజంలోని పీడిత వర్గాలకు, పీడిత సామాజిక సెక్షన్లకు, పీడిత జాతులకు చెందిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ సమస్యలపై 36 ప్రధాన అంశాలతో కూడిన రాజకీయ కార్యక్రమం వుంది. ఉద్యమ బలాబలాల ఆధారంగా దేశంలో 36 ప్రధాన అంశాలతో కూడిన రాజకీయ కార్యక్రమం ఆధారంగా వర్గపోరాటాన్ని నడపాలి. ప్రత్యేకించి సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా నిర్దిష్టంగా ఈ కింది రాజకీయ కార్యక్రమాన్ని అమలు చేయాలి:

- యావత్తు విదేశీ కంపెనీల/సంస్థల, బ్రాహ్మణీయ హిందుత్వ బనియా–మార్వాడీ తదితర పీడక కులాధిపత్య దళారీ బడా బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల, వారి ప్రభుత్వాల కంపెనీల/సంస్థల పెట్టుబడులను, బ్యాంకులను, ఆస్తులను జప్తు చేసుకోవాలి. బహుళజాతి కంపెనీలను, సంస్థలను తరిమికొట్టాలి. వాటి ఆస్తులను జప్తు చేసుకోవాలి. విదేశీ ఆర్థిక/టెక్నికల్ తదితర కొలాబరేషన్లను, జాయింట్ వెంచర్లను రద్దు చేయాలి. బహుళజాతి సంస్థల ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి. ఎగుమతి–ఆధారిత, దిగుమతి–ఆధారిత విధానాలను రద్దు చేయాలి. విదేశీ మార్కెట్లపై, విదేశీ టెక్నాలజీపై మన దేశ ఉత్పత్తుల పరాధీనతను తొలగించాలి. దేశీ మార్కెట్లను విదేశీ సరుకుల నుంచి పరిరక్షించాలి. విదేశీ మదుపులను ఆకర్షించేందుకు రూపొందించిన టూరిజం విధానం, ఐటీ విధానం, అనిమేషన్ విధానం, ఫార్మా విధానం, స్టార్టప్ విధానం మొదలైన వాటిని రద్దు చేయాలి. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు వగైరా వంటి, పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం కింద అమలవుతున్న భారతమాల పథకం, సాగరమాల పథకం, ప్రత్యేక రవాణా కారిడార్ వంటి ప్రతిష్టాత్మక పథకాలను (ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులను) రద్దు చేయాలి. ఇవన్నీ సామ్రాజ్యవాద ప్రాయోజిత పథకాలే. ఎంఎన్‌సీలు–టీఎన్‌సీలు దేశ సంపదను, వనరులను, సూపర్ లాభాలను తరలించుకుపోవడాన్ని అడ్డుకోవాలి. 'అభివృద్ధి' పేరుతో ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగ ప్రజల, పట్టణ పేద ప్రజల బలవంతపు విస్థాపనలను అడ్డుకోవాలి.
- ప్రపంచీకరణ విధానాలను అందులో భాగంగా డబ్ల్యుటీఓ ఒప్పందాలను రద్దు చేయాలి. స్వావలంబ వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను అభివృద్ధి చేసేందుకై కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల, జాతుల ప్రజలను సంఘటితం చేయాలి.
- అన్ని రకాల విదేశీ అప్పులను రద్దు చేయాలి.

- రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, బిల్ గేట్స్ ఫౌండేషన్ వంటి సామ్రాజ్యవాద ప్రాయోజిత వివిధ ఫౌండేషన్లను, సామ్రాజ్యవాద నిధులతో నడిచే వివిధ ఎన్‌జీఓ సంస్థలను బహిర్గతం చేయాలి. "అధ్యయనాలు", "కోర్సులు", "అవార్డులు", "సంక్షేమం", "సహాయం", "సామాజ సేవ" తదితర పేర్లతో అవి చేపట్టే కార్యక్రమాలను బహిష్కరించాలి. వాటిని దేశం నుంచి తరిమికొట్టాలి.
- నిరుద్యోగాన్ని పెంచే టెక్నాలజీలను ప్రవేశపెట్టడాన్ని అడ్డుకోవాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి.
- ఎంఎన్‌సీల, భారతదేశ సీబీబీ కార్పొరేట్ కంపెనీల ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాల ద్వారా సంక్షోభంలో చిక్కుకున్న మధ్యతరగతి వర్గంలోని వివిధ సెక్షన్లను సమీకరించి మిలిటెంట్ ప్రజా పోరాటాలను నిర్మించాలి.
- దేశీయ పరిశ్రమల్ని, చిన్న తరహా (ఎంఎస్‌ఎంఈ) రంగాన్ని పరిరక్షించాలి. జాతీయ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలి.
- దళితులు, ఆదివాసులు, మహిళలు, ముస్లిములు, క్రిస్టియన్లు తదితర మత మైనారిటీల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలపై తక్షణ, దీర్ఘకాలిక కార్యక్రమాలు చేపట్టి విశాల ప్రజా పోరాటాలను నిర్మించాలి.
- సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని, విలువలను వ్యతిరేకించాలి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా, దాని అభివృద్ధినిరోధక భావజాలానికి వ్యతిరేకంగా నిరంతరం పునాదిలోనూ, ఉపరితలంలోనూ పోరాడాలి. నిజమైన ప్రజాస్వామిక విలువల, సూత్రాల పునాదిపై ఆధారపడి నూతన సంస్కృతి, నూతన విలువలతో కూడిన నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నిర్మించాలి. మతం కచ్చితంగా వ్యక్తిగత వ్యవహారంగా మాత్రమే ఉండాలి. యావత్తు రూపాలలోని పితృస్వామ్యాన్ని, కులతత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. కులం, మతం, ఆర్థిక లేదా విద్యా స్థాయితో సంబంధం లేకుండా యావన్మందికీ న్యాయం, సమానత్వం, పరస్పర గౌరవం పునాదిగా మానవ సంబంధాలను నిర్మించాలి. యావత్తు ఆర్థిక, సామాజిక దోపిడీ రూపాలను వ్యతిరేకించే సూత్రంపై నిలబడాలి.
- దేశవ్యాప్తంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామికీకరణను ప్రోత్సహించాలి. నిజమైన ఆధునీకరణ వైపు, యావత్తు దేశ అభివృద్ధి వైపు (నేడు చేస్తున్నట్లుగా జేబులు నింపుకోవడం కాకుండా) సాగాలి. స్వావలంబ ఆర్థిక వ్యవస్థను నిర్మించాలి. ధనికులకూ, పేదలకూ మధ్య అసమానతలు రూపుమాపేందుకు ప్రజా అనుకూల బడ్జెట్లతో పాటు ప్రత్యేక పథకాలు రూపొందించాలి.
  - అధిక పన్నులకు, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడాలి. దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న 80 కోట్ల మంది పేదలపై పన్నులను రద్దు చేయాలి. వారి జీవన ప్రమాణాలు పెంచే విధంగా సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి అవినీతికి తావులేకుండా వాటిని

అమలు చేయాలి. వారికి ఆహార భద్రత కల్పించాలి. ప్రైవేటురంగానికి అప్పగించిన ఆహార ధాన్యాల సేకరణను ప్రభుత్వమే చేపట్టాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి. కనీస ధరలకే నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు తగిన పరిమాణంలో అందించాలి.

- దేశ ప్రజలకు కూడు, గూడు, గుడ్డ, ఉపాధి, విద్య, వైద్యం, స్వచ్ఛమైన గాలి, నీరు, మౌలిక హక్కులు, పౌరహక్కులు మొదలైనవాటికి హామీ ఉండేలా పోరాటాలు చేపట్టాలి.
- కాషాయీకరణ–ప్రైవేటీకరణ–కార్పొరేటీకరణకు మార్గం సుగమం చేస్తూ, బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలంతో కూడిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలి. కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలి.
- దేశంలో సోషలిస్టు పరివర్తన తెచ్చేందుకు మొదటి అడుగుగా ఫెడరల్ డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ ఇండియాను నిర్మించాలి. ఎందుకంటే మన దేశాన్ని సామ్రాజ్యవాద కబందహస్తాల నుంచి సమర్థవంతంగా విముక్తి చేసేది సోషలిజం మాత్రమే.

- కశ్మీర్ జాతితో పాటు నగాలు, మణిపురీలు, అసామీలు, ఈశాన్య ప్రాంతంలోని తదితర పీడిత జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు కోసం సాగిస్తున్న న్యాయమైన జాతుల విముక్తి పోరాటాలలో మనం భాగస్వామ్యం కావాలి. వాటికి నాయకత్వం అందించాలి. జాతి మైనారిటీలకు, ప్రాదుర్భావ జాతులకు సంబంధించిన ప్రతి ప్రజాస్వామిక డిమాండ్ల కోసం – సమానహోదా, ప్రత్యేక రాష్ట్రం, స్వయంప్రతిపత్తి తదితర డిమాండ్ల కోసం పోరాడాలి. వివిధ ఆదివాసీ తెగలకు రాజకీయ స్వయంనిర్ణయాధికారం/ స్వయంప్రతిపత్తి కల్పించాలి. ఫెడరల్ ప్రాతిపదికపై ప్రజాస్వామిక ప్రజా రిపబ్లిక్‌ను స్థాపించి రాష్ట్రాలకు న్యాయమైన అన్ని అధికారాలను కల్పించాలి. వెనుకబడిన ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి. నదీజలాల వాటాల సమస్యలను, సరిహద్దు సమస్యలను న్యాయంగా పరిష్కరించాలి.
- భారతదేశ దళారీ పాలకవర్గాల విస్తరణవాద విధానాలను, 'భారత' జాతి, 'హిందూ' జాతి భావనను, దక్షిణాసియా దేశాలన్నింటినీ ఆక్రమించి 'అఖండ భారత్' స్థాపన కోసం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు చేస్తున్న కుట్రలను బహిర్గతం చేసి ఓడించాలి.
- పర్యావరణ పరిరక్షణకై మూడు మహా పర్వతాలను కూలదోసే లక్ష్యంతో విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాతో పనిచేయాలి.

దోపిడీ, పీడనలకు గురవుతున్న కార్మికులు, వివిధ రంగాల శ్రామికులు తమ ఆర్థిక, రాజకీయ సమస్యలపై రోజు రోజుకూ మిలిటెంట్ పోరాటాలకు దిగుతున్నారు. అయితే 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో 74 శాతంగా వుండి గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న రైతాంగపు భాగస్వామ్యం లేకుండా సామ్రాజ్యవాద/దళారీ ముఠాకు వ్యతిరేకంగా ఏ పోరాటమూ విజయవంతం కాదు. వ్యవసాయ కూలీలు, పేద రైతులతో పాటు, మధ్యతరగతి, ధనిక రైతులు సామ్రాజ్యవాదుల,

భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల దోపిడీకి, అణచివేతకు గురవుతారు. గ్రామసీమల్లో నివసిస్తున్న నూటికి 70 మందిగా వున్న వ్యవసాయ కూలీలను, పేద రైతులను కార్మికవర్గ నాయకత్వం కింద సమైక్యం చేయాలి. దృఢమైన మిత్రుడైన మధ్యతరగతి రైతాంగంపై ఆధారపడుతూ, ఊగిసలాడే మిత్రుడైన ధనిక రైతాంగాన్ని వీలైనంత వరకు విప్లవ పక్షం వైపు నిలబెట్టుకోవాలి.

నూతన ప్రజాస్వామిక విప్లవంలో పెటీబూర్జువా వర్గం ప్రత్యేకించి విద్యార్థులు, టీచర్లు, మేధావులు ఒక ముఖ్యమైన శక్తిగా ఉంటారు. వారు మిలిటెంట్ స్వభావాన్ని కలిగి ఉండడమే కాకుండా ప్రజా శత్రువులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని నిర్మించడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. అలాగే పెటీబూర్జువా వర్గంలో భాగమైన చిన్న వ్యాపారులను, చేతివృత్తుల వారిని విప్లవోద్యమంలో సమీకరించాలి.

జాతీయ బూర్జువా వర్గం ఊగిసలాడే మిత్రవర్గంగా ఉంటుంది. ఇందులో చాలా మంది చిన్నతరహా పరిశ్రమల రంగానికి చెందినవారుగా ఉంటారు. సొంత శ్రమ ద్వారా లభించే దానికంటే ఎక్కువగా దోపిడీపైనే ఆధారపడే వృత్తులవారు ఇందులోకే వస్తారు. ఎంఎన్‌సీ-టీఎన్‌సీల, దళారుల బడా పెట్టుబడి చేత, నోట్‌బందీ, జీఎస్‌టీ వంటి ప్రభుత్వ విధానాల చేత వారు తీవ్రంగా పీడించబడుతూ ఉన్నారు. పోరాటాల మొదటి దశలో వారు బహిరంగంగా ఉద్యమంలో చేరనప్పటికీ, ఒక సెక్షన్ దానికి అత్యంత ఉపయోగకరమైన పలు మార్గాలలో మద్దతునిస్తుంది.

కులం, పితృస్వామ్యం, మతతత్వం వంటి వివిధ సామాజిక అణచివేతలతో అదనపు పీడనను ఎదుర్కొంటున్న దళితుల్లో, ఆదివాసుల్లో, మహిళల్లో, మత మైనారిటీల్లో విశాల సెక్షన్లను ఈ పోరాటాలలో సమీకరించాలి. ఆర్ఎస్ఎస్-బీజేపీకి చెందిన మోదీ ముఠా అమలు చేస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా మిలిటెంటు పోరాటాలలోకి ఈ సెక్షన్లను సమీకరించాలి.

పీడిత జాతులతో ప్రత్యేకించి భారతదేశ పాలకులకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టుకున్న జాతులతో ఐక్యసంఘటనను ఏర్పరచుకొని ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించడం చాలా ముఖ్యమైన అంశం.

**పెటీబూర్జువా పార్టీలు:** దేశంలోని అనేక ఎమ్.ఎల్. పార్టీలు, చిన్న చిన్న దళిత బహుజన పార్టీలు పార్లమెంటు లోపల, పార్లమెంటు వెలుపల ఉన్నాయి. అవి మౌలికంగా పెటీబూర్జువా స్వభావం గల పార్టీలు. కాబట్టి వాటితో ఐక్యమై దేశంలో గ్లోబలైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి. ఈ శక్తులు ఎంత ఊగిసలాడేవిగా ఉన్నా, ఎంత తక్కువ సమయం కలిసి వచ్చేవి అయినా వాటిని సమస్యల ప్రాతిపదికన పోరాటంలోకి సమీకరించేందుకు కృషి చేయాలి. అవి సామ్రాజ్యవాదం సాగించే పర్యావరణ విధ్వంసం, మహిళల పీడన, నిరుద్యోగం, మొదలైనటువంటి ఒకే ఒక అంశాన్ని తీసుకుని ముందుకు రావచ్చు. కానీ అవి నిజంగా ప్రజలను సమీకరించేవిగా ఉండాలి. అవి ట్రేడ్ యూనియన్లు కావచ్చు లేదా తమపై దాడులను ప్రతిఘటించాలని కోరుకునే కార్మికుల, రైతుల గ్రూపులు కావచ్చు.

**వివిధ సంఘాలు, వ్యక్తులు:** దీంతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను పోషిస్తున్న,

ప్రత్యేకించి ఏ గ్రూపు లేదా సంఘంలో భాగంగా లేని వ్యక్తులను తప్పనిసరిగా ఈ పోరాటంలోకి తీసుకొనిరావాలి. దీని ద్వారా గుర్తించబడేలా ప్రోత్సహించాలి. సామ్రాజ్యవాదులు/దళారులు ఎంత వినాశకరంగా మారితే అంతగా అటువంటి మేధావులు సైతం ముందుకు వస్తారు. తాము ఒంటరిగా లేమనీ పెరుగుతున్న ప్రగతిశీల శక్తుల వెల్లువలో భాగంగా ఉన్నామని వారు గుర్తిస్తే మాట్లాడేందుకు వారికి మరింత విశ్వాసం ఏర్పడుతుంది.

పాలకవర్గాల మధ్య వైరుధ్యం నూతన ప్రజాస్వామిక విప్లవంలో ప్రత్యేకించి ఒక ముఖ్యమైన అంశం – సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలలో సంక్షోభం పెరిగే కొలదీ, దీని ప్రభావం భారతదేశంపై పడుతుంది. పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు తీవ్రతరమవుతాయి. ఈ వైరుధ్యాలు ఇప్పటికే తలెత్తడం మొదలైంది. శత్రువును మరింతగా ఒంటరి చేసేందుకు, ఒక బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, సీబీబీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో ప్రజాస్వామిక శక్తులను సంఘటితం చేసేందుకు ఈ వైరుధ్యాలను నైపుణ్యంగా వినియోగించుకోవాలి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల విషయంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో యావత్తు ప్రధాన పార్లమెంటరీ పార్టీల మధ్య ఎటువంటి మౌలిక వ్యత్యాసం లేదు. అవి ప్రతిపక్షంగా ఉన్నప్పుడు చెప్పిన మాటలకు అధికారంలో ఉన్నప్పుడు కట్టుబడవు, సామ్రాజ్యవాదుల డిమాండ్లను నెరవేర్చేందుకు వేగిరపడుతూ అవి పరస్పరం పోటీపడుతుంటాయి. ప్రాంతీయ పార్టీలు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా కేంద్రంలో సైతం సామ్రాజ్యవాద నిర్దేశిత ప్రపంచీకరణను అమలు చేయడంలో విశ్వసనీయమైన ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పరిపాలించే రాష్ట్రాలలో అవి అవకాశవాదంతో లొంగిపోతున్నాయి. యావత్తు ఇతర పార్టీల వైఖరి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఈ దళారీ, రివిజనిస్టు పార్టీలు ఏవైనా ఒక నిర్దిష్ట విధానంపై కొంత వ్యతిరేకత ఉన్నా లేదా చర్య చేపట్టినా, అది ఓట్ల కోసం ఎత్తుగడగా అయినా లేదా ఒక వ్యాపార లాబీకి వ్యతిరేకంగా మరొకదానికి మద్దతు ఇచ్చేదిగా అయినా ఉంటుంది. అందువల్ల, ఈ పాలకవర్గ పార్టీలలో ఏదైనా గానీ వివిధ సందర్భాలలో చేపట్టే నిర్దిష్ట వైఖరులు ప్రజలలో ఉన్న అసంతృప్తిని ఉపయోగించడానికి, వారిని పక్కదారి పట్టించడానికి ఉద్దేశించినవే.

వారి మధ్య వైరుధ్యాలను మనం ఉద్యమ ప్రయోజనం కోసం ఉపయోగించుకోవచ్చు కానీ వారిని సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులుగా అర్థం చేసుకోకూడదు. వారి మధ్య వైరుధ్యాలను ఎంత వరకూ ఉపయోగించుకోగలుగుతామనేది పోరాటంలో కార్మికవర్గ శక్తుల బలంపై ఆధారపడి ఉ ంటుందనేది తెలిసిందే. ఇక్కడ ముఖ్యమైన కర్తవ్యం ఏమిటంటే ఈ పార్టీలను పూర్తిగా బహిర్గతం చేయడం, స్థిరమైన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వ్యతిరేక కార్యక్రమంపై ఆధారపడి ఆ పార్టీల కేడర్లను మనవైపు తిప్పుకోవడం. మనం ప్రత్యేకించి బహిర్గతం చేయాల్సిందేమిటంటే, ఈ పార్టీలన్నీ దేశద్రోహ పార్టీలే; ఇవి విదేశీ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి; ఈ పార్టీలే విదేశీ శక్తులతో మిలాఖత్ అవుతున్నాయి. ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే, సుడిగాలి లాగా లేచి ఈ పార్టీలను తన్నితరుముతారు, ప్రజలలో ఈ స్పృహను

పెద్దెత్తున పెంపొందించడం ద్వారా ఆ పోరాట వెల్లువను సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా మనం మళ్లించగలుగుతాం.

రివిజనిస్టులు నాయకత్వం వహించే ప్రజా ఉద్యమాలతోనూ, ప్రజాసంఘాలతోనూ స్పష్టమైన విభజన రేఖను గీసుకోవడం అత్యంత ఆవశ్యకం. దేశంలోని విభిన్న ప్రాంతాలలో భిన్న పరిస్థితులను బట్టి నిర్మాణ, పోరాట రూపాలు మారుతుంటాయి. ప్రజా పోరాటాలు, ప్రజా ఉద్యమాలు సాయుధ పోరాటానికి, ప్రజాయుద్ధానికి దోహదపడతాయి. అలాగే ప్రజా వుద్యమం మరింతగా పురోగమించడానికి సాయుధ పోరాటం, ప్రజాయుద్ధం దోహదపడతాయి. ఇదీ ప్రజా పోరాటానికీ, సాయుధ పోరాటానికి మధ్య వున్న గతితార్కికమైన పరస్పర సంబంధం. సాయుధ పోరాటాన్ని ఇతర పోరాట రూపాలతో సమన్వయించకపోయినట్లయితే విప్లవం విజయాన్ని సాధించలేదు. అందుచేత సాయుధ పోరాటం, ఇతర రూపాలలోని పోరాటాలు రెండూ కూడా తప్పనిసరి.

కార్మిక పోరాటాలు, మురికివాడల్లో, తదితర బస్తీలలో జరిగే పోరాటాలు, యువజన పోరాటాలు, నిరుద్యోగుల పోరాటాలు, విద్యార్థి పోరాటాలు, మహిళా పోరాటాలు విశాల ప్రజారాశులను రాజకీయంగా సమీకరించడానికి దోహదపడతాయి. పాలకవర్గాల వివిధ విధానాలకు వ్యతిరేకంగా రాజకీయంగా ప్రజారాశులను సమీకరించడం అనే ముఖ్యమైన అంశాన్ని విస్మరించరాదు.

వర్గ విశ్లేషణ, సామాజిక పరిశీలన ఎంత వస్తుగతమైనదిగా కనిపించినప్పటికీ, అవి గనుక మన దైనందిన కార్యకలాపాలతో ఎలాంటి సంబంధాన్ని కలిగి వుండనట్లయితే, భారత జనాభాలో అత్యధిక మెజారిటీగా వున్న, కార్మికవర్గానికి దృఢమైన, అత్యంత నమ్మకమైన మిత్రునిగా వుండే, విప్లవంలో ప్రధాన శక్తి అయిన రైతాంగం (ప్రత్యేకించి, పేద, భూమిలేని రైతాంగం) చురుకైన మద్దతు, దృఢమైన భాగస్వామ్య పాత్ర లేనిదే నిజమైన అర్థంలో విప్లవయుద్ధం, నిజమైన అర్థంలో విప్లవానికి ఆయుధాలుగా విప్లవ పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన – వీటిలో ఏదీ కూడా నిర్మితం కాజాలదు. అందువల్ల కార్మికవర్గం, రైతాంగం, యువజనులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మొదలైన ప్రజారాశులను అసంఖ్యాకమైన పోరాటాలలోకి సమీకరించాలి. ఆ పోరాటాల క్రమంలో వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేయాలి. తద్వారానే వారు దోపిడీ వర్గాల రాజ్యాధికారాన్ని కూలదోయవలసిన అవసరాన్ని గుర్తించగలుగుతారు. పీడక రాజ్య యంత్రాంగాన్ని కూలదోయడానికి అవసరమైన చైతన్యాన్ని, సమిష్టి సంకల్పాన్ని వారు సమకూర్చుకోగలుగుతారు.

# రాజకీయ ఎత్తుగడల నినాదాలు

- సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేయండి.
- దేశ, విదేశీ కార్పొరేట్ల అన్నిరకాల దోపిడికి వ్యతిరేకంగా పోరాడండి.
- జాతీయవాదం పేరుతో దేశాన్ని సామ్రాజ్యవాదానికి తెగనమ్ముతున్న బీజేపీ మోడి ప్రభుత్వ దేశద్రోహకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి.
- దున్నేవారికే భూమి చెందాలి.
- నీరు, అడవి, భూమి, ఆత్మగౌరవం, అధికారం కోసం పోరాడండి.
- పర్యావరణ పరిరక్షణకై పోరాడండి.
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కాజువల్, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి. అందరిని పర్మనెంట్ చేయాలి. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలి.
- విద్యా, వైద్య రంగాలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకించండి.
- సామ్రాజ్యవాద, సీబీబీ, భూస్వామ్య ప్రయోజనాలకు సేవ చేసే నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడండి.
- మత మైనారిటీలపై బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదుల దాడులను ఖండించండి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడండి.
- దళితులపై పీడక కులాల దాడులను ప్రతిఘటించండి. అన్నిరకాల కుల వివక్షతకు, కుల పీడనకు వ్యతిరేకంగా పోరాడండి.
- పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడండి, మహిళలపై అన్నిరకాల దాడులకు వ్యతిరేకంగా పోరాడండి.
- జాతుల స్వేచ్ఛా, సమానత్వం, స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడండి.
- నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.